శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

ఆప్ ర్యాలీ అడ్డగింత

రాజీనామా చేస్తే.. నిమిషాల్లో ఆమోదిస్తాం : కర్ణాటక సీఎం

డిజిటల్ మోసాలపై సుప్రీంకోర్టు సీరియస్ 07

సంపుటి 09, సంచిక: 246 | బుధవారం | 05-08-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## ప్రధాని క్షమాభిక్ష అవసరం లేదు

- మోదీ ప్రభుత్వ చర్యలపై ఆయన క్షమాపణలు చెప్పాల్సిందే...
- భారత విద్యార్థుల్లో తీవ్ర వేదన
- వైకో రాసిన పుస్తక ఆవిష్కరణ సభలో రాహుల్‌గాంధీ ఉద్ఘాటన

**న్యూఢిల్లీ :** దేశంలోని విద్యార్థులు తీవ్ర వేదనలో ఉన్నారని, వారికి ప్రధాని నరేంద్ర మోదీ నుండి 'క్షమాభిక్ష' అక్కర్లేదని, తమపై ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ఆయన 'క్షమాపణ' చెప్పి తీరాల్సిందేనని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. మాజీ ఎంపి వైకో రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించే కార్యక్రమంలో పాల్గొన్న రరాహుల్ గాంధీ, దేశ చరిత్రను మార్చడానికి ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ప్రయత్నాల వల్లే విద్యార్థులు వీధుల్లోకి వచ్చారని పేర్కొన్నారు. ఎవరైనా సరే తమ దేశ చరిత్రను కాలరాస్తే భారత్ సహించదని హెచ్చరించారు. ప్రతి రాష్ట్రానికి సమానమైన గౌరవం పొందే హక్కు, అలాగే తమ సొంత సంస్కృతిని, భాషను వ్యక్తపరిచే హక్కు ఉన్నాయన్నారు. కానీ, ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం తాము ఆమోదించే చరిత్రనే అందరూ అనుసరించాలని కోరుకుంటోంది, అందుకే ఈ పోరాటం జరుగుతోందన్నారు. 'విద్యార్థులు వీధుల్లో ఉంటూ తీవ్ర వేదన అనుభవిస్తున్న విచిత్రమైన పరిస్థితుల్లో మనం ఉన్నాం. వారికి ఉద్యోగాలు లేవు, పరీక్షల్లో న్యాయం, సమర్థవంతమైన విద్యా విధానం కోసం అడుగుతున్నారు. మరోవైపు, ప్రధాని వారిని క్షమిస్తానంటున్నారు. నన్ను లేదా వారిని క్షమించడానికి ఆయన ఎవరు? నన్ను లేదా భారతదేశ భవిష్యత్తును క్షమించగలననే ఆలోచన ఆయనకు ఎక్కడి నుండి వచ్చిందో నాకు అర్థం కావడం లేదు' అని అన్నారు. ప్రధాని లేదా తరువాయి 8లో

## ఎంబిబిఎస్, బిడిఎస్ ప్రవేశాలకు నోటిఫికేషన్

విడుదల చేసిన కాళోజీ హెల్త్ యూనివర్సిటీ

5 నుంచి 12 వరకు దరఖాస్తులు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి ఎంబిబిఎస్ , బిడిఎస్ కోర్సుల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా (కన్వీనర్ కోటా) సీట్లలో ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ మంగళవారం నోటిఫికేషన్‌ను విడుదల తరువాయి 8లో

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్

## ఉద్యమాలతోనే సింగరేణికి మణుగూరు గని

- చొరవ చూపిన సిఎం రేవంత్‌రెడ్డి, డిసిఎం భట్టి, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు
- 'ఎల్‌నినో'పై డాక్టర్ చిన్నారెడ్డి కమిటీ సిఫార్సులను అమలు చేయాలి
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయాలి
- అసెంబ్లీ వానాకాల సమావేశాలను కనీసం 10 రోజుల పాటు నిర్వహించాలని డిమాండ్



ప్రజాపక్షం/ హైదరాబాద్


రాష్ట్రానికి గుండె కాయ అయినా సింగరేణిని కాపాడేందుకు ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కలిసి సమగ్ర ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణుగూరు డీప్ బ్లాక్‌ను జెన్‌కోకు కట్టబెట్టి ఆ తర్వాత ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేశారని, అయితే రాష్ట్ర ప్రభుత్వ జోక్యం చేసుకుని ఈ కుట్రలను నిలువరించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. ఈ బ్లాక్ సింగరేణికి దక్కేలా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇదే తరహాలో సింగరేణిలోని అన్ని బొగ్గు గనులను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**చర్చల ద్వారా పరిష్కరించాం**

గుర్తింపు యూనియన్ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉద్యమ ఫలితంగానే మణుగూరు డీప్ బ్లాక్‌ను సింగరేణికి దక్కిందని చెప్పారు. జెన్‌కో ద్వారా ప్రైవేటు సంస్థ ఎఎంఆర్‌కు అప్పగించే ప్రయత్నాలు జరిగాయని, ఇదే జరిగితే సింగరేణి భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదం ఏర్పడేదని పేర్కొన్నారు. ఈ కుట్రలకు వ్యతిరేకంగా ఎఐటియుసి, సిపిఐ ఆధ్వర్యంలో తరువాయి 8లో

### రాష్ట్ర్యవాప్తంగా 6 నుంచి పాదయాత్రలు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 14 వరకు దేశవ్యాప్త పాదయాత్రలు, ప్రచార యాత్రలు నిర్వహించనున్నామని కూనంనేని తెలిపారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలో 'బదలావ్ జరూరీ హై' పేరుతో జాతీయ స్థాయి భారీ బహిరంగ సభ జరుగుతోందన్నారు. సెప్టెంబర్11 నుంచి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 22వ తేదీన సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు చెప్పారు.



## భారీ వర్షం.. అప్రమత్తం

ఆరు జిల్లాలకు వాతావరణ కేంద్రం హెచ్చరిక

మరో వారం రోజులూ వర్షాలే

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మరో వారం రోజులపాటు వర్షాలు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళవారం మధ్యాహ్నం విడుదల చేసిన వాతావరణ బులెటిన్‌లో పలు జిల్లాలకు భారీ వర్ష హెచ్చరిక జారీ చేసింది. మంగళ, బుధవారాల్లో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోని తరువాయి 12లో

## ఇక మండల స్థాయిలో 'ప్రజావాణి'

- ప్రజా సమస్యల పరిష్కారానికి సర్కార్ మరో కీలక అడుగు
- ప్రతి సోమవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఎంపిడిఓ కార్యాలయాల్లో నిర్వహణ


(ఫైల్ ఫొటో)

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు రాష్ట్ర, జిల్లా రెవెన్యూ డివిజన్ స్థాయిలలో అందుబాటులో ఉన్న 'ప్రజావాణి' కార్యక్రమాన్ని ఇప్పుడు మండల స్థాయికి విస్తరిస్తూ ప్రణాళికా శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలతోపాటు మే 4వ తేదీ నుంచి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణిని అమలు చేస్తున్న ప్రభుత్వం, ఫిర్యాదుల నమోదు, పరిష్కారం, పర్యవేక్షణ కోసం ఏకీకృత ప్రజావాణి పోర్టల్‌ను అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే. తాజాగా వికేంద్రీకరణలో మరో అడుగు ముందుకేస్తూ, మండల స్థాయిలోనూ తరువాయి 8లో



## రైస్ మిల్లర్లు ప్రతి గింజా లెక్క చెప్పాల్సిందే

- బియ్యం నిల్వలను దుర్వినియోగం చేస్తే ఉపేక్షించం
- పౌరసరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హెచ్చరిక
- నిజాయితీగల రైస్ మిల్లర్లకు సంపూర్ణ సహకారం అందిస్తామని భరోసా

ప్రజాపక్షం/హైదరాబాద్

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్)కు సంబంధించి రైస్ మిల్లర్లు ప్రతి గింజా లెక్క చెప్పాల్సిందేనని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రభుత్వానికి చెందిన ధాన్యం, బియ్యం నిల్వలను దారి మళ్లించడం, దుర్వినియోగం చేయడం, సిఎంఆర్ బకాయిలను సకాలంలో చెల్లించకుండా ప్రజాధనానికి నష్టం కలిగించడం లాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. అదే సమయంలో నిజాయితీగల రైస్ మిల్లర్లకు సంపూర్ణ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. మంగళవారం సచివాలయంలో గత దశాబ్దకాలంగా జరిగిన ధాన్యం సేకరణ, సిఎంఆర్ బకాయిలు, ఎఫ్‌సిఐకి అప్పగించిన బియ్యం, జిల్లాలు, మిల్లర్ల వారీగా పెండింగ్ డిఫాల్ట్‌లు, రికవరీల పురోగతి, విజిలెన్స్ కేసులు, న్యాయపరమైన చర్యలపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పౌర సరఫరా శాఖ అధికారులతో తరువాయి 8లో

## కల్తీ మసాలాలు సీజ్

- 13 మసాలా తయారీ కేంద్రాలపై మెరుపు దాడులు
- 25 టన్నులకు పైగా సరుకు పట్టివేత
- ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు ఉపయోగిస్తున్నారని హైదరాబాద్ సిపి సజ్జనార్ వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో కల్తీ మసాలా తయారీ కేంద్రాలే లక్ష్యంగా హెచ్‌ఫాస్ట్ బృందాలు మెరుపు దాడులు నిర్వహించినట్లు హైదరాబాద్ సిపి సజ్జనార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 13 మసాలా వ్యాపార సంస్థల్లో తరువాయి 8లో

## టి-ఫైబర్ తప్పనిసరి




సెప్టెంబర్ 1 నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలందించాలి


- ప్రైవేట్ ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దు
- అధికారులకు ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశం
- టి ఫైబర్‌తో ఏటా ప్రభుత్వానికి రూ.300–400 కోట్ల ఆదా

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి కేవలం టి–ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. ఆ గడువు తర్వాత ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సేవల కోసం ప్రైవేట్ ఆపరేటర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ బిల్లులు చెల్లించవద్దని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన టిఫైబర్ అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. టిఫైబర్ నెట్‌వర్క్‌ను పూర్తిస్థాయిలో వినియోగిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి ఏడాది రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశముందని తెలిపారు. అలాగే ఇంట్రానెట్ ఆధారిత సురక్షిత ఇంటర్నెట్ సేవల ద్వారా రాష్ట్ర డేటా సెంటర్‌తో అనుసంధానం ఏర్పడి, ప్రభుత్వ తరువాయి 12లో

## జార్ఖండ్, బిహార్‌లో వెల్లువెత్తిన నిరసనలు

పిఎస్‌సి ప్రశ్నాపత్రాల లీకేజీపై ఉద్యోగార్థులు, నీట్ పేపర్ లీకేజీపై విద్యార్థుల ఆందోళనలు





**రాంచీ/పాట్నా :** జార్ఖండ్, బిహార్ రాష్ట్రాలను ఉద్యోగార్థులు, విద్యార్థులు ఆందోళనలు, నిరసనలతో హోరెత్తించారు. బిహార్‌లో నీట్ పేపర్ లీకేజీపై ఆందోళనలు మళ్లీ మొదలుకాగా, నిరసనకారులను పోలీసులు వాటర్ కెనాన్‌తో చెదరగొట్టారు. పిఎస్‌సి పరీక్ష, ఇతర నియామక పరీక్షలలో జరిగిన ప్రశ్నపత్రాల లీకేజీలపై గత వారం రోజులుగా ఉద్యోగార్థులు నిరసన చేస్తున్నారు. రాష్ట్రం వెలుపలికి చెందిన విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తులతో కూడిన స్వతంత్ర కమిటీతో విచారణ జరిపించాలని మంగళవారం డిమాండ్ చేశారు. జులై 29 నుంచి రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరవధిక దీక్ష చేస్తున్న నిరసనకారులు, దర్యాప్తును సిఐడికి అప్పగించి జెఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వం ఈ విషయాన్ని 'కప్పిపుచ్చేందుకు' ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ నియామక కుంభకోణానికి భారీ ఆర్థిక లావాదేవీలు తరువాయి 12లో

# బంకీపూర్ ఉప ఎన్నిక ఏమి చెబుతోంది?

బీహార్ రాజధాని పట్నాలోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో ఓటర్ల తీర్పు బిజెపి జాతీయ నాయకత్వం అహంభావంపై దెబ్బ కొట్టింది. ఇది సాదాసీదా ఉప ఎన్నిక కాదు. భారతీయ జనతాపార్టీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గాన్ని ఆ పార్టీ కోల్పోయింది. ఎన్నికల వ్యూహకర్తగా పేరుపొందిన ప్రశాంత్ కిశోర్, 1995 నుంచి బిజెపి ఓటమి ఎరుగని బంకీపూర్ స్థానాన్ని కైవశం చేసుకున్నారు. అనేక రాజకీయ పరోక్ష, ప్రత్యక్ష పాత్రల తర్వాత 2024 అక్టోబర్ 2న జన సురాజ్‌పార్టీని నెలకోల్పిన ప్రశాంత్ కిశోర్ తన ద్వారా తన పార్టీకి శాసనసభలో స్థానం సంపాదించారు. గత సంవత్సరం బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 230 కి పైగా సీట్లలో పోటీచేసి ఒక్కస్థానం చేజిక్కించుకోలేకపోయిన పార్టీకి ఇంతలోనే ఈ మలుపు ఎలా వచ్చింది? బిజెపికి బలమైన మధ్యప్రదేశ్‌లో దతియా అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తన స్థానాన్ని నిలుపుకోవటం విశేషమైతే, రెండు దశాబ్దాలకుపైగా బిజెపి ఏలుబడిలో, 'దేశానికి మోడల్'గా ఉన్న గుజరాత్‌లో మంజల్‌పూర్ అసెంబ్లీ సీటును బిజెపి నిలబెట్టుకోగలిగినా, దాని మెజారిటీ తగ్గింది. 37.5శాతం ఓట్లే పోలయినాయి. పట్టణాల్లో బిజెపికున్న ఆధిక్యత మరోసారి రుజువైంది. వచ్చే ఏడాది చివరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున, ఈ ఉప ఎన్నికలో తగ్గిన మెజారిటీ బిజెపికి చిన్నపాటి హెచ్చరికలాంటిది. బంకీపూర్ ఉప ఎన్నికకున్న ప్రాముఖ్యత అది 1995 నుంచీ బిజెపికి తిరుగులేని సీటు. బిజెపి ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తండ్రి నవీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా 1995 నుంచి ఆ సీటుకు ప్రాతినిధ్యం వహించారు. ఆ తదుపరి 2010నుంచీ నబీన్ వరుసగా ఐదుసార్లు – 2025 ఎన్నికలు సహా గెలుచుకున్న సీటు. పార్టీ జాతీయ అధ్యక్షునిగా నియమించబడిన నబీన్ రాజ్యసభకు ఎన్నికై, అసెంబ్లీ సీటుకు రాజీనామా చేయటం వల్ల ప్రస్తుత ఉప ఎన్నిక అవసరమైంది. 'ఆ సీటులో బిజెపి అభ్యర్థిగా ఎవరిని నిలబెట్టినా, చివరకు కుక్కను లేదా పిల్లిని పెట్టిన గెలుస్తుందని' సీనియర్ నాయకుడు రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చినయి (ఆ తదుపరి ఆ మాటలను తాను అనలేదని ఆయన సర్దుకున్నారు – అది వేరు విషయం). అంత బలమైన సీటును 19324 ఓట్ల తేడాతో కోల్పోవటం బిహార్‌లోనే కాదు, వెలుపల కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం. 2025 ఎన్నికల్లో పోలైన ఓట్లలో నబీన్‌కు 62.66శాతం దక్కగా, ఇప్పుడు బిజెపి అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హా కు 34.40 శాతం ఓట్లే లభించాయి. పరిపూర్ణ సంఖ్యల్లో చూస్తే విజేత ప్రశాంత్ కిశోర్‌కు 64,151 ఓట్లు రాగా, సిన్హాకు 44,827 ఓట్లు, ఆర్‌జెడి అభ్యర్థికి 14,273 ఓట్లు లభించాయి. రెండు, జెడి(యు) నేత నితీశ్ కుమార్‌తో అధికారం పంచుకుంటూ , దశాబ్దాల పాటు ముఖ్యమంత్రి పదవి కోసం వేచి ఉన్న బిజెపి, కొద్దిమాసాల క్రితం నితీశ్‌కుమార్‌ని రాజ్యసభకు పంపి, తొలిసారి ముఖ్యమంత్రి పదవిని దక్కించుకున్న తదుపరి ఇది తొలి ఉప ఎన్నిక. అలాగే నీట్ ప్రశ్నాపత్రం, ఇతర ప్రశ్నాపత్రాల లీకేజికి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ జన్ –జీ తరం విద్యార్థులు తమ ఆందోళనతో మోదీ ప్రభుత్వం మెడలు వంచిన అనంతరం జరిగిన ఉప ఎన్నిక ఇది. పోలింగ్ 34శాతమే (2025 ఎన్నికల కన్నా 7శాతం తక్కువ) జరిగినందున బిజెపి సాంప్రదాయ ఓటర్లు చాలా మంది ఓటింగ్‌కు రాలేదని విదితమవుతున్నది. విద్యార్థుల ఆందోళన పట్ల మోదీ ప్రభుత్వం ప్రదర్శించిన దార్ష్టికానికి తల్లిదండ్రులుగా వారు ఆందోళన చెంది పోలింగ్‌కు దూరంగా ఉండవచ్చు. జెన్–జీ ఉద్యమ ప్రభావం ఈ ఉప ఎన్నికల్లోనే కాదు, ముమ్ముందు కూడా ఉంటుందనటానికి ఇదొక సూచన. అంతేకాదు, అభివృద్ధికి కేంద్రం – రాష్టంలో ఒకే పార్టీ ప్రభుత్వం ఉండాలని సిద్ధాంతీకరిస్తూ బిజెపి అదే పనిగా ప్రచారం చేస్తుండగా, బిహార్‌లో 'డబుల్ ఇంజిన్ సర్కార్' ఉండగా ఆపార్టీకి ఓటమి సంభవించింది. కులాల వారీ రాజకీయ విభజన, విధేయతకు నిలయమైన బిహార్‌లో ఈ ఉప ఎన్నిక ఆ విభజనను చెరిపివేసింది. ప్రశాంత్ కిశోర్‌కు అన్ని కులాలు, సముదాయాల్లోనుంచి తోడ్పాటు లభించింది. ఆయన పునాది స్థాయిలో ప్రచారంలో విద్య, ఉపాధి, సుపరిపాలన గూర్చి మాట్లాడారు. 'బిజెపి ఓడిపోతే, తమ వర్తనను, తమ లక్షణాన్ని, ప్రతిష్టను, పాలన తీరును బిహార్ ప్రజలు ఆమోదించటం లేదని ప్రభుత్వం అంగీకరించాలి, అని ఎన్నికల ఆరంభంలో డిమాండ్ చేసిన ప్రశాంత్ కిశోర్, తన విజయం అనంతరం ముఖ్యమంత్రి మార్పుగూర్చి బిజెపి నాయకత్వం ఆలోచించాలన్నారు. ఒక ఉప ఎన్నిక బిహార్‌లో పాదుకున్న సామాజిక పొందికలను మార్చలేదు. అయితే ఇదొక సూచిక. తాము ఏమి చేసినా చెల్లిపోతుందనే మోదీ–షా అహంభావపూరిత వైఖరిపై ప్రజల్లో పునరాలోచన మొదలైందనటానికి సంకేతం. 2027 ఆరంభంలో జరిగే గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి ఎదురుదెబ్బలు తగలవు అని భావించటానికి వీల్లేదని ఈ ఉప ఎన్నికల ఫలితాలు హెచ్చరిస్తున్నాయి. ●



## బంకీపూర్ ప్రజల తీర్పును అంగీకరిస్తున్నాం

బంకీపూర్ ప్రజల తీర్పును మేము అంగీకరిస్తున్నాము. వారు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ, బిహార్ సిఎం సామ్రాట్ చౌదరీకి వ్యతిరేకంగా ఓటు వేశారు. బిజెపి పట్ల ప్రజల్లో ఉన్న ఆగ్రహం స్పష్టంగా కనిపిస్తోంది. గత 150 రోజుల్లో సిఎం చేసిన ఒక్క ముఖ్యమైన నిర్మాణాత్మక పనిని చెప్పండి. బంకీపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో బిజెపికి ఎదురైన ఘోర పరాజయం సిఎం సామ్రాట్ చౌదరీ అనుసరించిన ప్రతికూల రాజకీయాల ఫలితమే. తక్కువ వ్యవధిలోనే బిజెపి రెండు ఎన్నికల (ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎ ఉప ఎన్నికల్లో) పరాజయాలను చవిచూసింది. దీనికి కారణం సిఎం, బిజెపి నేతల అహంకారమే.

తేజస్వీ యాదవ్,
బిహార్ శాసనసభ ప్రతిపక్ష నాయకుడు



నేడు వ్యోమగామి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జన్మదినం

# చందమామపై నాటి తొలి అడుగు

చంద్రమండలంపై కాలుమోపిన మొదటి వ్యోమగామి(ఆస్ట్రనాట్)గా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అంతరిక్ష చరిత్రలో చెరగని అరుదైన రికార్డును నెలకొల్పాడు. 5 ఆగష్టు 1930న ఓహియా నగరంలో జన్మించిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ పర్డ్యూ యూనివర్సిటీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ డిగ్రీని పూర్తి చేసి, సదరన్ కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఇంజనీకరింగ్ విభాగంలో పిజీ కూడా పూర్తి చేసారు. 1949–50 మధ్య కాలంలో నావల్ ఏవియేటర్‌గా, నేషనల్ అడ్వైజరీ కమిటీ ఫర్ ఏరోనాటిక్స్, నాసా(నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ ఆర్గనైజేషన్)లలో చేరిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్17 ఏండ్ల పాటు ఇంజనీర్‌గా సేవలు అందించారు. నాసాలో ప్రాజెక్ట్ పైలెట్‌గా దాదాపు 200 రకాల ఏయిర్‌క్రాఫ్ట్‌లు, జెట్స్, రాకెట్లు, హెలీకాప్టర్లు, గ్లైడర్స్‌ల్లో వై మానికుడిగా బహుముఖీన ప్రతిభను ప్రదర్శించారు. 1962లో ఆస్ట్రొనాట్ గా జెమిని8 మిషన్‌లో భాగంగా 1966లో అంతరిక్షయానం విజయవంతంగా పూర్తి చేశారు. అంతరిక్షంలో నెలకొన్న తీవ్ర వాతారణాన్ని తట్టుకుంటూ మానసికంగా దృఢ విశ్వాసంతో చంద్రమండల ప్రయాణం పూర్తి చేసిన ఆర్మ్‌స్ట్రాంగ్ చూపిన సాహస స్ఫూర్తి నేటి తరానికి ప్రేరణగా నిలుస్తున్నది.

### బహుముఖ ప్రజ్ఞాశాలి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్

నావల్ ఏవియేటర్, టెస్ట్ పైలెట్, యూనివర్సిటీ ప్రొఫెసర్, ఏరోనాటికల్ ఇంజనీర్ లాంటి పలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అపోలో11 ల్యూనార్ మాడ్యూల్ ప్రాజెక్ట్‌లో స్పేస్‌క్రాఫ్ట్ కమాండర్‌గా తొలి మానవసహిత చంద్రమండల ప్రయాణానికి నాయకుడిగా సిద్ధం అయ్యారు. 16 జూలై 1969 రోజున నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, పైలెట్ బజ్ ఆల్డ్రిన్, మైఖేల్ కోలిన్స్‌లతో కలిసి చంద్రమండల ప్రయాణం ఆరంభించారు. 2.4 లక్షల మైళ్ల ప్రయాణించి 20 జూలై 1969న చంద్రమండలానికి చేరుకున్నారు. అదే రోజు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ వ్యోమనౌక లోంచి బయటకు వచ్చి చందమామ ఉపరితలంపై తొలిసారి కాలుమోపి, రెండున్నర గంటల పాటు చంద్రుడిపై బజ్ ఆల్డ్రిన్‌తో కలిసి సంచరించాడు. వ్యోమనౌకలో ఉన్న మైఖేల్ కాలిన్స్ కక్షలో మాత్రమే పరిభ్రమించాడు. అంతరిక్ష చరిత్రలో మొదటి మానవుడిగా రికార్డును నెలకొల్పారు. ఈ అంతరిక్ష మిషన్‌లో మొత్తంగా 8 రోజులు, 14 గంటలు, 12 నిమిషాలు అంతరిక్షంలో గడిపారు. చందమామ ఉపరితలంపై కాలుమోపిన మరు క్షణమే భావోద్వేగాలకు గురి అయిన ఆర్మ్‌స్ట్రాంగ్ మాట్లాడుతూ చందమామ పై వేసిన ఓ చిన్న తొలి అడుగు, రేపటి మానవాళి అంతరిక్ష చరిత్రలో ఓ భారీ ముందడుగు అంటూ పేర్కొన్నారు. 16వ ఏట 1947లో నావల్ ఏయిర్ కెడెట్‌గా, 1971–79 మధ్య కాలంలో సిన్సినాటీ యూనివర్సిటీలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో ఆచార్యుడిగా, 1982–92 మధ్య కంప్యూటింగ్ టెక్నాలజీ ఫర్ ఏవియేషన్ విభాగానికి చైర్మన్‌గా ఆర్మ్‌స్ట్రాంగ్ సేవలు అందించారు. పలు ఏవియోషన్ సంఘాల్లో సభ్యుడిగా లేదా చైర్మన్‌గా పలు హోదాల్లో పని చేశారు. తన జీవితకాలంలో 17కు పైగా యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్లు పొంది పలు పురస్కారాలు స్వీకరించారు. ప్రెసిటెంట్స్ మెడల్, ఏవియేషన్ పురస్కారాలు, రాబర్ట్ ట్రోఫీలను అందుకున్నారు. 25 ఆగష్టు 2012న తన 82వ ఏట అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఆదర్శమయ జీవితం ఏరోనాటికల్ ఇంజనీర్స్, వ్యోమగాములకు దారి దీపంగా వెలుగులు చిమ్ముతూనే ఉంది. అద్భుత ధైర్యానికి మారుపేరుగా నిలిచిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జీవితం ఆసాంతం అంతరిక్ష శాస్త్రానికే అంకితం, నేటి ఆస్ట్రొనాట్స్‌కే ఆయన సాహసం ఆదర్శప్రాయం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

# ఇరాన్‌తో స్వతంత్ర సంబంధాలపై గల్ఫ్ దేశాల దృష్టి

నంటూ బెనర్జీ

ఆరు దేశాల గల్ఫ్ సహకార మండలి (జిసిసి)తో అమెరికా భాగస్వామ్యాన్ని కాపాడటానికి, యుద్ధం కారణంగా అవుతున్న భారీ ఆర్థిక వ్యయం నుండి తప్పించుకునేందుకు, ప్రస్తుత పరిస్థితి నుండి కనీసం త్వరితగతిన గౌరవప్రదమైన నిష్క్రమణ కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇరాన్ యుద్ధం వ్యయం పెంటగాన్ ప్రత్యక్ష ఖర్చుల రూపంలో ఇప్పటికే సుమారు 37.5 బిలియన్ డాలర్‌లకు చేరుకుంది. అయితే విస్తృత ఆర్థిక ప్రభావ అంచనాలు దీనికంటే చాలా ఎక్కువగా ఉన్నాయి. ఈ యుద్ధం జిసిసి సభ్య దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై తీవ్ర ప్రభావం చూపింది. ఈ దేశాలకు అమెరికా–ఇరాన్ యుద్ధంతో ప్రత్యక్ష సంబంధం లేనప్పటికీ, అవి తమ వద్ద భారీ అమెరికా సైనిక స్థావరాలను కలిగి ఉన్నందున, సహజంగానే యుద్ధ బాధితులుగా మారాయి. జిసిసి సభ్య దేశాలు తమ పౌర, ఇంధన, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలపై ఇరాన్ జరుపుతున్న విస్తృతమైన ప్రతీకార దాడులను ఎదుర్కొంటున్నాయి.

తటస్థత పేరుతో ఇరుపక్షాల మధ్య పోరాటానికి దూరంగా ఉండటానికి ప్రయత్నించినప్పటికీ, భౌగోళిక వ్యూహాత్మక వాస్తవాలు ఈ దేశాలను ఈ యుద్ధంలో లోతుగా బంధించాయి. కొనసాగుతున్న అమెరికా – ఇరాన్ సంఘర్షణలో గల్ఫ్ సహకార మండలి సభ్య దేశాలు ప్రత్యక్ష ప్రతీకార క్షిపణి దాడులు, ప్రధాన ఇంధన మౌలిక సదుపాయాల నష్టం, కీలక వాణిజ్య మార్గాల మూసివేత వంటి వాటితో తీవ్రంగా ప్రభావితమయ్యాయి. భారీ వ్యయంతో కూడిన అమెరికా రక్షణపై గల్ఫ్ దేశాలు విశ్వాసం కోల్పోతున్నాయి. ఈ దేశాలు అమెరికా సైనిక రక్షణ కోసం నేరుగా ఎలాంటి స్థిర మొత్తాన్ని చెల్లించనప్పటికీ, సంప్రదాయబద్ధంగా అమెరికా స్థావరాలకు ఆతిథ్యం ఇవ్వడం, బిలియన్‌ల కొలది అమెరికన్ సైనిక పరికరాలను కొనుగోలు చేయడం,అమెరికా మార్కెట్లలో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారా అవి పెద్ద మొత్తంలో తమ వంతు సహకరిస్తున్నాయి. సౌదీ అరేబియా, యుఎఇ వంటి జిసిసి సభ్య దేశాలు అధునాతన అమెరికా రక్షణ వ్యవస్థలు, విమానాలు, క్షిపణులను కొనుగోలు చేయడానికి భారీ మొత్తంలో ఖర్చు చేస్తుంటాయి. తమ భూభాగంలోని అమెరికా సైనిక స్థావరాల కోసం అవి భూమి, లాజిస్టిక్స్,వివిధ స్థాయిలలో ఆర్థిక సహాయాన్ని అందిస్తాయి.

అమెరికా సైనిక ఆస్తులు, సిబ్బందికి ఆతిథ్యం ఇస్తున్నందున, ఇరాన్ ఆ ఆరు జిసిసి సభ్య దేశాలను లక్ష్యంగా చేసుకుని గత మార్చి నుంచి వేలాది క్షిపణులు, డ్రోన్‌లను ప్రయోగించింది. ఇరాన్ క్షిపణులు కువైట్, బహ్రెయిన్‌లలోని విమానాశ్రయాలు, నివాస ప్రాంతాలు, కీలకమైన నీటి నిర్లవణీకరణ, విద్యుత్ ప్లాంట్లతో సహా సైనికేతర, పౌర మౌలిక సదుపాయాలపై గురి పెట్టి దాడి చేశాయి. ఇరాన్ నుంచి ఎదురవుతున్న సైనిక ముప్పులను అడ్డుకునేందుకు గల్ఫ్ అంతటా ఉన్న వాయు రక్షణ వ్యవస్థలు నిరంతరంగా, అధిక వ్యయంతో కూడిన క్రియాశీలతలోకి రావాల్సి వచ్చింది. హోర్ముజ్ జలసంధి వాస్తవంగా మూసివేయటం, ఖతార్‌లోని రాస్ లఫాన్ పారిశ్రామిక కేంద్రం వంటి సౌకర్యాలపై జరిగిన ప్రత్యక్ష దాడుల కారణంగా ప్రధాన చమురు, లిక్విడ్ నేచురల్ గ్యాస్ (ఎన్ఎన్‌జి) ఎగుమతులు నిలిచిపోయాయి లేదా భారీగా తగ్గిపోయాయి. అదే సమయంలో దుబాయ్, అబుదాబి, దోహాలలో పర్యాటకం, విమానయానం, ప్రధాన రవాణా కేంద్రాలు భారీగా పెట్టుబడులు తరలి పోవడంతో, సుదీర్ఘకాలం పాటు గగనతల మూసివేతలు, పదివేల విమాన ప్రయాణాల రద్దు వంటి వాటితో తీవ్రంగా దెబ్బతిన్నాయి.

> రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా తన ప్రధాన, సుదీర్ఘ సైనిక సంఘర్షణలను విజయంతో ము గించడం అరుదుగానే సంభవించటాన్ని గమనించాలి. దాని సుదీర్ఘ సైనిక సంఘర్షణలలో చాలా వరకు ప్రతిష్టంభనలతో, అగౌరవకరమైన నిష్క్రమణలతో ముగిశాయి. వాటిలో 1950--53 కొరియా యుద్ధం, 1955-75 వియత్నాం యుద్ధం, 2001-21 ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం. 2003-11 ఇరాక్ యుద్ధం ఉన్నాయి. కొరి యా యుద్ధం సంపూర్ణ విజయంతో కాకుండా కాల్పుల విరమణతో ముగిసింది. ఫలితంగా కొరియా ద్వీపకల్పం 38వ సమాంతర రేఖ వద్ద విభజించబడింది. వియత్నాం యుద్ధం సైనిక ఉపసంహరణతో, దక్షిణ వియత్నాం ఉత్త ర వియత్నాం వశమవ్వడంతో ముగిసింది. ఆఫ్ఘన్ యుద్ధం తాలిబాన్‌ను అధికారం నుండి తొలగించాలనే ప్రాథమిక లక్ష్యాన్ని సాధించినప్పటికీ, 20 ఏళ్ల ఆక్రమణ తర్వాత తాలిబాన్ పూర్తిస్థాయి పునరుజ్జీవంతో అది ముగిసింది. ఇరాక్ యుద్ధం సద్దాం హుస్సేన్‌ను విజయవంతంగా పదవీచ్యుతుడిని చేసింది. కానీ ఆ దేశంలో సుదీర్ఘమైన తిరుగుబాటు, ప్రాంతీయ అస్థిరతకు దారితీసింది



అయినప్పటికీ, బలహీనమైన కాల్పుల విరమణ ఒప్పందాలు, అస్థిరమైన నౌకా మార్గాలు, స్తంభించిపోయిన దౌత్యపరమైన చట్రాలు ప్రస్తుత ప్రతిష్టంభనను నిర్వచిస్తున్నందున, ఇరాన్‌తో సంఘర్షణ నుంచి అమెరికా గౌరవప్రదంగా వైదొలగడం అంతు చిక్కని సమస్యగానే ఉంది. అంతకుముందు, అమెరికా సైన్యం ఇరాన్ పై వరుసగా కొన్ని రోజుల పాటు వైమానిక దాడులను నిలిపివేయగా, టెహ్రాన్ కూడా అదే విధంగా తన ప్రతీకార చర్యలను నిలిపివేసింది. అయితే, ఉద్రిక్తత మరోసారి ముదురుతున్నట్లు కనిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు తరచుగా ఇరాన్ అధికారులతో అమెరికా 'అత్యంత స్నేహపూర్వక' 'సరైన' చర్చలు జరుపుతోందని చెబుతుండగా, టెహ్రాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రత్యక్ష చర్చలు జరుగుతున్నాయనే విషయాన్ని బహిరంగంగా ఖండిస్తోంది. వాస్తవానికి, అమెరికా బలగాలపై ఇరాన్ ఖండాంతర క్షిపణి దాడులకు ప్రయత్నించినందుకు ప్రతీకారంగా, ఇరాన్‌పై 'భారీ దాడుల పరంపర'ను పూర్తి చేసినట్లు గత వారం అమెరికా ప్రకటించింది.

అమెరికా తాజా దాడుల్లో ఖేష్మ్ ఐలాండ్‌లో రెండేళ్ల చిన్నారితో సహా ముగ్గురు మరణించినట్లు ఇరాన్ ధృవీకరించింది. అదే సమయంలో దేశంలో దక్షిణ, పశ్చిమ ప్రాంతాల్లోని ఇతర ప్రదేశాలపై కూడా దాడులు జరిగాయి. అమెరికా – సౌదీ సంయుక్త దాడులు ఇరాక్‌లోని ఇరాన్ మద్దతుదారుల(ప్రాక్సీ)ను లక్ష్యంగా చేసుకున్నాయి. యుద్ధ తీవ్రతను తగ్గించే ఉద్దేశంతో జూన్‌లో ఒక స్వల్పకాలిక అవగాహన ఒప్పందం కుదిరినప్పటికీ, ఇరాన్ తన నియంత్రణను కొనసాగిస్తుండటంతో, కీలకమైన జలమార్గం హోర్ముజ్ జలసంధి ఒక ప్రధాన ఉద్రిక్త ప్రదేశంగా కొనసాగుతోంది. సమగ్రమైన, శాశ్వతమైన ఒప్పందం కుదరకపోతే దాడులు తక్షణమే పునఃప్రారంభమవుతాయని అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఈలోగా, సౌదీ అరేబియా, హౌతీ దళాలతో సహా ప్రాంతీయ ప్రాక్సీల మధ్య ఘర్షణలు అస్థిర భౌగోళిక పరిధిని విస్తరిస్తూనే ఉన్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా తన ప్రధాన, సుదీర్ఘ సైనిక సంఘర్షణలను విజయంతో ముగించడం అరుదుగానే సంభవించటాన్ని గమనించాలి. దాని సుదీర్ఘ సైనిక సంఘర్షణలలో చాలా వరకు ప్రతిష్టంభనలతో, అగౌరవకరమైన నిష్క్రమణలతో ముగిశాయి. వాటిలో 1950–53 కొరియా యుద్ధం, 1955–75 వియత్నాం యుద్ధం, 2001–21 ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం. 2003–11 ఇరాక్ యుద్ధం ఉన్నాయి. కొరియా యుద్ధం సంపూర్ణ విజయంతో కాకుండా కాల్పుల విరమణతో ముగిసింది. ఫలితంగా కొరియా ద్వీపకల్పం 38వ సమాంతర రేఖ వద్ద విభజించబడింది. వియత్నాం యుద్ధం సైనిక ఉపసంహరణతో, దక్షిణ వియత్నాం ఉత్తర వియత్నాం వశమవ్వడంతో ముగిసింది. ఆఫ్ఘన్ యుద్ధం తాలిబాన్‌ను అధికారం నుండి తొలగించాలనే ప్రాథమిక లక్ష్యాన్ని సాధించినప్పటికీ, 20 ఏళ్ల ఆక్రమణ తర్వాత తాలిబాన్ పూర్తిస్థాయి పునరుజ్జీవంతో అది ముగిసింది. ఇరాక్ యుద్ధం సద్దాం హుస్సేన్‌ను విజయవంతంగా పదవీచ్యుతుడిని చేసింది. కానీ ఆ దేశంలో సుదీర్ఘమైన తిరుగుబాటు, ప్రాంతీయ అస్థిరతకు దారితీసింది.

ఇరాన్ యుద్ధం నుంచి వైదొలగినట్లయితే, గల్ఫ్ దేశాలపై అమెరికా సైనిక, వ్యూహాత్మక పట్టును గణనీయంగా కోల్పోవచ్చు. గల్ఫ్ దేశాలపై అమెరికా భద్రతా చట్రం విశ్వసనీయతపైనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధునాతన అమెరికన్ వాయు రక్షణ వ్యవస్థలు దూసుకొస్తున్న అత్యధిక క్షిపణులను అడ్డుకున్నప్పటికీ, ఈ సంఘర్షణ లోతైన బలహీనతలను బయటపెట్టింది. ఎందుకంటే, ఆతిథ్య దేశాలు ప్రాంతీయ ప్రతీకార దాడుల కారణంగా భారీ భౌతిక నష్టం, మౌలిక సదుపాయాల అంతరాయాలు, ఆర్థిక నష్టాలను చవిచూశాయి. అమెరికా–ఇరాన్ యుద్ధం తీవ్రతరం అవుతున్న కొద్దీ, అమెరికా సైనిక స్థావరాలకు ఆతిథ్యం ఇస్తున్నందున గల్ఫ్ దేశాలు ఇరాన్ నుంచి భారీ డ్రోన్, క్షిపణి దాడులకు అత్యంత సులభంగా గురవుతాయని స్పష్టమైంది. వాటిని రక్షించడంలో అమెరికా విఫలమైంది.

గల్ఫ్ దేశాలు ఇప్పుడు కేవలం వాషింగ్టన్ కేంద్రీకృత భద్రతా వైఖరిపై ఆధారపడటానికి బదులుగా, చైనా, భారతదేశం, పాకిస్తాన్, ఐరోపా దేశాల వంటి ప్రత్యామ్నాయ ప్రపంచ, ప్రాంతీయ భాగస్వాములతో స్వతంత్ర భద్రతా సంబంధాలను, బహుళపక్ష భాగస్వామ్యాలను నిర్మించుకునే ప్రయత్నాలను వేగవంతం చేస్తున్నాయి. ఈ దేశాలు వాషింగ్టన్ నుంచి పూర్తిగా వైదొలగాలని ప్రణాళిక వేయనప్పటికీ, ప్రాంతీయ సంఘర్షణల సమయంలో అమెరికా భద్రతా చట్రం తమ సొంత భూభాగాలను లక్ష్యాలుగా మార్చినందున, తమ దీర్ఘకాలిక భద్రతా వ్యూహాన్ని చురుకుగా పునరాలోచిస్తూ ఇరాన్‌తో స్వతంత్ర దౌత్యంలో నిమగ్నమవుతున్నాయి. స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి ఇరాన్‌తో నేరుగా ఒక స్థానిక ప్రాంతీయ భద్రత, ఆర్థిక చట్రాన్ని నిర్మించే ప్రయత్నాలకు ఖతార్ నేతృత్వం వహిస్తోంది.

# జీవితం అమూల్యం... జిందగీని ప్రేమించండి!

రోజురోజుకూ సమాజంలో వినిపిస్తున్న ఆత్మహత్యల వార్తలు కలవరపెడుతున్నాయి. ఒకప్పుడు అరుదుగా కనిపించే ఈ ఘటనలు ఇప్పుడు దాదాపు ప్రతి వయసు, ప్రతి వర్గం, ప్రతి వృత్తిలో కనిపిస్తున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, గృహిణులు, యువత, వృద్ధులు ఎవ్వరూ ఈ సమస్యకు అతీతులు కారు. సాంకేతికంగా ప్రపంచం ఎంతో ముందుకు సాగింది. సమాచార విప్లవం, కృత్రిమ మేధస్సు, అంతరిక్ష విజయాలు, డిజిటల్ జీవనం అన్నీ మనిషి జీవితాన్ని సులభతరం చేశాయి. కానీ అదే సమయంలో మానసిక ఒత్తిడి, ఒంటరితనం, పోటీ, అంచనాలు కూడా పెరిగాయి. ఫలితంగా ఎదురయ్యే చిన్న సమస్యలను కూడా భరించలేని పరిస్థితికి కొందరు చేరుకుంటున్నారు. ఆత్మహత్యకు ఒకే ఒక్క కారణం ఉండదు. అనేక వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, ఆర్థిక, మానసిక అంశాలు కలిసి ఒక వ్యక్తిని తీవ్ర నిరాశలోకి నెట్టవచ్చు. చాలా సందర్భాల్లో సమస్య కంటే 'దీనికి పరిష్కారం లేదనే భావన'. ప్రమాదకరంగా మారుతుంది. విద్యార్థుల్లో పెరుగుతున్న ఆందోళన నేటి విద్యా వ్యవస్థలో మార్కులు, ర్యాంకులు, ప్రవేశ పరీక్షలు, పోటీ పరీక్షలు ప్రధాన లక్ష్యాలుగా మారాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలు, సమాజం చూపే పోలికలు, సోషల్ మీడియా ప్రభావం, తోటి విద్యార్థుల విజయాలతో తమను తాము తక్కువగా భావించడం వంటి కారణాలు తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తున్నాయి. ఒక పరీక్షలో విఫలం కావడం అంటే జీవితం విఫలమైనట్లు కాదు. చరిత్రలో ఎంతో మంది గొప్ప వ్యక్తులు మొదటి ప్రయత్నంలో విజయం సాధించలేదు. వైఫల్యం ఒక పాఠం మాత్రమే అది జీవితానికి ముగింపు కాదు. విద్యార్థులే కాదు ఉద్యోగులు, అధికారులు సైతం ఎదుర్కొంటున్న ఒత్తిడికి గురవుతున్నారు. ఉద్యోగ జీవితంలో పనిభారం, లక్ష్యాల ఒత్తిడి, పై అధికారుల ప్రవర్తన, ఉద్యోగ భద్రతపై భయం, కుటుంబ బాధ్యతలు కలిసి మానసిక ఒత్తిడిని పెంచుతాయి. కొందరు తమ సమస్యలను ఎవరికీ చెప్పకుండా మనస్సులోనే దాచుకుంటారు. ఈ మౌనం క్రమంగా తీవ్ర నిరాశకు దారితీయవచ్చు. ఉద్యోగం కోల్పోతే మరో ఉద్యోగం వెతుక్కోవచ్చు. కానీ జీవితాన్ని కోల్పోతే తిరిగి పొందలేం. అం దుకే సమస్యలను పంచుకోవడం, అవసరమైతే సెలవు తీసుకోవడం, వృత్తిపరమైన సహాయం పొందడం బలహీనత కాదు బాధ్యత అనే విషయం జ్ఞాపకం ఉంచుకోవాలి.

### కుటుంబాల్లో సైతం మారుతున్న సంబంధాలు

కుటుంబం అనేది మనిషికి మొదటి అండ. కానీ అదే కుటుంబంలో అపార్థాలు, ఆర్థిక ఇబ్బందులు, భార్యాభర్తల మధ్య విభేదాలు, అత్తాకోడళ్ల సమస్యలు, పిల్లలతో దూరం, సక్సెస్ అవ్వలేదని వంటి అంశాలు మానసిక వేదనకు కారణమవుతున్నాయి. ప్రతి ఇంట్లో అభిప్రాయ భేదాలు సహజం. మాట్లాడుకుంటే పరిష్కారం దొరకని సమస్యలు చాలా తక్కువ. పరస్పరం వినడం, అర్థం చేసుకోవడం, గౌరవించడం కుటుంబ బంధాలను బలపరుస్తాయి. మేము మారలేము, ఎదుటివారిని మార్చలేమనుకుంటే కుటుంబం నుంచి విడిపోయి ఎవ్వరికి వాళ్ళు ఉంటూ, ఎక్కడైనా కలసినప్పుడు మంచిగా మాట్లాడుకుంటూ ఉండడం కూడా ఒక మార్గమే. ప్రేమ, నిరుద్యోగం, ఒంటరితనం యువతలో ప్రేమలో విఫలం కావడం, నిరుద్యోగం, భవిష్యత్తుపై అనిశ్చితి, సోషల్ మీడియాలో ఇతరుల జీవితాలతో తమను పోల్చుకోవడం వల్ల ఆత్మన్యూనత భావం పెరుగుతోంది. ప్రేమ జీవితంలో ఒక భాగం మాత్రమే మొత్తం జీవితం కాదు. మీ ప్రేమను వదులుకునేందుకు వాళ్ళు సిగ్గుపడేలా, తలదించుకునేలా బ్రతకండి. మీ తల్లిదండ్రుల కష్టాలను తలచుకోండి, మీకు ఏ ప్రేమ గొప్పదో కూడా తెలుస్తుంది. అలాగే ఉద్యోగం దొరకకపోవడం, ఆలస్యమవడం లాంటివి ఎదురైతే అవకాశాలు ముగిసిపోయినట్లు కాదు. ప్రతి ఒక్కరి జీవితం విభిన్న ప్రయాణం, చదివిన చదువుకే ఉద్యోగం అంటే చదివిన ప్రతివారికి ఉద్యోగాలు దొరకవు. చదువు విజ్ఞానం పెంచడానికి, ఉద్యోగం అనేది ప్రయత్నం మాత్రమే. బ్రతకడానికి అనేక మార్గాలున్నాయి, ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోవాలి అందరికి ఆదర్శంగా ఉండేలా బ్రతికి చూయించాలి.

### మరోవైపు రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సవాళ్లు

రైతులకు ప్రకృతి వైపరీత్యాలు, అప్పులు, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, వ్యాపారులకు ఆర్థిక నష్టాలు, మార్కెట్ ఒడిదుడుకులు తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తాయి. రైతులు ప్రత్యయమార్గాలలో వేరే పంటలసాగు చేయాలి, వ్యాపారస్తులు చేస్తున్న వ్యాపారంలో నష్టం వస్తే మరో వ్యాపారం వైపు దృష్టి పెట్టాలి. షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నారు. షేర్ మార్కెట్ అనేది ఒక మాయ ప్రపంచంలాంటిది ఉన్నది లేనిది లేనట్టు చూస్తుంది, అత్యాశకు వెళ్లి సర్వం పోగొట్టుకుంటున్నారు, ఒక్కసారి నష్టవచ్చినప్పుడు మరో మార్గంలో అన్వేషించాలి, పోయిన వద్దనే వెతుకోవడమంటే మిమ్మల్ని, మీరు మోసం చేసుకోవడమే అవుతుంది. సినిమాలో సక్సెస్ అవ్వలేదని, మోడలింగ్ రంగంలో గుర్తింపు రాలేదని, సమాజంలో గుర్తింపు రాలేదని, సోషల్ మీడియాలో ఫాలోయర్స్ లేరు అని, లైక్స్ లేవని, ఎవ్వరో ఏదో కామెంట్ చేసారు అని ఇలా అనేక కారణాలతో జీవితాలను వదిలేసుకుంటున్నారు. ఒక్క రంగం కాకపోతే మరోరంగం ప్రపంచం చాల విశాలమైనది, విస్తరించి ఉన్నది అనేది విషయాన్ని గుర్తెరగాలి, వత్తిడికి గురైన సందర్భంగా మనస్సులో బాధను నమ్మకమైనవారితో షేర్ చేసుకోవడం మిమ్మల్ని మీరు రక్షించుకున్నట్టే అవుతుంది. ఆత్మహత్యల నివారణకు కుటుంబ సహకారం, ప్రభుత్వ అవకాశాలు, ఆర్థిక సలహాలు, సామాజిక మద్దతు ఎంతో అవసరం. బలవన్మరణాల నివారణకు అందరి పాత్ర అవసరమే. ఆత్మహత్యల నివారణకు ఒక్క ప్రభుత్వ చర్యలు సరిపోవు. కుటుంబం, పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగ సంస్థలు, మీడియా, స్వచ్ఛంద సంస్థలు, సమాజం అందరూ కలిసి పనిచేయాలి. తల్లిదండ్రులు పిల్లలతో ప్రతిరోజూ మాట్లాడాలి. ఉపాధ్యాయులు దండనకు, మార్కులకే కాకుండా విద్యార్థుల భావోద్వేగాలను కూడా గుర్తించాలి. కార్యాలయాల్లో మానసిక ఆరోగ్యానికి అనుకూల వాతావరణం ఉండాలి. మీడియా సంచలనాత్మక కథనాల కంటే అవగాహన పెంచే కథనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను తొలగించాలి. కష్టాల్లో ఉన్నప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం కోరడం సహజం. అది బలహీనత కాదు, సమస్యను ఎదుర్కొనే ధైర్యానికి నిదర్శనం.

జీవితంలో కష్టాలు, వైఫల్యాలు, అవమానాలు, నష్టాలు ఇవన్నీ ఏవి శాశ్వతం కావు. కాలం మారినట్లు పరిస్థితులు కూడా మారతాయి. ఈ రోజు అసాధ్యంగా కనిపించే సమస్య రేపు ఒక జ్ఞాపకంగా మారవచ్చు. అందుకే క్షణికావేశంలో శాశ్వత నిర్ణయం తీసుకోవద్దు. మీ చుట్టూ బాధలో ఉన్నవారిని గమనించండి, వారికి తీర్పు ఇవ్వకుండా ఓపికగా వినండి, వాళ్లలో సగం మనస్సుభారం తగ్గుతుంది, అవసరమైనప్పుడు అండగా నిలబడండి, ఒక ఆప్యాయమైన పలకరింపు, కొంత సమయం, దూరంగా ఉన్నవాళ్లకు ఒక ఫోన్ కాల్ వాళ్లకు భరోసా, నేను ఉన్నాను అని చెప్పే మాట కొన్నిసార్లు ఒక ప్రాణాన్ని కాపాడగలదు. ఉన్నది జీవిస్తున్న జిందగీ ఒక్కటే, జిందగీని ప్రేమించండి సమస్యలను కాదు, మీ జిందగీ మీకే కాదు మీ కుటుంబానికి, సమాజానికి కూడా ముఖ్యమే. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది, వెతికేయండి ధైర్యంగా నమ్మకంతో జీవితాన్ని సాగించండి.

వై. సంజీవ కుమార్,
ఫౌండర్ & ప్రెసిడెంట్, స్కై ఫౌండేషన్,
9393613555.

# మోదీ ప్రభుత్వ నయా ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నయా ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా సంఘటితం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ తిరోగమన విధానాలతో దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు నిత్యం దిగజారుతున్నాయని ఆయన వేదన వ్యక్తం చేశారు. ఈనెల 6వ తేదీ నుంచి సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న 'బద్లావ్ జరూరీ హై' చలో ఢిల్లీ ర్యాలీ, ప్రచార పాదయాత్రల ప్రచార కటౌట్‌లను మంగళవారం హిమాయత్ నగర్ వద్ద ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇ.టి.నరసింహా మాట్లాడుతూ స్వాతంత్ర్యం తర్వాత భారతదేశ చరిత్రలోనే అత్యంత ప్రజా వ్యతిరేక, కార్పొరేట్, సామ్రాజ్యవాద అనుకూల, మతతత్వ, నిరంకుశ, అవినీతి, నీతిబాహ్యమైన పరిపాలనను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ధరల పెరుగుదలను అరికట్టడం, ద్రవ్యోల్బణం నియంత్రణ, కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, కార్మికుల హక్కుల పరిరక్షణ, మహిళా రిజర్వేషన్ల చట్టం తక్షణమే అమలు, సార్వత్రిక ప్రభుత్వ విద్య, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల బలోపేతం, దళితులు, ఆదివాసులకు సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా సిపిఐ ఆధ్వర్యంలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రతి గ్రామం, పట్టణం, నగరాల్లో ఈనెల 6వ తేదీ నుండి 14వ తేదీ వరకు ప్రచార పాదయాత్రలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. తద్వారా దేశవ్యాప్తంగా ప్రజలను ఏకతాటి పైకి తీసుకురావడానికి 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో సెప్టెంబర్ 1వ తేదీన న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యవస్థలో మార్పు కోసం సిపిఐ చేపడుతున్న ప్రచార ఆందోళనలను విజయవంతం చేయాలని ప్రజలకు ఇ.టి.నరసింహ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్, సీనియర్ నాయకులు పి.ప్రేమ్ పావని, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 29 కార్మిక చట్టాలు, 3 రైతు చట్టాలను పునరుద్ధరించాలి

క్విట్ ఇండియా స్ఫూర్తితో ఈనెల 10న 'చలో రాజ్‌భవన్'



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లేబర్ కోడ్‌లను రద్దు చేసి 29 కార్మిక చట్టాలు, 3 రైతు చట్టాలను పునరుద్ధరించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 10నవ తేదీన 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు నేతలు తెలిపారు. నిరసనలో భాగంగా జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలు, అధికారులకు వినతిపత్రాల సమర్పణ, రాష్ట్ర రాజ్‌భవన్‌ల వద్ద ఆందోళనలు, రాస్తా రోకోలు, రైల్‌రోకో కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంయుక్త రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత కార్మిక ఉద్యమాల ఫలితంగా సాధించిన కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌ల పేరుతో నిర్వీర్యం చేసిందని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేయడం ద్వారా కోట్లాది కార్మికుల హక్కులు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు సామాజిక భద్రతను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, బీడి కార్మికుల చట్టాన్ని రద్దు చేయడం, కార్మికుల సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు, 8 గంటల పనిదినం, సమ్మె హక్కు, బేరసారాల హక్కులను కుదించే విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. అలాగే రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, టియూసిఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యం, ప్రధాన కార్యదర్శి పద్మ, ఎఐయుటియుసి నాయకుడు భరత్, బిఆర్‌ఎస్‌కెవి నాయకుడు బి.రాంబాబు మాట్లాడుతూ విద్యుత్ సవరణ బిల్లు – 2025ను వెనక్కి తీసుకోవాలని, విద్యుత్ రంగ ప్రైవేటీకరణను నిలిపివేయాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మరింత బలోపేతం చేసి పని దినాలు, కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇపిఎస్–95ను అమలు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

## ప్రజలకు నష్టం కలగాలని హరీష్ రావు క్షుద్ర పూజలు

టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర మాజీ మంత్రి టి.హరీష్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని, ఇందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. అరుంధతి సినిమాలో చూపించినట్లుగా హరీష్ రావు క్షుద్ర పూజలు నిర్వహిస్తున్నారని ఆయన విమర్శించారు. గాంధీభవన్‌లో మంగళవారం మహేశ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ హరీష్ రావు గత మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని, ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తిరుపతి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీష్ రావు, అఘోరీ ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు దాచిపెడుతున్నారని ప్రశ్నించారు. వర్షాలు పడకుండా రాష్ట్రంలో కరువు రావాలని స్వార్థపూరిత ఉద్దేశంతో హరీష్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని మహేశ్ కుమార్ ఆరోపించారు. ప్రజల సంక్షేమం కోసం తాము దేవుడిని ప్రార్థిస్తామని, కానీ ప్రజలకు నష్టం జరగాలని హరీష్ పూజలు చేశారని విమర్శించారు.ఈ అంశంపై నిజాలు వెల్లడించినందుకే అద్దంకి దయాకర్ రావు, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని, అలాంటి నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. యాదాద్రి ఆలయానికి వచ్చి పొర్లు దండాలు పెట్టిన సందర్భంగా ఏమి చేశారో హరీష్ రావు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. మాజీ సిఎం కె.చంద్రశేఖర్ రావు కూడా అఘోరాలతో క్షుద్ర పూజలు చేశారనే ప్రచారం ఉందని, హరీష్ రావు వ్యవహారం చూస్తుంటే ఆ ప్రచారం నిజమేననే అనుమానం కలుగుతోందని మహేశ్ కుమార్ ఆరోపించారు.

## గాలిలో దీపంలా తెలంగాణ వైద్య విధానపరిషత్

బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకుడు తన్నీరు హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే తెలంగాణ వైద్య విధానపరిషత్‌కు (టివివిపి) కమిషనర్ లేకపోవడంతో గాలిలో దీపంలా మారిందని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీని ఏర్పాటు చేసి, సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలను రూపొందించాలని, తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వైద్య విద్య ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ గత రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో టివివిపి పరిధిలోని ఎంసిహెచ్, జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సిహెచ్‌సి మొత్తంగా 184 ఆసుపత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఆసుపత్రుల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే ఉన్నతాధికారి లేకుండా పోయారని, తద్వారా ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది తమ సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతుండగా, మరో వైపు ప్రజలకు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలను ఎదుర్కొంటున్నారన్నారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో టివివిపిని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని గతం బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనికి సంబంధించిన సర్వీసు నిబంధనలు రూపొందించలేదన్నారు.

## ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై దశలవారీ పోరాటం

యుఎస్‌పిసి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) నిర్ణయించింది. హైదరాబాద్‌లోని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యుఎస్‌పిసి నాయకులు చావ రవి, ఎ వెంకట్(టిఎస్ యుటిఎఫ్), సిహెచ్ అనిల్ కుమార్, ఎన్ తిరుపతి(టిపిటిఎఫ్), ఎం.సోమయ్య, టి లింగారెడ్డి(డిటిఎఫ్), కొమ్ము రమేష్ (బిటిఎఫ్), మేడి చరణ్ దాస్ (ఎస్సీ, ఎస్టీ టిఎఫ్), ఎస్ హరికిషన్(టిటిఎ), బి కొండయ్య (ఎంఎస్ టిఎఫ్), వై విజయ కుమార్, రవీందర్ (ఎస్సీ ఎస్టీ యుఎస్) మాట్లాడారు. న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఈనెల 7న పాఠశాలల్లో నిరసనలు, 12,13వ తేదీన మండల కేంద్రాల్లో వినతిపత్రాల సమర్పణ, ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, పిఆర్‌సి ప్రకటించే వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని, 21వ తేదీ నుండి 26వ తేదీ వరకు రాష్ట్ర, జిల్లా బృందాల పర్యటన,ఆగస్టు 29 న ఇందిరా పార్క్ లో మహా ధర్నా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబరులో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ చేపడుతామని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యా శాఖ అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు.



## 'కాళేశ్వరం'లో కేవలం రూ.500 కోట్ల విలువైన రెండు పిల్లర్లే కుంగాయి

మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం కూలేశ్వరం కాలేదని, కేవలం రూ.500 కోట్ల విలువైన రెండు పిల్లర్లే కుంగాయని బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి తెలిపారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగానే ఉన్నాయని,ఇప్పటికైనా మూర్ఖపు ఆలోచనలు వీడి, కన్నెపల్లి నుంచి నీళ్లను లిఫ్ట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు చిరుమళ్ల రాకేష్ కుమార్‌తో పాటు జీవన్ రెడ్డి మాట్లాడుతూ తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోలేదని, పైగా అక్కడ 40 టిఎంసిల నీళ్ల మాత్రమే అందుబాటులో ఉన్నాయని, అందుకే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మేడిగడ్డకు మార్చిందని వివరించారు. 2016 ఆగస్టు 4 నాటికి ఎల్లంపల్లి వినియోగంలోకి వచ్చిందని, దీనిని 2008. ఆగస్టులో నాటి సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారని, కాంగ్రెస్ పదేళ్ల పాలనలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయలేదని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌కు గత సిఎం కెసిఆర్ బాహుబలి మోటార్లను ఏర్పాటు చేశారన్నారు. ఎల్లంపల్లి కూడా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమేనని వివరించారు. ఎల్ నినోతో దేశమంతా కరువు పరిస్థితులు నెలకొన్నాయని, అల్పపీడనం వచ్చి కొంత వర్షాలు పడి నయమైందని, అయినప్పటికీ ఇంకా ఎనిమిది నెలలు సాగు, తాగు నీరు పూర్తి స్థాయిలో ఉండాలంటే కాళేశ్వరం ప్రాజెక్ట్‌నే శరణ్యమని ఆయన తెలిపారు. కన్నెపల్లి వద్ద కాఫర్ డ్యామ్ నిర్మిస్తే ఇప్పటికే నీళ్లను లిఫ్ట్ చేసేందుకు అవకాశం ఉండేదన్నారు.




## 'ఆయుష్ హౌస్ సర్జన్లు, పిజి స్కాలర్ల నిరవధిక సమ్మె

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్టైఫపెండ్ పెంపు విషయంలో ప్రభుత్వం సానుకూలమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 'తెలంగాణ ఆయుష్ హౌస్ సర్జన్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ' (ఆయుష్,పిజి జెఎసి) ఆధ్వర్యంలో ఆయుష్ హౌస్ సర్జన్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్లు మంగళవారం నిరవధిక సమ్మె చేపట్టారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి,ఎర్రగడ్డ, నేచర్ క్యూర్ హాస్పిటల్ బల్కంపేట్, జె.ఎస్.పి.ఎస్. ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాలఆసుపత్రి (రామంతాపూర్), ప్రభుత్వ నిజామియా టిబిబి యునాని కళాశాల ఆసుపత్రి (చార్మినార్) ఆస్పత్రులల్లో హౌస్ సర్జన్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్లు ఆయుష్ హౌస్ సర్జన్లు సమ్మెలో పాల్గొన్నారు. స్టైఫండ్‌ను పెంచాలని గత పదేళ్ల నుంచి పలుమార్లు వినతిపత్రాలు సమర్పిస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం లభించడం లేదని జెఎసి ఆరోపించింది. జీవన వ్యయం, వసతి, ఆహారం, ప్రయాణం, విద్యా సంబంధిత ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత స్టైఫండ్‌తో ఆయుష్ జూనియర్ డాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. న్యాయమైన, సంతృప్తికరమైన పరిష్కారం లభించే వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని జెఎసి స్పష్టం చేసింది.

# దేశానికే ఆదర్శంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్

విలువలతో కూడిన విద్యకు పెద్దపీట

డిజిపి సి.వి.ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపిఎస్) దేశానికే ఆదర్శ విద్యాసంస్థగా ఎదగాలని రాష్ట్ర డిజిపి సి.వి.ఆనంద్ ఆకాంక్షించారు. మంచిరేవులలో నిర్మాణంలో ఉన్న పాఠశాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన స్కూల్ సొసైటీ కమిటీ సమావేశంలో ఐపిఎస్ అధికారుల సతీమణుల సంఘం అధ్యక్షురాలు లలితా ఆనంద్, కమిటీ సభ్యులతో కలిసి నిర్మాణ పురోగతి, విద్యా ప్రణాళికలు, మౌలిక సదుపాయాలను సమీక్షించారు. పోలీసు పిల్లల కోసం ఏర్పాటు చేస్తున్న ఈ పాఠశాల అభివృద్ధికి ఐపిఎస్ అధికారుల సతీమణుల సంఘం కూడా తమ వంతు సహకారం అందించాలని నిర్ణయించింది. సమావేశానికి ముందు డిజిపి విద్యార్థులతో మమేకమై ఫుట్‌బాల్ ఆడారు. అనంతరం విలువిద్య, ఫెన్సింగ్ తదితర క్రీడల ప్రదర్శనలను వీక్షించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. పోలీసు సిబ్బంది పిల్లలు, అమర పోలీసుల కుటుంబాల పిల్లలు, సాధారణ ప్రజల పిల్లలకు ప్రపంచ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిందని డిజిపి తెలిపారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సేవాభావం, సామాజిక బాధ్యత వంటి అంశాలను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగం వంటి దుష్ప్రవర్తనలు పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలలో విలువల ఆధారిత విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సమాజం, దేశం పట్ల బాధ్యతతో కూడిన ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే కేంద్రంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిలవాలని ఆకాంక్షించారు. సమీక్షలో పాఠశాల భవనాల నిర్మాణ పురోగతి, విద్యా విధానం, పాఠ్య ప్రణాళిక, మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. ఈ సమావేశంలో డిజి (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, డిజి (ఆక్టోపస్) డా. అనిల్ కుమార్, ఐజి (ప్రొవిజనింగ్,లాజిస్టిక్స్) గజారావు భూపాల్, సైబరాబాద్ సిపి రమేష్, ఐజి (వెల్ఫేర్) ఉదయ్ కుమార్ రెడ్డి, శేరిలింగంపల్లి డిసిపి శ్రీనివాస్, ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ కుమార్, ప్రిన్సిపాల్ అనిత, వ్యవస్థాపకుడు విశాల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల కోసం 'టెట్ స్టడీ' మెటీరియల్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్ (టెట్) పరీక్ష నేపథ్యంలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియు టిఎస్) అధ్వర్యంలో రూపొందించిన 'టెట్ స్టడీ' మెటీరియల్‌ను ఎస్‌సిఇఆర్‌టి డైరక్టర్, టెట్ కన్వీనర్ జి.రమేష్ హైదరాబాద్‌లో మంగళవారం ఆవిష్కరించారు.

సామాజిక బాధ్యతతో పాటు ఉద్యోగ భద్రతను దృష్టిలో పెట్టుకుని ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా 'టెట్ స్టడీ' మెటీరియల్ ముద్రించి అందుబాటులోకి తీసుకురావడం పట్ల ఆయన ఎస్‌టియుని అభినంధించారు. అనంతరం ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్ మాట్లాడుతూ పేపర్1, పేపర్2లకు సంబంధించి 5,000 సెట్లు ముద్రించామని వివరించారు. ఒక్కో సెట్‌లో ఆరు పుస్తకాలు ఉంటాయని, వీటిని రాష్ట్రంలోని 33 జిల్లా శాఖల ద్వారా ఉపాధ్యాయులకు అందుబాటులో తీసుకొచ్చామన్నారు. స్పెషల్ టెట్‌కు హాజరయ్యే దాదాపు 25 వేల మంది ఉపాధ్యాయులు ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తీర్ణులు కావాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం. పర్వత్ రెడ్డి, సంఘ మాస పత్రిక ఎడిటర్ ఎల్. ఎం. ప్రసాద్ పాల్గొన్నారు.

## వారం రోజుల్లో నివేదిక సమర్పించాలి


మంత్రి దామోదర రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వారం రోజుల్లో మునుగోడు నియోజకవర్గంలో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి సంబంధించిన నివేదికను సమర్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నత అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. మునుగోడు నియోజకవర్గంలో సబ్ సెంటర్లు, పిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది, సాంకేతిక పరికరాలు, అందుకు కావాల్సిన నిధులు, పలు అభివృద్ధి అంశాలపైన హైదరాబాద్‌లోని సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కలిసి మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం సమావేశమయ్యారు. మునుగోడు, నాంపల్లి, పిహెచ్‌సిల ఆధునీకరణతో పాటు 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం, మర్రిగూడ సిహెచ్‌సిని 30 పడకల నుండి 50 పడకలకు పెంచడం,అందుకు అనుగుణంగా సిబ్బంది నియామకం, సాంకేతిక పరికరాల కల్పన, పోస్టుమార్టం ఎగ్జామిన్ రూమ్ తదితర అంశాలపై చర్చించారు.'ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ క్రిస్టినా లాజరస్ , హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవిందర్ నాయక్, నల్లగొండ జిల్లా డీఎంహెచ్ డాక్టర్ రాహుల్, తదితరులు పాల్గన్నారు.

## ఈనెల 15లోగా 13,046

# వ్యవసాయ కుంటల నిర్మాణం పూర్తి చేయాలి

పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిషోర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా 13,046 వ్యవసాయ కుంటల నిర్మాణాన్ని ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిషోర్ జిల్లా అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు (డిఆర్‌డిఓలు), జిల్లా పంచాయతీ అధికారులు (డిపిఓలు), జెడ్‌పిసిఈఓలు, ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. వీబీజీ రామ్ జీ, తెలంగాణ జలసిరి, గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జిపిఎస్‌ఏపి) పథకాల అమలుపై సమీక్షించారు. ప్రతి గ్రామ పంచాయతీలో వ్యవసాయ కుంటల గుర్తింపు, పరిపాలనా అనుమతులు, పనుల ప్రారంభాన్ని వంద శాతం పూర్తి చేయాలని దానకిషోర్ స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో కనీసం 50 ఎకో ఫార్మ్ పాండ్లను సెర్ప్‌ఎన్‌ఆర్‌ఎల్ఎం, పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్యశాఖల సమన్వయంతో చేపట్టాలని ఆయన సూచించారు. తెలంగాణ జలసిరి పథకం కింద వ్యవసాయ కుంటలు, ఇంకుడు గుంతలు, పర్కొలేషన్ ట్యాంకులు, బోర్వెల్ రీచార్జ్ నిర్మాణాలు, బహిరంగ బావుల అభివృద్ధి వంటి నీటి సంరక్షణ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని దానకిషోర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ తనిఖీలు నిర్వహిస్తూ, మండల స్థాయి అధికారులతో నిరంతరం సమీక్షలు చేపట్టి నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. అలాగే గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికల (జిపిఎస్‌ఏపి) మాన్యువల్ తయారీని పూర్తి చేసి, ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి మూడేళ్ల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్యతో పాటు శాఖచెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ :: ఎల్‌బినగర్ సర్కిల్-13**
షార్ట్ టెండర్ నోటీస్
తేది: 04.08.2026
**NIT No.** 07/EEC-13/LBNR/MMC/2026-27, తేది: 04.08.2026. **పని పేరు:** నిర్వహణ పనులు - 05 నెంబర్లు, **అంచనా విలువ:** రూ.65.60లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 05.08.2026 మ.03:00గం.ల నుండి 11.08.2026 మ.03:00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-13, ఎంఎంసి. సెల్ నెం. 9701365519. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-13, ఎంఎంసి.
DIPR R.O. No. : 7295-PP/CL/ADVT/2026-27, Date: 04-08-2026

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
బుధవారం
05-08-2026
www.prajapaksham.in
ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్
స్థానికం LOCAL NEWS

## మైనర్ బాలుడిపై అత్యాచారం, హత్య కేసు

### నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించిన నిర్మల్ కోర్టు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మైనర్ బాలుడిపై అత్యాచారం మరియు హత్యకు పాల్పడిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నిర్మల్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి ఎస్. శ్రీవాణి మంగళవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల్లోకి వెళితే.,నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్యాల్ గ్రామానికి చెందిన తోకల రాజేశ్వర్ అలియాస్ రాజు (34) పై క్రైం నెం. 21/2025 కింద బిఎన్ఎస్ సెక్షన్ 103(1), పోక్సో చట్టం సెక్షన్ 6, అలాగే ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టాల ప్రకారం కేసు నమోదైంది. ఈ కేసుపై విచారణ పూర్తి చేసిన న్యాయస్థానం నిందితుడు రాజేశ్వర్‌ను దోషిగా నిర్ధారిస్తూ యావజ్జీవ జైలు శిక్షతో పాటు రూ. 3,000ల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారులు ఎస్ఐ జి. లింబాద్రి, సీఐ ఎస్. రామకృష్ణ,ఏఎస్పీ రాజేష్ మీనా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి పటిష్టమైన సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.కేసు విచారణ పర్యవేక్షణను రాజేష్ మీనా,అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, సీఐ కృష్ణ పర్యవేక్షించారు. నిందితుడికి శిక్ష పడేలా పక్కా సాక్ష్యాధారాలు సమర్పించిన అధికారులు, సిబ్బందిని ఎస్పి డా.జి.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు.

## పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలి

### జాతీయ మహిళా కాంగ్రెస్ కార్యదర్శి అదిత



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండల పరిధిలోని డోర్పల్లి గ్రామానికి చెందిన పోడు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాతీయ మహిళా కాంగ్రెస్ కార్యదర్శి బి. అదిత డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డిప్యూటీ ఎఫ్ఆర్ఓకు పోడు రైతులతో కలిసి ఆమె వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అదిత మాట్లాడుతూ గతంలోనూ పోడు రైతుల సమస్యలను అటవీశాఖ అధికారులతో పాటు అటవీశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. గత 40 ఏళ్లుగా భూములను పోడు సాగు చేసుకుంటున్న రైతులను అటవీ అధికారులు ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా, స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డోర్పల్లి గ్రామస్తులు, పోడు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## 3 నెలల రేషన్ కోటా సజావుగా పంపిణీ

### అదనపు కలెక్టర్ భుజంగరావు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థ (రేషన్ షాపుల) ద్వారా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మూడు మాసాలకు సంబంధించిన రేషన్ కోటాను ఒకేసారి పంపిణీ చేయటం జరుగుతోందని అదనపు కలెక్టర్ భుజంగరావు తెలిపారు. చౌక ధరల దుకాణ డీలర్లు మూడు మాసాల కోటాను దిగుమతి చేసుకుని వినియోగదారులకు సకాలంలో సన్నబియ్యం పంపిణీ చేయాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆయా మండలాల రేషన్ డీలర్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ 31 లోగా రేషన్ పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. బియ్యం పంపిణీలో అవకతవకలు, అలసత్వానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.స్టాక్ నిల్వలు, వాటి వివరాలతో కూడిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. రేషన్ దుకాణాలకు సకాలంలో బియ్యం నిల్వలు చేరుకునేలా కార్డు హోల్డర్లకు వారి కోటా మేరకు ఏకకాలంలో మూడు నెలల పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. 15లోగా తప్పక ఇ కెవైసి చేసుకునేలా తద్వారా అర్హులైన వారు రేషన్ కోటా కోల్పోకుండా రేషన్ డీలర్లు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ హితవు పలికారు. సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు

### పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ఆషాడ మాసం సందర్భంగా పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఊరేగింపు కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. సంప్రదాయ బద్ధంగా సాగిన బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, అమ్మవార వేషధారణలు,డప్పు చప్పుళ్లు అందరిని ఆకట్టుకున్నాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించగా యువత ఉత్సాహంగా ఊరిగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు గౌడ సంఘం నాయకులు, నిర్వాహకులు, ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, పట్టణ కార్యదర్శి వీరేశం, చింత సాయినాథ్, కౌన్సిలర్ ఫణి కృష్ణ, చెన్నాకర్, అశోక్ గౌడ్, కలీం పటేల్ పెద్దగౌడ్, సంక్షేమ గౌడ్, పాలనేత్ర గౌడ్,, ప్రజాప్రతినిదులు, గౌడ సంఘం నాయకులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కష్టపడే వారికి తగిన గుర్తింపు

### డిసిసి అధ్యక్షుడు నరేష్ జాదవ్



**ప్రజాపక్షం/తలమడుగు:** పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని డిసిసి అధ్యక్షుడు నరేష్ జాదవ్ తెలిపారు. తలమడుగు మండలం ఉండంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ సర్వసభ్య సమావేశంలో బోథ్ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్, మాజీ ఎంపి సోయం బాపురావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15లోగా మండల, గ్రామ బూత్ లెవెల్ కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వారిని పార్టీ గుర్తించి న్యాయం చేస్తుందని భరోసానిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్, మండల అధ్యక్షుడు ప్రతాప్, నాయకులు గణేష్ రెడ్డి, నరసయ్య, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచాలి

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం / మందమర్రి :** జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచి అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం మందమర్రిలోని బి1 క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎస్ఆర్, డిఎంఎఫ్‌టి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గంలో రూ.100 కోట్లతో నీటి ట్యాంకులు, పైప్ లైన్‌ల నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. మందమర్రిలో చేపట్టిన అభివృద్ధి పనులకు 95 శాతం చెల్లింపులు జరిగాయని, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, సోలార్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, అర్హులైన అందరికీ డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలన్నారు. వైకుంఠధామాలు, ఖబరస్థాన్ పనులను త్వరగా పూర్తి చేయాలని, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో ఎంఎన్ఆర్ గార్డెన్ నుండి శ్రీనివాస గార్డెన్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆయా శాఖల అధికారులతో పనుల పురోగతిని సమీక్షించిన మంత్రి.. పనుల్లో నాణ్యత లోపించకుండా, గడువులోగా పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు రాజలింగు, మురళీకృష్ణ, ఎంపిడిఒ రాజేశ్వర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## త్వరితగతిన పెండింగ్ పనులు పూర్తి

### అదనపు కలెక్టర్ వి.రాములు



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్, సాదాబైనామా, భూభారతి దరఖాస్తులు, రీసర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు ఆదేశించారు. తాండూర్ మండలంలోని కార్తికేయ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును మంగళవారం ఆయన పరిశీలించి సిఎంఆర్ బకాయిల పురోగతిని సమీక్షించారు. అనంతరం తాండూర్, బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి సాదాబైనామా, భూభారతి దరఖాస్తులు, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలన్నారు. రాంపూర్ గ్రామంలో జరుగుతున్న రీసర్వేను త్వరగా పూర్తి చేసి, మరో 5 గ్రామాలలో పనులు ప్రారంభించాలని సూచించారు. నస్పూర్ మండలంలోని తీగల్‌పహాడ్ ఎంఎల్ఎస్ గోదాంను సందర్శించి ఐసిడిఎస్ కేంద్రాలు, పాఠశాలలకు నిత్యావసర సరుకుల సరఫరా విధానాన్ని పరిశీలించారు. డీలర్లకు ఇకెవైసి పూర్తి చేసి సరుకులు సకాలంలో చేరేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

### ఎమ్మెల్యే సంజీవ రెడ్డి





**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట్ :** పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో నారాణఖేడ్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో మండలంలోని గ్రామాల వారీగా తాగునీరు, విద్యుత్ సరఫరా, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధుల నుంచి వివరాలు తెలుసుకొని సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ సేవలను వేగవంతంగా అందించడమే అధికారుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సూచించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ, తహసీల్దార్, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి పోర్టల్‌పై అవగాహన అవసరం

### కలెక్టర్ కె. హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జూనియర్ అసిస్టెంట్లు భూ భారతి పోర్టల్‌లోని ప్రతి అంశంపైనా పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ కె. హరిత సూచించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అన్ని మండలాల జూనియర్ అసిస్టెంట్లకు భూ భారతి పోర్టల్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూనియర్ అసిస్టెంట్లు కేవలం తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి బాధ్యతలకే పరిమితం కాకుండా, భూ భారతి పోర్టల్‌లోని ప్రతి అంశంపైనా పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. భూ భారతి ఆపరేటర్‌పై మాత్రమే ఆధారపడకుండా కార్యాలయ పనులతో పాటు పోర్టల్ నిర్వహణ బాధ్యతలను స్వీకరించాలని, భూసేకరణ, దరఖాస్తుల పరిశీలన వంటి ఏ పని అప్పగించినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని, పోర్టల్ నిర్వహణ లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భూ భారతి కోఆర్డినేటర్ రాము, రవికాంత్, జిలాని, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ప్రతీ ఒక్కరు కట్టుబడి ఉండాలి

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్





**ప్రజాపక్షం/ముధోల్ :** నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధికి కట్టుబడి ముందుకెళ్లాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం ముధోల్ మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమం లో భైంసా మార్కెట్ చైర్మన్ షిండే ఆనంద్ రావు పటేల్,ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి సైతం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక సమావేశంలో భాగంగా ఆయా శాఖల అధికారులు వారి వారి శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను రాబోయే రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాల గూర్చి వివరించారు.కార్యక్రమం లో పాల్గొన్న ఆయా గ్రామాల సర్పంచ్ లు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను శాసనసభ్యుల ముందుకు తీసుకువచ్చారు. ఆయా గ్రామాల సర్పంచ్ లు తెలిపిన సమస్యలను వారు దృష్టిలో ఉంచుకుని ఎక్కడ సమస్యలున్నాయో వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోయే సమావేశానికి ఇప్పుడు తెలిపిన సమస్యలను పరిష్కరించని యెడల తప్పక చర్యలు తీసుంటామని హెచ్చరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్తూ అభివృద్ధి కొరకు కృషి చేయాలనీ సూచించారు.అదేవిధంగా అధికారులు ప్రజాప్రతినిధులను గౌరవించాలని స్పష్టం చేశారు.అధికారులు,ప్రజాప్రతినిధుల సమన్వయం లేని యెడల అభివృద్ధి కుంటు పడుతుందని అందుకు గాను ప్రజల సమస్యలకై ఇరువురు గౌరవించుకుంటూ ముందుకెళ్తే మంచిదన్నారు.ప్రతి గ్రామంలో మహిళా సంఘాల కొరకు విఒ భవనాలు తప్పక నిర్మించాలని దాని నిర్మాణం కొరకు ఐకెపి తరఫున రూ.5 లక్షల ఋణం మంజూరు చేయాలని ఐకెపి అధికారులను ఆదేశించారు. వీటికి సంబందించిన అనుమతులను త్వరగా మంజూరు చేయాలని తెలిపారు. అంతే కాకుండా గ్రామాల్లో ఎక్కడ ప్రజలకు మౌలిక వసతుల కొరత నెలకొనవద్దని ప్రజాప్రతినిధులను సైతం అప్రమత్తం చేశారు. సమయానికి చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఇట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బిల్లులు త్వరగా మంజూరయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమం లో మండల ప్రత్యేకాధికారి లక్ష్మణ్ ,ఎంపీడీఓ లవకుమార్, తహసీల్దార్ శ్రీలత,వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాసంఘాలది కీలకపాత్ర

### సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్





**ప్రజాపక్షం/నిజామాబాద్:** ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాసంఘాలు కీలకపాత్ర వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రజాసంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం జరగగా సుధాకర్ పాల్గొని మాట్లాడారు. సబ్బండ వర్గాల్లో ఉన్న వారిని ప్రజాసంఘాల ప్రతిష్ట పెరుగుతుందన్నారు. తద్వారా ఆ సంఘంలో నాయకులు తయారవుతారని అప్పుడే పార్టీ ప్రజాసంఘాలు పటిష్టమవుతాయన్నారు. సిపిఐ దేశవ్యాప్త పిలుపులో భాగంగా 6 నుండి 14 వరకు జరిగే పాదయాత్రలో ప్రజా, కార్మిక, విద్యార్థి, యువజన, మహిళ, రైతు వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఐ చేస్తున్న పాదయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఓమయ్య, నాయకులు సుబోద్, రఘురాం, స్వరూపరాణి, ఫిరోజ్, ఇమ్రాన్, రమేష్, చక్రపాణి పాల్గొన్నారు.

# అడవి బిడ్డలపై అటవీ అధికారుల జులుం

### 9 లోగా శాంత్‌రామ్‌పై వేటు పడకుంటే రాష్ట్రవ్యాప్త మహా ఉద్యమం

### ఎఫ్ఆర్ఓను 24 గంటల్లో సస్పెండ్ చేయాలి

### 'తుడుం దెబ్బ' రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమయ్య



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** అడవి తల్లిని నమ్ముకుని జీవిస్తున్న నిరుపేద ఆదివాసులపై అటవీ శాఖ అధికారుల దాష్టీకం మితిమీరుతోందని, వారి జులుంను ఇకపై ఎంతమాత్రం సహించేది లేదని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా ఇందన్‌పల్లి పరిధిలో అమాయక నాయక పోడు గిరిజనులపై అటవీ శాఖ అధికారులు కక్షకట్టి భౌతిక దాడికి దిగడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. 'జల్, జంగల్, జమీన్' నినాదంతో తమ హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడుతున్న అడవి బిడ్డల గొంతు నొక్కాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నిర్మల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీ అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు.చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని, చట్టాన్ని రక్షించి ప్రజలకు అండగా నిలవాల్సిన అధికారులే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని గిరిజనులను హింసించడం అత్యంత హేయమైన చర్య అని భూమయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందన్‌పల్లి ఘటనలో ఆదివాసులపై నేరుగా భౌతిక దాడికి దిగిన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నిర్వాకం దుర్మార్గమైనదని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన సదరు ఎఫ్ఆర్ఓను రాబోయే 24 గంటల వ్యవధిలోనే తక్షణమే ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని, అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంచు శ్రీనివాస్,జిల్లా కార్యదర్శి తోడుసం గోవర్ధన్,జిల్లా సభ్యులు రామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రకటనలకే పరిమితమవుతున్న పశువుల నియంత్రణ

### క్యాతనపల్లి మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారుల అవస్థలు



**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువుల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి ఏటా కమిషనర్ పేరుతో హెచ్చరికలు జారీ చేయడం తప్ప, క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యమని స్థానికులు మండిపడుతున్నారు. గతంలో ప్రత్యేక వ్యాన్ తీసుకొచ్చి, యానిమల్ ట్రస్ట్ సభ్యులు, సిబ్బందితో కలిసి పశువులను పట్టుకుంటున్నట్లు ఫోటోలకు మాత్రమే పోజులిచ్చారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఒక్క పశువును కూడా గోశాలకు తరలించకుండా కేవలం ప్రచారానికే పరిమితమై మున్సిపాలిటీ నిధులను వృథా చేశారని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ప్రధాన రహదారులు, వీధుల్లో ఆవులు, గేదెలు గుంపులుగా తిరుగుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నిత్యం ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నా బాధ్యులైన పశువుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ప్రకటనలతో కాలాన్ని వెళ్లదీయకుండా, ఇప్పటికైనా రోడ్లపై ఉన్న పశువులను గోశాలలకు తరలించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేళ "సురక్షా కా తిరంగా"

### సైబర్ మోసాలపై నిర్మల్ పోలీసుల చైతన్యం





**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు ప్రజల్లో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంపొందించేందుకు ప్రతి నెల మొదటి బుధవారం జిల్లావ్యాప్తంగా "సైబర్ జాగృతి దివస్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పి డా. జి. జానకి షర్మిల తెలిపారు. ఈ నెల స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని "సురక్షా కా తిరంగా– స్టే అలర్ట్, స్టే అవేర్, స్టే సైబర్ సేఫ్" అనే ప్రత్యేక సందేశంతో సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా ఎస్పి విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో ప్రజలను మోసం చేస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ముఖ్యంగా నకిలీ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు,అధిక లాభాల పేరుతో వచ్చే ప్రకటనలు, ప్రముఖుల ఫోటోలు,మార్ఫింగ్ వీడియోలు,నకిలీ సంస్థల పేర్లు మరియు లోగోలతో వచ్చే పెట్టుబడి ఆఫర్లను అస్సలు నమ్మవద్దని హెచ్చరించారు.ట్రేడింగ్ యాప్ లేదా డ్యాష్‌బోర్డ్‌లో భారీగా లాభాలు కనిపిస్తున్నంత మాత్రాన నిజంగా డబ్బు పెరిగినట్లు భావించవద్దని తెలిపారు. ఎక్కడైనా పెట్టుబడి పెట్టే ముందు ఆ సంస్థ విశ్వసనీయతను,దాని అధికారిక వెబ్‌సైట్, యాప్ డౌన్‌లోడ్ సోర్స్‌ను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని, కేవలం ఆకర్షణీయ ప్రకటనలను చూసి డబ్బులు బదిలీ చేయవద్దని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించి నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ (ఐపీఎస్), నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్,నిర్మల్ టౌన్ సీఐ సమ్మయ్య,సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రమణ,ఆర్ఐ రామ్ నిరంజన్,తదితరులు పాల్గొన్నారు.

**సిఇఐఆర్ పోర్టల్ ద్వారా 112 చోరీ మొబైల్స్ రికవరీ**

జిల్లా పరిధిలో పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించడంలో జిల్లా పోలీసులు విశేష సత్ఫలితాలు సాధిస్తున్నారు. సిఇఐఆర్ పోర్టల్ ద్వారా తాజాగా రికవరీ చేసిన సుమారు రూ. 12.88 లక్షల విలువైన 112 సెల్ ఫోన్లను జిల్లా ఎస్పి డా. జి. జానకి షర్మిల బాధితులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో కీలక భాగమైందని, ఫోన్ పోయినా లేదా చోరీకి గురైనా వెంటనే సిఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులు స్వయంగా పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చని లేదా ఫోన్ బిల్లు, ఆధారాలతో సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదిస్తే ఫోన్‌ను బ్లాక్ చేసి రికవరీ చేస్తామని తెలిపారు.జిల్లావ్యాప్తంగా సిఇఐఆర్ ద్వారా ఇప్పటివరకు మొత్తం 2,377 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేసినట్లు ఎస్పి వెల్లడించారు. మొబైల్స్ రికవరీలో ప్రతిభ చూపిన ఐటీ కోర్ టీమ్, పోలీసు అధికారులను ఎస్పి అభినందించారు.

## చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య: కలెక్టర్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మంగళవారం సోన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు.ముందుగా ఎంపిపిఎస్ పాఠశాలను తనిఖీ చేసి పాఠశాలకు సంబంధించిన వివరాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థులంతా క్రమం తప్పకుండా బడికి వచ్చే విధంగా చూడాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పుస్తకాలను చదివించడం ద్వారా భాషా జ్ఞానం, సబ్జెక్టుపై నైపుణ్యం పెరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలలో రోజూ కొంత సమయం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు కథలు చదివిపించాలన్నారు. సరికొత్త పద్ధతుల ద్వారా విద్యార్థులకు చదువు నేర్పిస్తే, వారికి నేర్చుకోవాలన్న ఆసక్తి కలుగుతుందన్నారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన వివరాలన్నీ అధికారుల ద్వారా తెలుసుకున్నారు.విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు, ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న,తహసీల్దార్ సంతోష్,ఎంపిఒ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాము తనిఖీ



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : సాధారణ తనిఖీ లో భాగంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ దరూర్ క్యాంప్ లో ఉన్నఈవీఎం లను భద్రపరిచిన గోదామును తనిఖీ చేశారు.ప్రతినెల ఈవీఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సిసి కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు.గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్ఠమైన భద్రత ఉండాలని,నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు.ఈ పర్యవేక్షణలో జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత,జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటిస్తూ సేవలందించాలి

కలెక్టర్ సత్యప్రసాద్



ప్రజాపక్షం/మల్లాపూర్ : ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ వచ్చే ప్రజలకు వైద్యులు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు.ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు.కుక్క పాముకాటు కోతుల వల్ల జరిగే ప్రమాదాలకు అవసరమయ్యే మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులకు సూచించి, కాలం చెల్లిన మందులను ఉండకుండా చూసుకోవాలన్నారు.అంతకుముందు పాదధామరాజు పల్లి గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని పరిశీలించి, వాల్గోండా గోదావరి నదిని సందర్శించారు.వీరి వెంట ఆర్డిఓ నరసింహారావు జిల్లా వైద్యాధికారి సుజాత వైద్యాధికారిని వాహిని,సర్పంచులు రోండ్ల రాజేశ్వరి రాజారెడ్డి,తోపారపు వసంత,సురేందర్,నాయకులు శాఖ ప్రభు కిరణ్,వెంకట్ రెడ్డి,ఎమ్మార్వో ఎంపిడిఒ,తదితరులున్నారు.

## విద్యతోనే చక్కటి భవిష్యత్తు

జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్




ప్రజాపక్షం/గజ్వేల్: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుండగా, విద్యతోనే పేద విద్యార్థులకు చక్కటి భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాధికారి రమేష్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చక్కటి వసతులు కల్పిస్తుండగా, నాణ్యమైన విద్యాబోధన లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రా మీణ విద్యార్థులే ఉన్నత శిఖరాలకు చేరుకుం టుండగా, వారి స్ఫూర్తితో నేటితరం ముందుకు సాగాలని ఆకాంక్షించారు.విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థు లు ప్రతిభ కనబరిచి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు గ్రామీణ విద్యార్థులకు ప్రోత్సాంహ ఇస్తుండగా, ప్ర భుత్వ పాఠశాలలను దాతలు దత్తత తీసుకోవాలని కోరారు. హెచ్ఎం వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు అవసరమని స్పష్టం చేశారు. సర్పంచ్ జయభారతి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులను అభినందించారు.

## హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమాసాహెబ్

ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : గడువు ముగిసిన నాసిరకం సరుకులను వినియోగిస్తూ పిల్లల అనారోగ్యానికి కారణం అవుతున్న విజయపురి ఎస్‌టి బాయ్స్ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోడా మోహన్ నాయక్, భీమాసాహెబ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో నగర అధ్యక్షుడు ప్రకాశ్ నాయక్, రమేశ్, శ్రీనివాస్‌లతో కలిసి శాతావాహన యూనివర్సిటీ ఎదురుగా ఉన్న గిరిజన బాలుర హాస్టల్‌ను గిరిజన సంఘం బృందం సందర్శించింది. అలాగే మెనూ ప్రకారం పిల్లలకు సరిపోను భోజనం అందించడం లేదని పిల్లలు వాపోయారు. 120 పిల్లలకు కేవలం నాలుగు లీటర్ల పాలు మాత్రమే తీసుకుంటున్నారని తెలిపారు. నీళ్ల చారు, అధిక మొత్తంలో నీళ్లు కలిపిన మజ్జిగ అందిస్తున్నారని మండిపడ్డారు. మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనంలో రెండు రకాల కూరలు వడ్డించాల్సి ఉండగా కేవలం ఒకే రకం కూర పెడుతున్నారని తెలిపారు. పిల్లకు సబ్బుల బిల్లు, యూనిఫార్మ్ ఇప్పటివరకు అందించలేదన్నారు.పదో తరగతి వరకు లేని మూలంగా చాలామంది గిరిజన విద్యార్థులు డ్రపౌట్స్‌గా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

## అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలు

ప్రజాపక్షం/గంగాధర : ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గంగాధర మండలంలోని చెర్లపల్లి ఆర్ గ్రామంలో మంగళవారం అంగన్ వాడీ కేంద్రంలో సర్పంచ్ ఎట్టేపు కనుకయ్య ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు చేపట్టే వివిధ కార్యక్రమాల్లో భా గంగా అంగన్ వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు తల్లి పాలుబంగారు బాట అనే ని నాదాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పుట్టిన వెంటనే గంటలోపు తల్లి పాలు ఇవ్వడం, 6 నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వడంతో పాటు 2 సంవత్సరాల వరకు తల్లి పాలతోపాటు పౌష్టికాహారం అందించడం వల్ల కలిగే లాభాలను వివరించారు.తల్లి పాలు పిల్లలకు రోగ నిరోధక శక్తిని పెంచుతాయని, శిశు మరణాలను తగ్గిస్తాయని, ప్రతి తల్లి తప్పకుండా తల్లి పాలు ఇవ్వాలని పేర్కొన్నారు.ఉప సర్పంచ్ నేరేళ్ల అయిలయ్య, అంగన్‌వాడీ టీచర్ అంజలి, రేండ్ల పద్మ మాదన్న, మాంకాళి అనిల్, ఆశా వర్కర్ మమత, గర్భిణీలు, బాలింతలు, పాల్గొన్నారు.



# ‘ఎటిసి’లతో ఉపాధి అవకాశాలు మెరుగు

యువతకు ఆధునిక శిక్షణ అందిస్తాం
విదేశాల్లో ఉద్యోగాలకు ట్రైనింగ్
మంత్రి వివేక్ వెంకటస్వామి

రుద్రంగిలో రూ.45 కోట్లతో ఎటిసి కేంద్రానికి రూ.40 లక్షలతో సిసి రోడ్డు పనులకు మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శంకుస్థాపన



ప్రజా పక్షం/ వేములవాడ / రుద్రంగి: అడ్వాన్స్‌డు టెక్నాలజీ సెంటర్లతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి 45 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఎటిసి) భవన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులతో 40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు డైరెక్టర్ ఉపాధి కల్పన అండ్ శిక్షణ శాఖ ఐఎఎస్ ఎ నిర్మల క్రాంతి వెస్లీ, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్‌పి మహేష్ బి గితె తో కలిసి శంకుస్థాపన చేశారు.మంత్రి వివేక్ వెంకటస్వామికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్‌పి మహేష్ బి.గితె, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన పెన్షన్లకు సంబంధించిన కీలక ప్రకటన చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో 4000 వేల కోట్లతో 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఐటీఐలను రాష్ట్ర ప్రభుత్వం ఆధునీకరిస్తోందన్నారు.జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకొని విదేశీ భాషల శిక్షణ అందిస్తున్నామని,రుద్రంగికి జర్మన్ భాషా శిక్షకుడిని పంపించి 100 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ ఉపయోగపడే విధంగా ఎటిసిల్లో నూతన కోర్సులు ప్రవేశ పెడతామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రుద్రంగిలో 1986లో ప్రభుత్వ జూనియర్ కళాశాల



ఏర్పాటై విద్యాభివృద్ధికి దోహదపడిందన్నారు. మూడపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. స్కూల్ లో 2500 మంది విద్యార్థులు చదివే అవకాశం ఉందని వివరించారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు కోసం రూ.45 కోట్ల భూసేకరణ చేపట్టామని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకుల తిరుపతి, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ ముకుంద రెడ్డి, ఆర్‌డిఒ కే .ఎస్ బీ కుమారి, డిఎస్‌పి శ్రీనివాసులు, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, ఇఇ పిఆర్ సుదర్శన్ రెడ్డి, మైనింగ్ శాఖ ఎడి క్రాంతి, తహసీల్దార్ పుష్పలత, ఎంపిడిఒ నటరాజ్, సర్పంచ్ గండి నారాయణ పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఫొటో జర్నలిస్ట్‌గా వడ్లూరి రవీందర్

ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ టీవీ5 సీనియర్ పాత్రికేయులు వడ్లూరి రవీందర్ కు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫోటో జర్నలిస్టు పురస్కారం లభించింది.కర్ణాటక రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం బెంగుళూరులోని చిత్రకళ పరిషత్ భవన్ లో జరిగిన జాతీయ స్థాయి ప్రెస్ ఫోటో జర్నలిస్ట్ ఫోటో కాంపిటీషన్లో రవీందర్ పంపించిన ఫొటో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది.ఈమేరకు ఉత్తమ ఫోటోగ్రాఫర్ గా ఎంపికైన రవీందర్ ను కర్ణాటక రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి రామలింగారెడ్డి శాలువతో సన్మానించి మెమెంటో పత్రాన్ని అందజేసి అభినందించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ఫోటో జర్నలిస్ట్ గా ఎంపికైన రవీందర్‌ను సహచర సీనియర్ పాత్రికేయులు ఎస్.రామకిష్టయ్య,జె.సురేందర్ కుమార్,ఎస్.మురళి, కె.శ్రీరాములు,ఎస్.శ్రీనివాస్,ఎస్.అశోక్,కె.వరప్రసాద్,అభినందించారు.



## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఇన్‌చార్జి జిల్లా ట్రెజరీ అధికారి రమేష్

ప్రజాపక్షం/పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సహాయ ట్రెజరీ అధికారి (ఏటీఓ)గా విధులు నిర్వహిస్తున్న కె. రమేష్‌కు ఇన్‌చార్జి జిల్లా ట్రెజరీ అధికారి (డిటిఒ)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించబడిన సందర్భంగా మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌చార్జి జిల్లా ట్రెజరీ అధికారి కె. రమేష్ జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.అనంతరం జిల్లా ట్రెజరీ కార్యాలయ నిర్వహణ, ప్రభుత్వ ఆర్థిక లావాదేవీల నిర్వహణ,ప్రజలకు మెరుగైన సేవలందించే అంశాలపై స్వల్పంగా చర్చించారు.



## ఉద్యాన పంటలతో రైతులకు అధిక లాభాలు

మండల ఉద్యానవన విస్తరణ అధికారి రాము

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మండలం లోని రాఘవాపూర్, పెద్ద బొంకూర్ శివార్లలోని పామాయిల్, బీర, కీరదోస ,కూరగాయ తోటలను మండల ఉద్యాన విస్తరణ అధికారి బి. రాము పరిశీలించారు. ముఖ్యంగా రైతులు పంట మార్పిడి చేపట్టాలని వరి, పత్తి, మొక్కజొన్న పంటలకి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పండ్లు,పామాయిల్ తోట లు, పూల తోటలు సాగు చేపట్టాలని ఉద్యాన విస్తరణ అధికారి బి. రాము అన్నారు.ఉద్యాన పంటలైన పామాయిల్ తోటలకు ,డ్రిప్, స్ప్రింక్లర్, డ్రిప్,పండ్ల తోటలకు,కూరగాయలకూ సంబంధించి అమలులో ఉన్న అన్నీ పథకాల ప్రయోజనాలు /రాయితీలు పొందెందుకు తప్పకుండా రైతు రిజిస్ట్రీ (పంటల నమోదు) తప్పకుండా చేయాలన్నారు.ఈ మేరకు పంట మార్పిడి విధానం ప్రత్యామ్నాయ పంటల సాగు పై రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఇప్పుడు అనువైన సమయం కాబట్టి పామాయిల్ తోటలు, పంట మార్పిడి తో రైతులకు మార్గాలు ఏర్పడతాయాని,మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.బోర్ల కింద బావులా కింద డ్రిప్ తో ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్లు,పామాయిల్ తోటలు సాగు చేయాలన్నారు.

# పారదర్శకంగా అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ

వార్డుల వారీగా జాబితా సిద్ధం
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



ప్రజాపక్షం/కరీంనగర్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కోసం లబ్ధిదారుల ఎంపికను పూర్తి పా రదర్శకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చి త్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆ దేశించారు. ఈ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో సమగ్ర ప రిశీలన చేపట్టాలని సూచించారు. మంగళవా రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్లతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సమీ క్ష స మావేశం నిర్వహించారు. అర్హులకు ఎలాంటి అన్యా యం జరగకుండా ప్రతి దరఖాస్తును క్షు ణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో దరఖాస్తును కనీసం రెండుసార్లు పరిశీలించి, అర్హత ప్రమాణాల ప్రకారమే నిర్ణ యం తీసుకోవాలని స్పష్టం చేశారు. సరైన కార ణం లేకుండా ఏ ఒక్క దరఖాస్తును తిరస్కరించవద్దని సూచించారు. ప్రతి వార్డులో క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించి, పారదర్శకంగా అర్హుల జాబితాను సిద్ధం చేయాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పం పిణీ ప్రక్రియను నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వా మి మాట్లాడుతూ, తమ మున్సిపాలిటీ పరిధిలో అర్హు ల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. హు జురాబాద్ మున్సిపల్ కమిషనర్ కిషన్ మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, మిగిలిన ఇళ్లకు సంబంధించిన దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి

దేశ భవిష్యత్తును యువతే నిర్ణయించాలి
ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/కరీంనగర్: యువత రాజకీయాల్లోకి రావాలి దేశ భవిష్యత్తును యువతే నిర్ణయించాలని, కేంద్ర యువజన వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఉద్యమాల్లోకి రావాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలోజు రంజిత్, ప్ర ధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ పిలుపునిచ్చారు.సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లో నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల పోస్టర్ ను కరీంనగర్ లోని తెలంగాణ చౌక్ లో ఆవిష్కరించారు.భారతదేశంలో అ త్యధిక జనాభా యువతదే అయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వ విధానాలు యువతకు ఉపాధి, విద్య, భద్రత కల్పించే దిశగా కాకుండా ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్, ప్రభుత్వరంగ సంస్థల బలహీనీకరణ వైపు సాగుతున్నాయని విమర్శించారు. జాతీయ యువజన విధానం పేరుతో ప్రకటనలు చే స్తున్నా, యువతకు శాశ్వత ఉద్యోగాలు, నాణ్యమైన ప్రభుత్వ విద్య, అందుబాటు వైద్యం, నైపుణ్యాభివృద్ధి, ప్రజాస్వామ్య భాగస్వామ్యం వంటి అంశాలపై స్ప ష్టమైన హామీలు అమలు కావడం లేదన్నారు. దేశ నిర్మాణంలో యువతను భా గస్వాములను చేయకుండా, ఎన్నికల సమయంలో మాత్రమే యువతను గుర్తు చేసుకోవడం దురదృష్టకరమన్నారు.పాలకులను ప్ర శ్నించడం, ప్రజా సమస్యలపై పోరాడడం, రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, ప్రజాస్వా మ్యం, సామాజిక న్యాయం పరిరక్షణలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ హక్కు, విద్య హక్కు, వైద్య హక్కు, కార్మిక హక్కులు, మహిళల భద్రత, రైతుల సంక్షేమం, శాస్త్రీయ దృక్పథం వంటి అంశాలపై ఉద్యమాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. సెప్టెంబర్ 8, 9,10 తేదీలలో యాదగిరిగుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలు యువతకు కొత్త దిశానిర్దేశం చేసే చారిత్రాత్మక వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన విధానాలు, నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, విద్యా, వైద్య రంగాల పరిరక్షణ, ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక న్యాయం, శాంతి, శా స్త్రీయ సోషలిజం వంటి అంశాలపై సమగ్ర చర్చలు జరిపి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో మహాసభల్లో పాల్గొని వాటిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కసిబోజుల సంతోష చారి, కోశాధికారిఉదయ భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుపాకల సందీప్ ఎండి జహంగీర్, శంకర్,విష్ణు పాల్గొన్నారు.




# ఎరువుల కొనుగోలుకు కొత్త విధానం

వరి పంట పొలాలను పరిశీలించిన అధికారులు
పంట మార్పిడి చర్యలు తీసుకోవాలి
వ్యవసాయ శాస్త్రవేత్త పల్లవి,ఎంఎఒ శ్రీనాథ్



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఎరువుల కొనుగోలుకు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినారని,కొత్త యాప్ ద్వారానే రైతులు ఎరువులను కొనుగోలు చేయాలని సిద్దిపేట అర్బన్ మండల వ్యావసాయ అధికారి శ్రీనాథ్ తెలిపారు. మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ..కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6వ తేదీ నుండి ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ యాప్ ద్వారానే యూరియా,డిఎపి,ఎన్‌పికె కాంప్లెక్స్,ఎంఒపి తదితర ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. ఈ యాప్‌లో రైతు రిజిస్ట్రీతో కానీ,ఆధార్‌తో కానీ లాగిన్ కావాలని,రైతులు ఆధార్‌తో కూడా నమోదు చేసుకోవచ్చున్నారు. ఈ నెల 6వ తేదీ నుండి రైతులు ముందుగానే తమ ఆధార్,మొబైల్ నంబర్, భూమి వివరాలను సిద్దంగా ఉంచుకొని,సమీప ఎ రువుల విక్రయ కేంద్రాన్ని లేదా వ్యవసాయ శాఖ సిబ్బంది సహాయంతో సమోదు చేసుకొని ఎరువులను కొనుగోలు చేయగలరన్నారు.సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి గ్రామంలోని వరి పంట పోలాలను మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌తో కలిసి వ్యవసాయ శాస్త్రవేత్త పల్లవి మంగళవారం పరిశీలించారు.పంట పోలాలలో మొగి పురుగు,సల్ఫైడ్ దుష్ప్రభావంను గుర్తించారు.ఎకరాకు మూడు కిలోల కార్టాప్ హైగ్రోక్లోరైడ్‌తో ఎమోమెక్టిన్ బెంజోయేట్ లేదా ఐసోసైక్లోసెరామ్ 120 మి.లీ. లేదా టెట్రానిలిప్రోల్ 100మి.లీ. ఎకరాకు పిచికారి చేయాలని తెలిపారు. ప్రధానంగా సల్ఫైడ్ దుష్ప్రభావాన్ని గుర్తించామని పంట దిగుబడి చా లా తగ్గుతుందన్నారు. వానాకాలం, యాసంగిలో సంవత్సరాల తరబడి వరి పంటనే సాగు చేయడం వలన భూమిలో సల్ఫైడ్ అధికమవుతుందన్నారు. వరి పంటలో విరివిగా వినియోగించే ఎరువుల వ లన సల్ఫైడ్ పంట పొలంలో అధికమై, పంట వేర్లకు గాలి అందక నేలలో రసాయన చర్యలు జరిగి మార్పు జరుగుతదన్నారు. సల్ఫైడ్ దుష్ప్రభా వం వలన వరి పంట మధ్యలో అక్కడక్కడ గుంపులు గుంపుగా బాగా పెరిగి పంట మొత్తం పసుపు రంగులోకి మారి ఎదుగుల క్షీణిస్తుందని అన్నారు. పంట మార్పిడి పద్ధతితో సల్ఫైడ్ దుష్ప్రభావనంను తగ్గించవచ్చని, ప్రతి రైతు పంటమార్పిడి పద్ధతులను అనుసరిచాలని సూచించారు.

# మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్

ప్రజాపక్షం/మెట్‌పల్లి : జగిత్యాల జిల్లా పోలీస్ స్టేషన్ల పనితీరు,నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించే క్ర మంలో జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్, ఐపీఎస్ మంగళవారం మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తు పురోగతి,రికార్డుల నిర్వహణ,సిబ్బంది హాజరు, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు,హిస్టరీషీటర్లపైనిఘా తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు. అనంతరం స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించి,ప్రజలకు అందుతున్న పోలీసు సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు.ప్రజా భద్రతలో విజిబుల్ పోలీసింగ్ కీలకమని,ప్రతి సిబ్బందికి కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎ లాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అం దించాలని తెలిపారు.నేరాల నియంత్రణకు ఇం టెలిజెన్స్ సేకరణ, బీట్ వ్యవస్థ, రాత్రి గస్తీ, వా హన తనిఖీలు,సిసి కెమెరాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, జైలు నుంచి విడుదలైన నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉం చాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల అక్రమ ర వాణా, విక్రయాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, గం జాయి, డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని సూచించారు.యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.అలాగే ఆన్‌లైన్ మో సాలు, ఓటీపీ, కేవైసీ,ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్ లు,డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హె ల్మెట్, సీట్ బెల్ట్ నిబంధనలను అ మలు చేయడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, మోడిఫైడ్ సైలెన్సర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ ఆకస్మిక తనిఖీలో డిఎస్‌పి అడ్లూరి. రాములు, ఎస్‌ఐలు పబ్బ.కిరణ్ కుమార్,రాజు నాయక్, మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




## గద్దర్ మూడవ వర్ధంతి సభను విజయవంతం చేయండి

కరపత్రం ఆవిష్కరించిన ప్రజా సంఘాల నాయకులు

ప్రజాపక్షం/పెద్దపల్లి : ప్రజాకవి, విప్లవ గాయకుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ మూడవ వర్ధంతి సందర్భంగా ఈనెల 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు హైదరాబాదు రవీంద్ర భారతిభవన్లో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు దళిత లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడీ సుదర్శన్,తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్యాలు తెలిపారు.పెద్దపల్లి జిల్లా కేంద్రం బస్టాండ్ వద్ద పోస్టర్ ఆవిష్కరణ చేసిన అనంతరం వారు మాట్లాడుతూ గద్దర్ ఆశయాలు,ఆయన ప్రజా ఉద్యమాలకు అందించిన సేవలు, సాహిత్య వారసత్వంపై ప్రముఖులు ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. ప్రజాసంఘాల నాయకులు,కళాకారులు,మేధావులు, గద్దర్ అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.గద్దర్ చూపిన సమానత్వం,సామాజిక న్యాయం ,ప్రజా చైతన్య మార్గాన్ని భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.సభకు ప్రజలు,అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం,తెలంగాణ ఉద్యమకారుల జెఎసి రాష్ట్ర నాయకులు ఆంజనేయులు,ప్రజా సంఘాల నాయకులు రాజు, కె.రాజు,ప్రవీణ్ ,పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 8 నుంచి వైఎఫ్ రాష్ట్ర మహాసభలు



యువజన ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలు సెప్టెంబర్ ఎనిమిది నుంచి 10వ తేదీ వరకు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్టలో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా బాధ్యులు కొండపర్తి గోవిందరావు లతో కలిసి ఏఐ వైఎఫ్ నాయకులు మంగళవారం గిరిప్రసాద్ భవన్‌లో ఆవిష్కరించారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఏఐ వైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

**జిల్లా మహాసభలు కోదుమూరులో:** అఖిల భారత యువజన సమాఖ్య ఖమ్మం జిల్లా 2 వ మహాసభలు చింతకాని మండలం కోదుమూరులో ఆగస్టు 21న నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా ఇంచార్జి కొండపర్తి గోవిందరావు తెలిపారు.

## 'ఆయిల్ పామ్' లాభదాయకం



మెగా ప్లాంటేషన్‌లో ఉద్యాన అధికారి నగేష్

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఆయిల్ పామ్ సాగు లాభదాయకమని రైతులు ఆవైపు దృష్టిసారించాలని ఖమ్మం ఉద్యాన అధికారి జి. నగేష్ తెలిపారు. మండల పరిధిలోని మంచుకొండ గ్రామంలో వల్లభనేని రమేష్ వ్యవసాయ క్షేత్రంలో 17 ఎకరాల్లో 969 ఆయిల్ పామ్ మొక్కలు (మెగా ప్లాంటేషన్) నాటే కార్యక్రమాన్ని జిల్లా ఉద్యాన అధికారి జి. నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ వ్యవసాయేతర పంటల్లో ఆయిల్ పామ్ సాగు లాభదాయకమన్నారు. కోతుల బెడద ఉండని, ఒక్కసారి నాటితే 30 ఏళ్ల వరకు ఆదాయం వచ్చే పంట అన్నారు. మార్కెట్ సౌకర్యం కూడా బాగుందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు మండలంలో 725 ఎకరాల్లో ప్లాంటేషన్ జరిగిందన్నారు. ప్రభుత్వం ఎకరానికి రూ. 50వేల రాయితీ ఇస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటగా వక్క, కోకో, మునగ, సుగంధ పంటలు వేసుకోవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ చంద్రశేఖర్, లక్ష్మ శేఖర్, రైతులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజా చైతన్యయాత్రలు: రత్నకుమారి



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** దేశంలో రాష్ట్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 6 నుండి 12వరకు సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకురాలు కరిశ రత్నకుమారి అన్నారు. ఈమేరకు మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో చైతన్యయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని సాగుభూములకు నీరందించాలని ప్రాజెక్టుల నిర్వాసితుల వల్ల భూముల్లో కోల్పోయిన రైతులకు పరిహారాలు ఇవ్వాలని, జిల్లాలోని గల కార్మికుల కోసం ఇఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, ఎన్నికల్లోకాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన పాదయాత్రకు పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపి జయప్రదం చేయాలని, సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పైడిపల్లి లక్ష్మీ మేదిని లక్ష్మీ, దార లక్ష్మీ పల్నాటి వీణ ప్రభావతి ప్రశాంత్, షేక్ షాహిన్ శ్రీరాములు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 'జైల్‌భరో' కార్యక్రమాన్ని జయప్రదం చేయండి: సత్యనారాయణరెడ్డి



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఆగస్టు 10న దేశ వ్యాప్తంగా జరగనున్న జైలుభరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తల్లాడ మండలంలో ప్రచారం నిర్వహించారు. సత్తెనపల్లి నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న జిఒల వల్ల రైతులకు, వ్యవసాయ కార్మికులకు, ఉద్యోగులకు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని దేశంలో ఉన్న అన్ని సంఘాల ఆధ్వర్యంలో స్వతంత్ర ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, చల్లా నాగేశ్వరరావు, షేక్ మస్తాన్, కృష్ణా, రాంబాబు, నరేష్ పాల్గొన్నారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి : మేయర్ మూడ్ గణేష్

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి సంబంధించి పురపాలక సంస్థ కార్యాలయంలో నేడు జరిగే ప్రజావాణిని కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ మూడ్ గణేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గల 60 డివిజన్ల పరిధిలోని ప్రజలు వారి వారి సమస్యల పరిష్కారం కోసం నేరుగా కార్యాలయంలో జరిగే ప్రజావాణికి వచ్చి దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జ్వరం భారిన పడిన ప్రతీ ఒక్కరు వైద్యులను సంప్రదించి చికిత్సలు పొందాలన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో కార్పొరేషన్ పరిధిలోని సిసి రోడ్లు, సైడ్ డ్రైన్లు రోడ్ల అభివృద్ధి పనులు ప్రాధాన్యతా క్రమంలో చేపడతామని మౌళిక వసతుల కల్పనకు పెద్దపీఠ వేస్తున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతామన్నారు.

# నిలిచిన రిజిస్ట్రేషన్లు

● ధరణి ఆపరేటర్లు ఔట్ ● జూనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు...?



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయం ద్వారా జరగాల్సిన భూ రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. దీనితో స్లాట్ బుక్ చేసుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కార్యాలయాల నుంచి సరైన సమాచారం లేకపోవడంతో ప్రతి రోజు కార్యాలయాలకు వచ్చి రిజిస్ట్రేషన్ల కోసం వేచి చూస్తున్నారు. ధరణి ఆపరేటర్ల వ్యవహార తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం వారిని విధుల నుంచి తప్పించింది. గత ప్రభుత్వం అవుట్‌సోర్సింగ్ పద్దతిలో 2018లో ధరణి చట్టానికి అనుగుణంగా ఆపరేటర్లను నియమించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ధరణి స్థానే భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిన తర్వాత మండల కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ధరణి ఆపరేటర్ల ద్వారానే జరిగేవి. ఇటీవల కాలంలో ఆపరేటర్ల తీరుపైన తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రతి రిజిస్ట్రేషన్‌కు క్రయ, విక్రయదారుల వద్ద నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడం ప్రభుత్వ నిఘా వర్గాలు సైతం ధృవీకరించడంతో ప్రభుత్వం భూ భారతి ఆపరేటర్లపై వేటు వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 636 మంది భూ భారతి ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. వీరి స్థానంలో మండల కార్యాలయాల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంలో భాగంగా జూనియర్ అసిస్టెంట్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియపై శిక్షణ ఇస్తున్నారు. అయితే కొంత మంది భూ భారతి ఆపరేటర్లను కూడా విధుల్లోకి తీసుకునే అవకాశం ఉందని సమాచారం. జిల్లా వ్యాప్తంగా చింతకానిలో 10, తల్లాడలో 9, రఘునాథపాలెంలో 10, గుండాలలో 12, కల్లూరులో 9, అత్యధికంగా నేలకొండపల్లిలో 32, తిరుమలాయపాలెంలో 20 ఇలా అన్ని మండలాల్లోనూ పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం తక్షణం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించాలని క్రయ, విక్రయదారులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈనెల ఎనిమిది నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉందని తెలుస్తుంది.

## గ్రామసభ రసాభాస



నిధుల వినియోగంపై వాడివేడిగా చర్చ

**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామసభ రసాభసగా సాగింది. నూతన పాలక వర్గం ఏర్పడిన నాటి నుంచి నిధుల వినియోగం, చెల్లింపులపై వాడి వేడిగా చర్చ కొనసాగింది. ఇటీవల వాయిదా పడిన గ్రామసభను మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గాజుల కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ గ్రామసభకు ముఖ్య అతిథిగా ఎంపివో శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనురాధ, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు అంశాలను గ్రామసభ దృష్టికి తీసుకు వచ్చారు. రహదారులు, తాగునీటికి సంబంధించి పైపులైన్ నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. నూతన పాలక వర్గం ఏర్పడిన గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు వివిధ పనుల నిమిత్తం చేసిన ఖర్చు, బిల్లుల చెల్లింపులకు సంబంధించి స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. సుమారు రూ. 30 లక్షలకు పైగా నిధులు ఖర్చు , బిల్లుల చెల్లింపులో అవకతవకలు జరిగినట్లు గ్రామస్తులు నిలదీశారు. నిధులకు సంబంధించి పూర్తి వివరాలు సభలోనే చెప్పాలని గ్రామస్తులు నిలదీయడంతో కొంత సేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామసభలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపివో శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ కృష్ణారావు లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, చెల్లింపులకు సంబంధించి అన్ని తీర్మానాలు ఉన్నాయని, పాలక వర్గ సభ్యులు కూడా ఆమోదించి సంతకాలు చేశారని తెలిపారు. ఏ పనికి ఎంత మేర ఖర్చు చేసింది పూర్తి వివరాలు ఉన్నాయన్నారు. సభలో ఇలాంటి అంశాలను చర్చించడానికే గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ప్రత్యేకాధికారి పాలన ఉన్న సమయంలో గ్రామ పంచాయతీలో చేపట్టిన పనులు, నిధుల వినియోగానికి సంబంధించి వచ్చే నెలలో జరిగే గ్రామ సభలో పూర్తి సమాచారం తెలియజేస్తామని కార్యదర్శి అనురాధ తెలిపారు. నిధుల వినియోగంలో ఎటువంటి అవకతవకలు జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## రూ.కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లు

పట్టాభి అరెస్టుతో మరోసారి చర్చ: ఆస్తులపైన విచారణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇటీవల కాలంలో సైబర్ నేరం అత్యంత ప్రమాదకరంగా మారింది. నిమిషాల్లోనే ఖాతాల్లో నుంచి నగదు మాయమవడం జరుగుతుంది. సైబర్ నేరాలకు పాల్పడే వారు వందల వేల కోట్లు కొల్లగొట్టి జల్సాగా జీవించడంతో పాటు రెండు మూడు తరాలకు సరిపడ ఆస్తులను కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఎక్కడో మెట్రో పాలిటన్ నగరాలకి పరిమితమైన ఈ సైబర్ నేరగాళ్లలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులు ఉండటంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా సత్తుపల్లి ప్రాంతానికి చెందిన వారు ఈ సైబర్ నేరాల్లో ఉండటం గతంలో కొంత మందిని అరెస్టు చేయడం ఇప్పుడు తిరిగి ఈ సైబర్ నేరానికి సంబంధించి కీలక వ్యక్తిగా చెబుతున్న దేవరపల్లి పట్టాభిని సైబరాబాద్ పోలీసులు అరెస్టు రిమాండ్‌కు తరలించారు. గత కొంత కాలంగా పట్టాభి వ్యవహారం ఖమ్మంజిల్లా రాజకీయాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా బిఆర్ఎస్ పార్టీ తరుపున ఏ కార్యక్రమం జరిగినా పెద్ద ఎత్తున ఖర్చు చేయడం అదిరిపోయే రీతిలో స్వాగత కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ఈ చర్చకు కారణమైంది. ఆ క్రమంలోనే కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి చెందిన పొట్రు ప్రవీణ్, వేంసూరు మండలం లింగంపాలెంకు చెందిన మోరంపూడి చెన్నకేశవరావు, సత్తుపల్లికి చెందిన మనోజ్, కల్లూరు మండలం లింగాలకు చెందిన ఏపూరి గణేష్‌లను పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి దేవరపల్లి పట్టాభి విదేశాలలో ఉన్నట్లు సమాచారం.

## కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు ఎండగడదాం

సెప్టెంబర్ 1న చలో ఢిల్లీని జయప్రదం చేయాలి
సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి పిలుపు



**ప్రజాపక్షం/చర్ల/భద్రాచలం:** కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, ఎన్నికల్లోఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నిలుపుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. చర్ల మండల కేంద్రంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ అధ్యక్షతన సిపిఐ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్నాయన్నారు. విపరీతంగా పెరిగిపోతున్న ధరలను నియంత్రించడంలో పాలకులు విఫలమయ్యారని విద్యావైద్య ప్రైవేటు పరమవుతోందని, ఆదివాసీలు, దళితులపై దాడులు నానాటికీ పెరిగిపోతున్నాయమని మండిపడ్డారు. తప్పుడు విధానాలకు కేంద్రబిందువైన బిజేపిని గద్దె దించకుంటే దేశం అదోగతి పాలవుతుందన్నారు. రాష్ట్రంలో అధికారం చెలాయిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలుపుకోవాలన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 6 నుండి 12 వరకు ప్రజాచైతన్య జరగనున్నాయని, సెప్టంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రథం చేయాలని అన్నారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఈనెల 7న చర్లలో కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై జయప్రథం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులు కోడిరెక్కల, కల్లూరి జోగయ్య చెన్నం సాంబశివ భద్రం కన్నయ్య శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి పన్నుల వసూళ్లపై వైరా మున్సిపాలిటీ ముట్టడి

మాన్యువల్ బిల్లులతో వసూళ్లపై తీవ్ర అభ్యంతరం
కౌన్సిల్ తీర్మానం లేకుండా పన్నులు వసూలు చేయొద్దని డిమాండ్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో మంచినీటి పన్నుల వసూళ్ల వ్యవహారం రాజకీయ దుమారానికి దారితీసింది. కౌన్సిల్‌లో ఎలాంటి తీర్మానం లేకుండానే మాన్యువల్ బిల్లుల ద్వారా నీటి పన్నులు వసూలు చేస్తున్నారంటూ భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్) నాయకులు, కౌన్సిలర్లు, సిపిఐ కౌన్సిలర్, సిపిఎం కౌన్సిలర్ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనకు సిపిఐ, సిపిఎం కౌన్సిలర్లు కూడా సంఘీభావం ప్రకటించి పాల్గొన్నారు. ధర్నాలో బిఆర్ఎస్ కౌన్సిలర్లు కట్టా స్వరూపరాణి, తిరుపతి శివకుమారి, చిలకా చిన్న కోటయ్య, మాదినేని సునీత, సిపిఎం కౌన్సిలర్ కిన్నెర కృష్ణ, సిపిఐ కౌన్సిలర్ నల్లమోతు శైలజతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ వెంటనే నీటి పన్నుల వసూళ్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ నాయకులు కట్టా కృష్ణార్జునరావు, బాణాల వెంకటేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి చాలాకాలం నీటి పన్నులు వసూలు చేయకుండా ఉంచి ఇప్పుడు మూడు సంవత్సరాలకు సంబంధించిన బిల్లులను ఒకేసారి ప్రజలపై మోపడం అన్యాయమని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన జీవన వ్యయాలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యప్రజలకు ఈ నిర్ణయం మరింత భారంగా మారుతుందని అన్నారు. అంతేకాకుండా పన్నుల వసూళ్లు ఆన్‌లైన్ విధానంలో కాకుండా మాన్యువల్ బిల్లుల ద్వారా జరపడం అనుమానాలకు తావిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు మద్దెల రవి, అప్పం సురేష్, బానోతు సక్కుబాయి, మాదినేని దుర్గాప్రసాద్, నూకల వాసు, ఏదునూరి శ్రీను, మిట్టపల్లి కిరణ్‌కుమార్, ఆదూరి ప్రేమ్, పాసంగులపాటి శివ, బత్తుల రాజు, కొత్తా నర్సింహారావు, మాచర్ల శంకర్, కట్టా నాగేశ్వరరావు, వేముల శివకృష్ణ, వజినేపల్లి చక్రవర్తి, గుగులోతు బాలు, వీరన్న, సైదులు, ముదిగొండ పుల్లయ్య, వల్లెపు రాముత తదితరులు పాల్గొన్నారు.

## మారెళ్లపాడు ఎత్తిపోతలతో 30వేల ఎకరాలకు సాగునీరు

తుమ్మల చెరువుకు గోదావరి జలాలు.. పనులు వేగవంతం: ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం అశ్వాపురం మండల రైతాంగానికి జీవనాడిగా మారనుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బీజీ కొత్తూరు పంప్ హౌస్ వద్ద మంగళవారం మారెళ్లపాడు ప్రాజెక్టు మోటార్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని యంత్ర పూజ అనంతరం మోటార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టులో భాగమైన మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా రైతులు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. లెఫ్ట్ కెనాల్ ద్వారా తుమ్మల చెరువుకు గోదావరి జలాలను తరలించి 4,266 ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు ఆరు గ్రామ పంచాయితీల పరిధిలో సుమారు 8వేల ఎకరాలకు ప్రయోజనం కల్పించనున్నట్లు తెలిపారు. రైట్ కెనాల్ ద్వారా 11, 915 ఎకరాలకు, లెఫ్ట్, రైట్ కెనాల్స్ కలిపి మొత్తం 30వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని వెల్లడించారు. చింతల చెరువు, ఎర్రబొక్కల చెరువు, తీగల చెరువుతో పాటు పలు చెరువులను నింపి చివరి ఎకరం వరకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంఎల్‌ఏ తెలిపారు. రైట్ కెనాల్ పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సూర్య ప్రకాష్, ఎంపీడీవో ముత్యాలరావు, డీఈ శ్రీనివాస్, ఈఈ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, వేములపల్లి రమేష్, యువజన అధ్యక్షుడు గొల్లపల్లి నరేష్, సర్పంచులు, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా చైతన్యమే లక్ష్యంగా కళారూపాలు

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజా చైతన్యమే లక్ష్యంగా కళారూపాలు ఉండాలని కళలు మనో వికాసానికి, సమాజశ్రేయస్సుకు దోహదపడాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కాలంలో కళ వ్యాపార వస్తువుగా మారిందని అబద్ధ ప్రచారాలకు కళారూపాలు వేదిక కావడం అత్యంత బాధాకరమన్నారు. తెలంగాణ ప్రజానాట్య మండలి ఖమ్మం జిల్లా సమితి సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షులు జిఎస్‌ఆర్ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజానాట్య మండలి అనేక దశాబ్దాలుగా ప్రజా అభ్యుదయం లక్ష్యంగా అనేక కళారూపాలను ప్రదర్శించిందన్నారు. ప్రస్తుతం పాలకులు ప్రజలను విస్మరించి పాలన చేయడంతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలులో సైతం వివక్ష ప్రదర్శిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒక పక్క మతం, ప్రపంచీకరణ ఫలితంగా ప్రజా కళలు సైతం అంగడి వస్తువులుగా మారాయని ఆయన తెలిపారు. సిపిఐ నిర్వహిస్తున్న ప్రచార చైతన్య యాత్రలో కళారూపాలను ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ఈనెల ఆరు నుంచి 14 వరకు ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శనలు ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ ఏనుగు వెంకటేశ్వరరావు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరెంపుల సతీష్, కళాకారులు పల్లెసుద్దుల శ్రీను, మోహన్‌రావు, చందర్‌రావు, గణపారపు లక్ష్మీనారాయణ, కొచ్చెర్ల గురవయ్య, పుల్లయ్య, రామ్మూర్తి, రాము పాల్గొన్నారు.

## ఎర్ర జెండా... ముద్దుబిడ్డ అయోధ్య... నూనూ మీసాల నుండి తుది శ్వాస వరకూ అదే పంథా..

● ప్రజల గుండెల్లో చెరగని ముద్ర
● రేపు స్థూపావిష్కరణ



**ప్రజాపక్షం/మణుగూరు:** పినపాక నియోజకవర్గం లో ఎర్ర జెండా అంటే గుర్తుకు వచ్చేది బొల్లోజు అయోధ్య చారి మాత్రమే. ఎర్ర జెండా ముద్దుబిడ్డగా చిన్ననాటి నుండి ఉద్యమమే ఊపిరిగా ఎర్రజెండాను భుజాన వేసుకొని మోసారు అయోధ్య. చిన్న నాయకత్వం నుండి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సభ్యులుగా ఎదిగి ఎందరో మన్ననలు పొందారు. అనునిత్యం పేదవారి పక్షాన నిలబడి వారి సమస్యలను పరిష్కరించి నిరుపేదల గుండెల్లో దేవుడిగా నిలిచాడు. గత తరం నాయకులైన మైస కొండయ్య పాకాల పట్టే వెంకటేశ్వరరావు నాయకత్వంలో అనేక ప్రజా ఉద్యమాన్ని నిర్మించి వేలాది పేదల పక్షాన నిలబడిన నాయకుడు ఆయన పినపాక నియోజకవర్గం లోని మణుగూరు పట్టణంలో ఆనాటి కలెక్టర్ ఇంటి నిర్మాణాలు నిర్మించడానికి నిర్మాణాలు కూలగొడుతున్న తరుణంలో పెద్ద ఉద్యమం నిర్మించగా కలెక్టర్ ఉద్యమకారులపై తుపాకి గురిపెట్టిన వెన్నుతిరగని నాయకుడిగా గుర్తింపు పొందాడు. ఆయన జీవితంలో పోలీసులు, కేసులను సైతం లెక్కచేయకుండా ఎన్నో పోరాటాల నిర్వహించిన ఏకైక వ్యక్తి బొల్లోజు అయోధ్య చారి. గత బూర్గంపాడు నియోజకవర్గ పరిధిలోని మణుగూరు ప్రాంతంలో అనేక గ్రామాలను నిర్మించి పేద ప్రజలకు అండగా నిలిచిన వ్యక్తి అయోధ్య. ఆయన రాజకీయానికి, ఆయన ఎత్తుగడలకు, ఆయన పోరాటాలకు సారీ రారు ఎవరు. పినపాక నియోజకవర్గ రాజకీయాల్లో కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, రైతులు, కార్మికులు, నిర్వాసితులు, పేదల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాల ద్వారా తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల సమస్యలు, భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్వాసితుల అంశాలు, కార్మికుల హక్కుల కోసం ఆయన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయనను మించిన వారే లేరు. ఆయన చేసిన ఉద్యమాలతో ఎన్నో సమస్యలు పరిష్కారమయి నిరుపేదల కళ్ళల్లో ఆనందం చిగురించింది. సమస్య ఏదైనా ప్రజల పక్షాన నిలబడి స్పందించేవారు. ఆయనకు రాజకీయ ప్రత్యర్థులలో కూడా ఎన లేని గౌరవం. ఇంతటి ప్రజా నాయకుడి మరణ వార్త అందరినీ కలచివేసింది. ఉద్యమ ప్రదాత ఊపిరి ఆగిపోయిందని ప్రజ>లంతా కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన మరణానంతరం ఆయన ఆయన గుర్తుగా ఆయన స్వగ్రామైన రామంజివరంలో స్మారక స్థూపాన్ని నిర్మిస్తున్నారు. ఈనెల ఆరో తారీఖున భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రాష్ట్ర జిల్లా నాయకత్వం చేతుల మీదుగా ఆయన స్మారక స్థూపాన్ని ఆవిష్కరించనున్నారు.

***తెలంగాణ సాధనోద్యమంలో....***

తెలంగాణ వాదిగా ముద్రపడిన అయోధ్య తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలకంగా వ్యవహరించారు. పలు స్థానిక ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించారు. అప్పటి జిల్లా కార్యదర్శి సాంబశివరావు తో కలిసి మణుగూరు మంచి ఖమ్మం వరకు 400 కిలో మీటర్ల పాదయాత్రలో అయోధ్య పాల్గొ న్నారు. మణుగూరు ప్రాంతాభివృద్ధిపై ఆయన దృష్టి సారించారు. పారిశ్రా మిక పట్టణమైన మణుగూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ఆయన పరితపించే వారు. ప్రజాప్రతినిధిగా ఎవరున్న మణుగూరు ప్రాంత అభివృద్ధి నిధుల కోసం ఆయన వారిచుట్టూ తిరిగి నిధుల కోసం ప్రయత్నించే వారు. మొత్తంగా అయోధ్య ఒక పోరాట శిఖరం. తన ముందు ఎవరున్నరనేది చూడకుండా ప్రజల పక్షాన నిలబడేవారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గా పని చేస్తు న్నప్పుడు విపక్షం మొత్తం ఓ సమస్యపై ప్రభుత్వాన్ని నిలదీసే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో అధికార పక్షం జెడ్పీ సమావేశాన్ని వాయిదా వేసి బయటకు వెళ్ళింది. జెడ్పి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న గోనెల విజయలక్ష్మి సైతం సమావేశం నుంచి బయటకు వెళ్లడంతో ఉపాధ్యక్షునిగా ఉన్న అయోధ్య అధ్య క్షతన ఒక రోజంతా సమావేశం నిర్వహించారు. ఇది జిల్లా పరిషత్ చరిత్రలో ఒక అరుదైన ఘట్టం. అధికారుల చేత సభ్యుల ప్రశ్నలకు జవాబులు ఇప్పించి అయోధ్య తన పరిణితిని అప్పుడే చాటుకున్నారు.

## కిన్నెరసానికి వరద



399.60 అడుగులకు చేరుకొన్న ప్రాజెక్టు

**ప్రజాపక్షం/పాల్వంచ :** గుండాల, ఆళ్ళపల్లి తదితర ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షానికి మండల పరిధి కిన్నెరసాని జలాశయానికి భారీగా వరద చేరుతోంది. జలాశయం పూర్తి సామర్థ్యం 407 అడుగులు. ఇన్‌ఫ్లో 12, 500 క్యూసెక్కులు. ప్రస్తుతం 399.60 అడుగులకు చేరింది.

# 12వ రోజూ అట్టుడికిన సభలు

- లోక్‌సభ, రాజ్యసభను నిరసనలు, నినాదాలతో హోరెత్తించిన ప్రతిపక్ష సభ్యులు
- రాజ్యసభలో 'జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు, 2026'కు ఆమోదం
- లోక్‌సభలో 'అప్రాప్రియేషన్ (నం. 3) బిల్లు, 2026' పాస్



**న్యూఢిల్లీ :** రామ మందిర విరాళాల చోరీ, నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యకు వ్యతిరేకంగా ప్రతిపక్ష నాయకులు నిరసనలు కొనసాగించడంతో, వర్షాకాల సమావేశాల 12వ రోజైన మంగళవారం కూడా పార్లమెంట్ ఉభసభల్లో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. లోక్‌సభ, రాజ్యసభ ఉదయం ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష ఎంపిలు జులై 20న పార్లమెంటు వైపు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థి నిరసనకారులపై పోలీసులు జరిపిన చర్యకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ, 'హోం మంత్రి సమాధానం చెప్పాలి వంటి నినాదాలు చేశారు. దీంతో ఉభయసభలు తొలుత మధ్యాహ్నం 12 గంటలకు, ఆ తరువాత మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడ్డాయి. అనంతరం లోక్‌సభ సమావేశం కాగా, ప్రతిపక్షాలు తమ నిరసనలను మళ్లీ కొనసాగించారు. నిరసనల మధ్యే ప్రభుత్వ సెక్యూరిటీలలో విదేశీ పెట్టుబడులకు సంబంధించి ఆదాయపు పన్నును రద్దు చేసిన ఆర్డినెన్స్ స్థానంలో కొత్త బిల్లును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. 'పన్నులు, ఇతర చట్టాల (సవరణ) బిల్లు, 2026' ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడేందుకు నోటీసులు ఇచ్చిన ప్రతిపక్ష సభ్యులు, సభాపతి వారి పేర్లను పిలిచినప్పటికీ మాట్లాడటానికి నిరాకరించారు. ఈ బిల్లు 'చెల్లింపు, పరిష్కార వ్యవస్థల చట్టం, 2007', 'ఆదాయపు పన్ను చట్టం, 2025', 'ఆర్థిక చట్టం, 2027'లను సవరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. విపక్ష లక్షల నిరసనల మధ్య లోక్‌సభ 'అప్రాప్రియేషన్ (నం.3) బిల్లు, 2026'ను మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. అయితే ఉదయం సభ సమావేశమైన సమయంలో ప్రశ్నోత్తరాల సమయం సజావుగా సాగేలా చూడాలని స్పీకర్ ఓం బిర్లా సభ్యులను కోరారు. మరోవైపు రాజ్యాసభలో కూడా ప్రతిపక్ష సభ్యులు రామాలయ విరాళాల చోరీకి సంబంధించి నిరసనలు తెలిపారు. ఉదయం సభ ప్రారంభం కాగానే రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు. వెంటనే ప్రతిపక్షాలు తమ నిరసనలను ప్రారంభించారు. నినాదాలు చేశారు. అమిత్ షా సభకు రావాలని డిమాండ్ చేశారు. దీంతో సభను 12 గంటలకు, ఆ తరువాత 2 గంటలకు వాయిదా వేశారు. ఆ తరువాత తిరిగి సభ ప్రారంభం కాగానే 'జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు, 2026'ను మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య జరిగిన చర్చకు సమాధానమిస్తూ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ ప్రతిపాదిత చట్టం ప్రాముఖ్యతను పలువురు సభ్యులు వివరించారని, దీని ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకోవాలని ప్రతిపక్షాలను కోరారు. దేశంలో పుట్టిన ప్రతి బిడ్డ నమోదు కావాలని, ప్రతి మరణం రికార్డు కావాలని మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. రెండుసార్లు వాయిదా పడిన తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, రాయ్ ఈ బిల్లును పరిశీలన, ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. గందరగోళం మధ్య బిల్లుపై చర్చ జరిగింది. అమిత్ షా సభకు రావాలని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తున్నప్పటికీ, మంత్రి ఆ చర్చకు సమాధానం ఇచ్చారు. సభ సక్రమంగా పనిచేయడం లేదని, పార్లమెంటును నడపడానికి ఒకే ఒక మార్గం ఉందని ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. 'ప్రధాన మంత్రి, హోం మంత్రి రావాలి. మేము చర్చను కోరుకుంటున్నాము' అని ఆయన అన్నారు.

# పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులతో ఎంపిల నిరసనలు



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీ, విద్యార్థి నిరసనకారులపై పోలీసుల దురాగతాలకు నిరసనగా గత మూడు నాలుగు రోజుల నుంచి ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంట్ ఆవరణలో నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తున్నారు. మంగళవారం కూడా ఆ పరంపరను కొనసాగించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాతో సహా ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని, ఎంపిలు పార్లమెంట్ మకర ద్వారం ముందు 'చందా చోర్, గద్దీ ఛోడ్' (దొంగ దొంగ), 'అమిత్ షా జవాబ్ దో' (అమిత్ షా... మాధానం ఇవ్వండి) వంటి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. రామ మందిరంలో విరాళాల చోరీ జరిగిందని, దానికి ప్రతీకగా ఎంపిలు ఆ ప్రదేశంలో విరాళాల పెట్టెలను ఉంచి, వాటి చుట్టూ చేరి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొందరు ఎంపిలు అందిన విరాళాలకు, ఆ తర్వాత జరిగిన 'దొంగతనానికి' ప్రతీకగా ఆ పెట్టెలో నగదు కూడా వేశారు. ప్రియాంక గాంధీతో పాటు, ఎస్‌పికి చెందిన డింపుల్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, టిఎంసికి చెందిన సాగరిక ఘోష్, ఆర్‌జెడికి చెందిన సంజయ్ యాదవ్, మనోజ్ ఝా, ఆర్ఎస్‌పికి చెందిన ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. 'అమిత్ షా పార్లమెంటుకు ఎందుకు గైర్హాజరు' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్ వెనుక నిరసన తెలుపుతున్న ఎంపిలు బారులు తీరి, హోం మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు, పార్లమెంట్ ప్రాంగణంలోని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే ఛాంబర్‌లో ఇండియా కూటమి పార్టీల ఫ్లోర్ లీడర్లు సమావేశమై, 'చందా చోరీ', విద్యార్థులపై 'పోలీసుల దురాగతాలు' అనే రెండు అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ప్రతిన బూనారు.

# ఆప్ ర్యాలీ అడ్డగింత

- ప్రధాని నివాసం వైపు ఆప్ ర్యాలీగా వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు
- ఫిరోజ్ షా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన కేజ్రీవాల్ సహా ఆప్ నేతలు



**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వరకు చేపట్టిన ర్యాలీని ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఇ-20 పెట్రోల్‌కు వ్యతిరేకంగా సేకరించిన 2.30 లక్షలకు పైగా వినతిపత్రాలను సమర్పించేందుకు, సుమారు 100 మందితో కలిసి ప్రధాన మంత్రి నివాసం వైపు వెళ్తున్న ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఇతర పార్టీ నాయకులను ఢిల్లీ పోలీసులు అడ్డగించారు. దీంతో వారు ఫిరోజ్ షా రోడ్డుపై నిరసన చేపట్టారు. పోలీసులు అడ్డుకున్న తర్వాత కేజ్రీవాల్, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఆప్ నాయకుడు జాస్మిన్ షా, ఇతర పార్టీ నాయకులతో కలిసి రోడ్డుపైనే బైఠాయించారు. ఇథనాల్ కలిపిన ఇంధనం (ఇ-20 పెట్రోల్) వాహన యజమానులపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆరోపిస్తూ, దేశవ్యాప్తంగా ప్రజల నుండి సేకరించిన వినతిపత్రాలను సమర్పించేందుకు ఆప్ సుమారు 100 మందితో ఈ ర్యాలీని ప్రారంభించింది. అయితే '5, ఫిరోజ్ షా రోడ్ దాటి ఎవరినీ ముందుకు వెళ్లనివ్వమని, శాంతిభద్రతలను కాపాడేందుకు ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ బలగాలతో సహా తగిన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీసు అధికారి తెలిపారు. ఆప్ 'ఇథనాల్ టౌన్ హాల్' నిర్వహించి, ఇ-20 ఇంధనానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టిన కొద్ది రోజులకే ఈ నిరసన జరిగింది. ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై ఉన్న ఆందోళనలను చర్చించేందుకు అపాయింట్‌మెంట్ కోరుతూ కేజ్రీవాల్ ఇంతకుముందే ప్రధాన మంత్రికి లేఖ రాశారు.

**ప్రజా పోరాటాలతోనే ఇ-20 నుంచి విముక్తి**

కాగా, ర్యాలీని పోలీసులు అడ్డగించిన అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ ఇ-20 ఇంధనానికి వ్యతిరేకంగా తమ పార్టీ ప్రచారం కొనసాగుతుందని, దాని అమలును ఆపాలనుకుంటే ప్రజలు పెద్ద సంఖ్యలో నిరసనలో పాల్గొనాలని కోరారు. తమ పార్టీకి శాసనసభ్యులు ఉన్న రాష్ట్రాల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేసే ఏ ప్రయత్నాన్నైనా ఆప్ వ్యతిరేకిస్తుందన్నారు. 'మాకు గోవా, గుజరాత్‌లలో ఎమ్మెల్యేలు ఉన్నారు. అక్కడ కూడా ఇ-20ని ఆమోదించడానికి మేము అనుమతించము. మా శాసనసభ్యులు అసెంబ్లీలలో దీనిని వ్యతిరేకిస్తారు' అని ఆయన అన్నారు. మంగళవారం నాటి పాదయాత్రలో సుమారు 100 మంది మాత్రమే పాల్గొన్నారని, అయితే సోషల్ మీడియాలో విమర్శలు, ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నప్పటికీ వారు ధైర్యంగా పాల్గొన్నారని కేజ్రీవాల్ అన్నారు. ప్రజలు ఇ-20ని వదిలించుకోవాలనుకుంటే, వారు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి రావాల్సి ఉంటుందని చెప్పారు. తాను ఈ విషయాన్ని పార్లమెంటులో లేవనెత్తానని, ఇ-20ని అమలు చేయడానికే కేంద్రం నిశ్చయించుకుందని సూచించే సమాధానం వచ్చిందని ఆప్ ఎంపి సంజయ్ సింగ్ పేర్కొన్నారు. ఇథనాల్ ఉత్పత్తి వల్ల భారత రైతులకు ప్రయోజనం చేకూరదని, బదులుగా ఈ విధానం అమెరికాలోని రైతులకు ప్రయోజనం చేకూరుస్తుందని కూడా ఆయన ఆరోపించారు. ఈ విధానం భారత రైతుల కంటే విదేశీ ప్రయోజనాలకు అనుకూలంగా ఉందని ఆరోపిస్తూ, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ఒత్తిడిని తట్టుకుని' అమెరికా నుంచి ఇథనాల్ దిగుమతులను ఆపాలని కేజ్రీవాల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు.

# నటి త్రిషపై ద్వందార్ధాల వ్యాఖ్యలు

- తమిళనాడు మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్



**న్యూఢిల్లీ :** ప్రముఖులపై అనేకసార్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేసి తీవ్రస్థాయిలో విమర్శలు ఎదుర్కొంటున్న తమిళనాడు డిఎంకె నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, తాజాగా నటి త్రిషపై ద్వంద అర్థాల (డబుల్ మీనింగ్) వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణపై ఆయన్ను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఉదయనిధి స్టాలిన్‌ను విచారించిన అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేస్తామని పోలీసులు తెలిపారు.అయితే, పోలీసుల చర్యను నిరసిస్తూ ఉదయనిధి స్టాలిన్ చెన్నై నివాసం 'నీలాంకరాయి' వద్ద పెద్ద యెత్తున డిఎంకె కార్యకర్తలు గుమిగూడటంతో ఆందోళనకర దృశ్యాలు చోటుచేసుకున్నాయి. దీంతో డిఎంకె వెంటనే యాంటిసిపేటరీ బెయిల్ కోరుతూ మద్రాస్ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేసింది. సీనియర్ డిఎంకె నాయకులు పికె.శేకర్ బాబు సహా కెఎన్.నెహ్రూ అక్కడికి హుటాహుటిన చేరుకున్నారు. ఉదయనిధి భార్య కిరుథిగకు, ప్రతిపక్ష పార్టీయైన డిఎంకె ఆఫీస్ బేరర్లకు కూడా పోలీసుల ఉదయనిధిని అరెస్ట్ చేయడానికి గల కారణాలను తెలియజేశారు. హైకోర్టు బెయిల్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి ముందే పోలీసులు ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్ట్ చేయగా, తంజావూర్ పోలీసులు విచారించిన తర్వాత అరెస్ట్ చేయబడిన ప్రతిపక్షనేతను విడుదల చేస్తామని ప్రభుత్వం విచారణ సందర్భంగా సమర్పించింది. సోమవారం కావేరి డెల్టా పట్టణంలో జరిగిన నిరసన సమావేశంలో ఆయన ప్రసంగం అదుపుతప్పి నటి త్రిషవైపునకు ఆయన ద్వందార్థాల వ్యాఖ్యలు కొనసాగాయన్న ఆరోపణలు చోటుచేసుకున్నాయి. దీంతో డిఎంకె నేత ఉదయనిధిని పోలీసులు అరెస్ట్ చేశారు.అసభ్య పదజాలం వాడటం, మహిళల పరువుకు భంగం కలిగించడం వంటి పలు సెక్షన్ల కింద పోలీసులు ఆయనపై కేసులు నమోదు చేశారు. కాగా, ఉదయనిధి అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తూ డిఎంకె కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా మెరుపు సమ్మెలు, రోడ్-రోకో ప్రదర్శనలు చేపట్టారు. ఆగస్టు 5న అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో డిఎంకె అధ్యక్షులు ఎంకె.స్టాలిన్ అధ్యక్షతన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించే విషయమై చర్చిస్తున్నారు.ముందస్తు బెయిల్‌ను కోరుతూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించినట్లు పార్టీ సీనియర్ నేత కెఎన్.నెహ్రూ చెప్పారు. ఉదయనిధి స్టాలిన్‌ను ఆయన నివాసం 'నీలాంకరాయి' నుంచి తంజావూర్ పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. 'కోర్టే నిర్ణయిస్తుంది' అని అక్కడ గుమిగూడిన విలేకరులను ఉద్దేశించి ఉదయనిధి మాట్లాడారు. 'తంజావూర్‌లో జరిగిన నిరసనలో నేను సిఎం పేరు తప్ప ఏ ఒక్కరి గురించైనా మాట్లాడానా?. అందువల్ల ఇది అంతా ఎందుకు జరుగుతుందో మీరే ఆలోచించండి ?.ఇక దీనిపై కోర్టు నిర్ణయిస్తుంది' అని పోలీసులు అరెస్ట్ చేసి వెంట తీసుకెళుతున్న సమయంలో ఉదయనిధి స్టాలిన్ విలేకరులకు చెప్పారు. విద్వేషాన్ని ప్రోత్సహించడం, అల్లర్లు సృష్టించే ఉద్దేశంతో రెచ్చగొట్టడం, నేరపూరిత బెదిరింపులు వంటి 9 సెక్షన్లను ఉదయనిధిస్టాలిన్‌పై పోలీసులు నమోదు చేశారు. ప్రతిపక్ష నాయకుడైన ఉదయనిధిని అరెస్ట్ చేయడానికి ముందుపోలీసులు ఆయన కుటుంబ సభ్యులు, డిఎంకె పార్టీ సీనియర్ నాయకులు ఎం.ఎ.సుబ్రమణియన్‌తో చర్చలు జరిపారు. ఉదయనిధి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై టివికె జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా తమ నిరసనను తీవ్రతరం చేసింది.




## డిజిటల్ మోసాలపై సుప్రీంకోర్టు సీరియస్

### ఆర్‌బిఐకి ఎస్ఒపి సిద్ధం చేయాలని ఆదేశం

**న్యూఢిల్లీ :** దేశంలో పెరుగుతున్న డిజిటల్ మోసాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సైబర్ నేరాలకు ఉపయోగపడుతున్న మ్యూల్ అకౌంట్లు (ఇతరుల పేర్లతో నిర్వహించే బ్యాంకు ఖాతాలు)పై సమర్థంగా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఒపి) రూపొందించి, దేశంలోని అన్ని హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్‌లకు అందించాలని ఆదేశించింది. డిజిటల్ మోసాల బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు, చట్ట అమలు సంస్థలు ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రీవెన్స్ రెడెసల్ మాడ్యూల్)ను అమల్లోకి తీసుకురావాలని సుప్రీంకోర్టు సూచించింది. మోసపోయిన డబ్బు తిరిగి పొందే వ్యవస్థ (మనీ రెస్టోరేషన్ మాడ్యూల్)ను కూడా తీసుకురావాలని అభిప్రాయపడింది. అలాగే ఆ రెండు వ్యవస్థలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది.

## ఇద్దరు జవాన్‌లను కాల్చివేసిన సిఆర్‌పిఎఫ్ అధికారి

### ఆనంతరం తానూ ఆత్మహత్య : అసోంలో విషాదం



**నాగవ్ :** అసోంలోని సిఆర్‌పిఎఫ్ క్యాంపులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ సిఆర్‌పిఎఫ్ అధికారి ఇద్దరు తోటి జవాన్లను కాల్చి చంపి, అనంతరం తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో మరో జవాను తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో అసోంలోని నాగావ్ జిల్లా కతిమరిలో గల సిఆర్‌పిఎఫ్ 34వ బెటాలియన్ క్యాంపు ప్రధాన ద్వారం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎఎస్ఐ బల్లాని ప్రేమాంబరం విధుల్లో ఉన్న తోటి జవాన్లపై ఒక్కసారిగా కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఇద్దరు జవాన్లు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా.. మరో జవానుకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ప్రేమాంబరం అదే తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఉదంతంతో క్యాంపులో ఒక్కసారిగా కలకలం రేగింది. సమాచారం అందుకున్న సిఆర్‌పిఎఫ్ ఉన్నతాధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాల్పులకు దారితీసిన కారణాలపై విచారణ ప్రారంభించారు.

### 2024 నుంచి డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో

# 254మంది విదేశీయులు అరెస్ట్

- లోక్‌సభకు ప్రభుత్వం వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ప్రాంతంలో 2024 నుంచి మాదక ద్రవ్యాల అక్రమ రవాణ కేసులో 254మంది విదేశీయులను చట్టం అమలు సంస్థలు అరెస్ట్ చేశాయని మంగళవారం ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. అరెస్ట్ అయిన నిందితుల నుంచి రూ.40.53 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. తప్పనిసరి అద్దెదారుల ధృవీకరణ లేకుండా 103మంది విదేశీయులు అద్దె వసతిలో నివసిస్తున్నట్లు గుర్తించగా, 63మంది ఇంటి యజమానులపై చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది. లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో హోం వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానందరాయ్ మాట్లాడుతూ, ఢిల్లీ పోలీసుల ప్రకారం 2024, 2026 జూన్ 30 మధ్య కాలంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులలో దేశ రాజధాని ప్రాంతంలో నివసిస్తున్న 254మంది విదేశీ పౌరులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఖాన్పూర్ ఎక్స్‌టెన్షన్, దేవ్‌లి, సంగం విహార్, మెహ్రౌలీ, హౌజ్‌రాణి, ఉత్తమ్ నగర్, పశ్చిమ ఢిల్లీలోని సమీప ప్రాంతాల నుంచి నైజీరియా సంతతి వారు సహా విదేశీయులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నట్లు మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభకు తెలిపారు. సంవత్సరం వారీగా ఉన్న డేటా ప్రకారం...నిర్దిష్ట ప్రాంతాలలో 2024లో 40మంది విదేశీయులు, 2026 మొదటి అర్థభాగంలో 15మంది విదేశీయులను అరెస్ట్ చేసినట్లు వెల్లడైంది. పట్టుబడిన వాటిలో హెరాయిన్, కొకైన్, యాంఫెటామైన్, ఎండిఎంఎ, మెథాంఫెటామైన్, ఎక్స్టాసీ, గంజాయి, చరస్ ఉన్నాయి. వీటి అంచనా విలువ 2024లో 12.75 కోట్లు, 2025లో 14. 27 కోట్లు, ఈ ఏడాది జూన్ 30 నాటికి రూ.13.50కోట్లుగా ఉంది. ఈ కాలంలో తప్పనిసరి అద్దెదారుల ధృవీకరణ లేకుండా 103మంది విదేశీయులు అద్దె గృహాలలో నివసిస్తున్నట్లు గుర్తించామని మంత్రి నిత్యానందరాయ్ వివరించారు.63మంది ఇంటి యజమానులపై చర్యలు తీసుకున్నామని ఆయన లోక్‌సభకు చెప్పారు.శాంతిభద్రతలను కాపాడటానికి విదేశీయులతో అద్దెదారుల ధృవీకరణను ఢిల్లీ పోలీసులు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. మాదకద్రవ్యాల స్మగ్లర్లపై ప్రభుత్వం చేపట్టిన 'జీరో టోలరెన్స్' విధానంపై ఇచ్చిన మరొక సమాధానంలో నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) ఆన్‌లైన్ ప్లాట్ ఫారమ్‌లు ఎన్‌క్రిప్టెడ్ కమ్యునికేషన్ అప్లికేషన్‌లు, డార్క్‌నెట్ ద్వారా పనిచేస్తున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణ నెట్‌వర్క్‌లను గుర్తించి, నిర్మూలించడానికి నిఘా ఆధారిత, సాంకేతికతతో నడిచే విధానాన్ని అవలంభించారు. డార్క్‌నెట్ ద్వారా జరిగే మాదకద్రవ్యాల అక్రమ రవాణ, క్రిప్టోకరెన్సీ ఆధారిత లావాదేవీలపై దర్యాప్తు చేసేందుకు సైబర్ నిపుణులను నియమించినట్లు మంత్రి నిత్యానందరాయ్ తెలిపారు.

### రాజీనామా చేస్తే... నిమిషాల్లో ఆమోదిస్తాం

# కర్ణాటక సిఎం డికె.శివకుమార్

- కాంగ్రెస్ అసంతృప్త ఎమ్మెల్యేల బెదిరింపులకు ఘాటైన హెచ్చరిక

**బెంగళూరు :** కర్ణాటకలో రాజకీయాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. మంత్రివర్గ విస్తరణలో తమకు చోటు దక్కలేదన్న నైరాశ్యంతో రాజీనామా చేస్తామని బెదిరిస్తున్న కాంగ్రెస్ అసంతృప్త ఎమ్మెల్యేలకు మంగళవారం కర్ణాటక ముఖ్యమంత్రి డికె.శివకుమార్ గట్టి హెచ్చరిక జారీచేశారు. పార్టీ చాలా ముఖ్యమైనదని,వారు రాజీనామా చేస్తే కొద్ది నిమిషాలలోనే దానిని ఆమోదిస్తామని ఘాటైన సమాధానమిచ్చారు. అసంతృప్తితో ఉన్న శాసనసభ్యులు ఓపికతో నిరీక్షించి తమ అవకాశం కోసం వేచిచూడాలని సిఎం శివకుమార్ కోరారు. ప్రభుత్వరంగ బోర్డులు, కార్పొరేషన్లలోని పోస్టులు త్వరలోనే భరీ అవుతాయని ఆయన తెలియజేశారు. ఆయన తాజాగా, తన కేబినెట్‌లో 19మందికి చోటుకల్పించారు. దీంతో మొత్తం 33మంది మంత్రులతో రాష్ట్ర మంత్రివర్గం కొలువుదీరింది. ఈ నేపథ్యంలో అసంతృప్త ఎమ్మెల్యేల నుంచి రాజీనామాల బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి డికె.శివకుమార్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 'నేను చెప్పాల్సింది చెప్పాను. రాజకీయాలలో రాజీనామాలు జరుగుతూనే ఉంటాయి. రాజీనామా చేసేవారిని ఎవరూ ఆపలేరు. వారు పార్టీని, వారి భవిష్యత్తును కావాలని కోరుకుంటే, పార్టీ ముఖ్యమైనది. పార్టీ ఉంటేనే మిగతావన్నీ ఉంటాయి' అని ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తామని బెదిరిస్తున్న విషయమై అడిగిన ఒక ప్రశ్నకు శివకుమార్ సమాధానం ఇచ్చారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, 'ధరమ్‌సింగ్, సిద్ధరామయ్యలు ముఖ్యమంత్రులుగా ఉన్న పదవీ కాలంలో నన్ను మంత్రిని చేయనప్పుడు నేను కూడా రాజీనాయామా చేసి ఉండేవాడిని. పరమేశ్వర (ఉప ముఖ్యమంత్రి), నేను ఇద్దరం సహనంతో ఉండలేదా?, వీరేంద్ర పాటిల్ ముఖ్యమంత్రిగా బంగారప్ప, మల్లికార్జున్ ఖర్గే, ధరమ్‌సింగ్‌లను మంత్రులను చేయలేదు. ఆ తర్వాత బంగారప్ప, ధరమ్‌సింగ్ ముఖ్యమంత్రులు కాలేదా? సహనం ఉండాలి. పార్టీయే ముఖ్యం' అని ముఖ్యమంత్రి శివకుమార్ నొక్కిచెప్పారు. 'ఒక వేళ ఎవరైనా రాజీనామా చేసినట్లయితే, కొన్ని నిమిషాలలోనే నేను దానిని ఆమోదిస్తాను' అని సిఎం హెచ్చరించారు.ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రెండు నెలల తర్వాత డికె.శివకుమార్ సోమవారం 19మందితో తన కేబినెట్‌ను విస్తరించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణ పూర్తి కావడంతో మంత్రి పదవులు దక్కని పలువురు ఆశావహులు రాజీనామాలు చేసేందుకు ముందుకొచ్చారు. ఈ క్రమంలో ఇండి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన యశ్వంతరాయగౌడ వి.పాటిల్ సోమావరా తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో మంత్రి పదవి ఆశావహులు, వారి మద్దతుదారులతో ఆందోళనలు నిర్వహించారు.

### 'నీట్' కేసులో 'లైడిటెక్టర్ పరీక్ష' అభ్యర్థనపై

# సిబిఐ స్పందన కోరిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ :** 'నీట్ పరీక్ష పేపర్ లీక్ కేసును విచారిస్తున్న ఫాస్ట్-ట్రాక్ కోర్టు స్వచ్ఛందంగా లైడిటెక్టర్ పరీక్ష, బ్రెయిన్ మ్యాపింగ్ చేయించుకునేందుకు అనుమతి కోరుతూ ముగ్గురు నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించదగినదా? కాదా? అనే అంశాలతో సహా పలు విషయాలపై మంగళవారం కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) నుంచి స్పందన కోరింది. మంగళ్ లాల్ బివాల్, దినేష్ బివాల్, వికాస్ బివాల్ అనే ముగ్గురు నిందితులు పాలిగ్రాఫ్ టెస్ట్ (లై డిటెక్టర్) పరీక్ష, బ్రెయిన్ మ్యాపింగ్ అని కూడా పిలువబడే బ్రెయిన్ ఎలక్ట్రికల్ యాక్టివేషన్ ప్రొఫైల్ (బిఇఎపి) పరీక్షకు అనుమతిని కోరుతూ ఒక దరఖాస్తు దాఖలు చేశారు. 'తమ నిజాయితీని నిరూపించుకోవడానికి నిష్పక్షపాత, పారదర్శక దర్యాప్తు నిర్వహించడంలో దర్యాప్తు సంస్థకు సహకరించడానికి ఈ పరీక్షలు, పరిశీలనల కోసం న్యాయస్థానం అనుమతి కోరే అభ్యర్థనను ఎటువంటి ఒత్తిడి లేకుండా స్వచ్ఛందంగా చేసినట్లు' ఆ విన్నపంలో పేర్కొన్నారు.సత్యాన్వేషణకు సహాయపడగల ప్రతీ చట్టబద్ధమైన దర్యాప్తును అన్వేషించేందుకు వీలుగా గుర్తింపు పొందిన శాస్త్రీయ పరీక్షకు స్వచ్ఛందంగా ముందుకు రావడం ద్వారా దరఖాస్తుదారులు దర్యాప్తు సంస్థకు సహకరించాలని కోరుకుంటున్నారు' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పరీక్షలను ప్రభుత్వం ఆమోదించిన ఏదైనా ఎఫ్ఎస్ఎల్ లాబొరేటరీలో నిర్వహించవచ్చని కూడా పిటిషన్‌లో తెలియజేశారు.మంగళవారం నాటి విచారణలో 'నీట్ పేపర్ లీక్ కేసుతో వ్యవహరించే న్యాయమూర్తిగా ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తాను తిరిగి నియమించడంతో ధర్మాసనంలో మార్పు కనిపించింది.అతను ఆగస్టు 1నాటి ఢిల్లీ హైకోర్టు నోటిఫికేషన్‌ను అనుసరించి ఉగ్రవాద కేసులను విచారించడానికి ప్రత్యేక నియా' కోర్టుకు బదిలీయ చేయబడిన ప్రత్యే న్యాయమూర్తి అనుగ్రోవర్ బలిగా స్థానంలో అజయ్ గుప్తా నియమితులయ్యారు.ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులను వేగంగా వ్యవహరించేందుకు ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. జడ్జి రెండు రోజులు తర్వాత బాధ్యతలను స్వీకరించారు. నీట్ పేపర్ లీక్ కేసు మొదటి విచారణను జులై 27న నిర్వహించారు. న్యాయమూర్తి బలిగా నియామకానికి ముందు, న్యాయమూర్తి అజయ్ గుప్తా ప్రారంభం నుంచి ప్రశ్నపత్రం లీక్ కేసును విచారిస్తున్నారు. మంగళవారం విచారణ సందర్భంగా న్యాయమూర్తి గుప్తా సిబిఐ నుంచి ఆగస్టు 6న తదుపరి విచారణ తేదీలోగా దరఖాస్తు నిర్వహణా సామర్థ్యం సహా స్పందన కోరారు.ఈ కేసులో 13మంది నిందితులపై సిబిఐ ఛార్జిషీట్ నమోదు చేసింది. ప్రస్తుతం వారందరూ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. మే 12న, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) పేపర్ లీక్ ఆరోపణల మధ్య మెడికల్ అడ్మిషన్ల కోసం మే 3న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (అండర్‌గ్రాడ్యుయేట్) లేదా 'నీట్ యుజిని రద్దుచేసింది. తర్వాత జూన్ 21న రీ-ఎగ్జామినేషన్ నిర్వహించబడింది.

# పాక్, ఖతార్ ఇరాన్‌కు అనుకూలం

అమెరికా సైనికాధికారి జాక్ కీన్




**వాషింగ్టన్:** అమెరికా ఇరాన్ చర్చలపై ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో దౌత్య చర్చల్లో పాకిస్థాన్, ఖతార్ మధ్యవర్తిత్వ పాత్రపై మాజీ అమెరికా సైనికాధికారి జాక్ కీన్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ రెండు దేశాలు చారిత్రకంగా ఇరాన్‌కు అనుకూల వైఖరి ప్రదర్శిస్తున్నందున తటస్థ మధ్యవర్తులుగా వ్యవహరించడం కష్టమని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై ప్రతిపాదించిన సైనిక చర్యను నిలిపివేసి చర్చలకు అవకాశం కల్పించిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీన్ మాట్లాడుతూ, పాకిస్థాన్, ఖతార్ ఇరాన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న విషయం అమెరికా నిఘా సంస్థలకు, పశ్చిమాసియా దేశాలకు చాలాకాలంగా తెలుసని అన్నారు. ఇలాంటి దేశాలు మధ్యవర్తులుగా ఉండటం వల్ల అమెరికా ప్రయోజనాల కంటే ఇరాన్ ప్ర యోజనాలకు ప్రాధాన్యం దక్కే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే సౌదీ అరేబియా కూడా ఇరాన్‌పై కఠిన చర్యల విషయంలో అమెరికాకు పూర్తి సహకారం అందించడం లేదని విమర్శించారు. కాగా, ఇరాన్‌పై సైనిక చర్యకు బదులుగా చర్చలకు మరో అవకాశం ఇవ్వాలని ట్రంప్ నిర్ణయించినట్లు తెలిపారు. తొలి దశలో హార్మోజ్ జలసంధి అంశంపై, అనంతరం అణు నిరాయుధీకరణపై చర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు. అయితే అమెరికాతో నేరుగా ఎలాంటి చర్చలు జరగడం లేదని ఇరాన్ ఖండించింది. ప్రస్తుతం ఒమన్‌తో మాత్రమే హార్మోజ్‌కు సంబంధించిన అంశాలపై సంప్రదింపులు కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది.

# వాషింగ్టన్‌లో కార్చిచ్చు విధ్వంసం



**వాషింగ్టన్:** అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రంలో కార్చిచ్చు తీవ్రరూపం దాల్చింది. అటవీ ప్రాంతాల్లో వేగంగా వ్యాపిస్తున్న మంటల కారణంగా వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించగా, తాజాగా మరో 60 వేల మందిని తాత్కాలిక శిబిరాలకు తరలించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో కార్చిచ్చు కొనసాగుతుండగా, వందలాది భవనాలు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలకు కారణమని భావిస్తున్న స్పోకేన్‌కు చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పరిస్థితి విషమించడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చర్చించిన అనంతరం వాషింగ్టన్ గవర్నర్ బాబ్ ఫెర్గూసన్ రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. బలమైన గాలులు, పొడి వాతావరణం కారణంగా మంటలను అదుపు చేయడం అగ్నిమాపక సిబ్బందికి సవాలుగా మారింది. ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా, సహాయక చర్యలకు అంతరాయం కలగకుండా కార్చిచ్చు ప్రభావిత ప్రాంతాల్లో డ్రోన్ల వినియోగంపై అధికారులు నిషేధం విధించారు. అగ్నిమాపక విమానాలు, హెలికాప్టర్ల కార్యకలాపాలకు డ్రోన్లు ఆటంకం కలిగిస్తున్నాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## కొత్త సుంకాలపై
# కోర్టుకెక్కిన 25 రాష్ట్రాలు



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన కొత్త దిగుమతి సుంకాలను వ్యతిరేకిస్తూ 25 డెమొక్రటిక్ రాష్ట్రాలు ఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్‌ను ఆశ్రయించాయి. ఇప్పటికే కోర్టు కొట్టివేసిన టారిఫ్‌లను మరో రూపంలో తిరిగి అమలు చేసేందుకు ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అవి ఆరోపించాయి. ట్రంప్ ప్రభుత్వం 60 దేశాలపై 10 నుంచి 12.5 శాతం వరకు కొత్త టారిఫ్‌లు విధించగా... వాటి వల్ల అమెరికా వినియోగదారులు, వ్యాపార సంస్థలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని రాష్ట్రాలు వాదించాయి. ఈ సుంకాలను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్ నేతృత్వంలోని కూటమి కోర్టును కోరింది. అధ్యక్షుడికి ఇలాంటి విస్తృత స్థాయి టారిఫ్‌లు విధించే అధికారం లేదని, ట్రంప్ చర్యలు రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొంది. అయితే ట్రంప్ ప్రభుత్వం మాత్రం బలవంతపు కార్మిక వ్యవస్థ (ఫోర్స్‌డ్ లేబర్)తో తయారైన ఉత్పత్తులను అడ్డుకోవడానికే ఈ టారిఫ్‌లు విధించామని సమర్థించుకుంది. ఈ వాదనను రాష్ట్రాల కూటమి ఖండిస్తూ... వెట్టిచాకిరి నిరోధానికి ఈ సుంకాలకు ఎలాంటి సంబంధం లేదని, చట్ట ప్రక్రియను పాటించకుండా వాటిని అమలు చేస్తున్నారని ఆరోపించింది.

# మండల స్థాయిలో 'ప్రజావాణి'!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజావాణిని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండల స్థాయిలో అందే ఫిర్యాదులను సైతం ఇదే పోర్టల్‌లో నమోదు చేసి, రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి యంత్రాంగంతో అనుసంధానం చేయనున్నారు.

**ప్రతీ సోమవారం విచారణ**

కొత్త మార్గదర్శకాల ప్రకారం, ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల పరిషత్ కార్యాలయం (ఎంపిడిఓ కార్యాలయం)లో మండల స్థాయి ప్రజావాణిని నిర్వహించాల్సి ఉంటుంది. దీనికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.

23 మంది మండల స్థాయి అధికారుల హాజరు తప్పనిసరి

తహసీల్దార్, ఎంపిఓ, వ్యవసాయ, ఉద్యాన, పశు వైద్య, మత్స్య, విద్యా, వైద్యాధికారులతోపాటు సంక్షేమ శాఖల అధికారులు, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, విద్యుత్, మున్సిపల్ కమిషనర్ సహా మొత్తం 23 శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా ప్రజావాణికి హాజరై ఫిర్యాదులు స్వీకరించి, తక్షణ చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

**పోర్టల్‌లో ఫిర్యాదుల నమోదు, రసీదు జారీ**

మండల ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, పిటిషనర్ సమర్పించిన అనుబంధ పత్రాలను అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ఫిర్యాదుదారుడికి గ్రీవెన్స్ ఐడితో కూడిన రసీదును జారీ చేస్తారు. దీనికోసం ప్రతి ఎంపిడిఓ కార్యాలయంలో కంప్యూటర్, స్కానర్, ఇంటర్నెట్ సదుపాయంతో ప్రత్యేక రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్ప్‌డెస్క్ సిబ్బందికి జిల్లా, డివిజన్ స్థాయిలో శిక్షణ ఇప్పించాలని నోడల్ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

**వికలాంగులు, వృద్ధులు, గర్భిణులకు ప్రాధాన్యం**

ప్రజావాణి వేదికల వద్ద తాగునీరు, వీల్‌చైర్లు, ఆరోగ్య కేంద్రం, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు కల్పించాలని, ఫిర్యాదుల స్వీకరణలో వికలాంగులు, వృద్ధులు, గర్భిణులు, పసిపిల్లలున్న మహిళలకు ప్రాధాన్యమివ్వాలని మండల నోడల్ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి నిర్వహణకు వర్తించే నిబంధనలు, కాలపరిమితులు, అప్పీళ్లు, పోర్టల్ వినియోగం సహా అన్ని ఇతర ప్రక్రియా అంశాలు మండల స్థాయి ప్రజావాణికి కూడా వర్తిస్తాయని జీఓలో స్పష్టం చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లు మండల స్థాయిలో వెంటనే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, శాఖాధిపతులు తమ జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనేలా చూడాలని, ఫిర్యాదుల పరిష్కారానికి ఎస్‌ఓపిలు రూపొందించుకోవాలని ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులలో స్పష్టం చేశారు.

# ఇజ్రాయెల్‌కు లక్షల ఆయుధాలు సరఫరా

- జెనీవా ఒప్పందం ఉల్లంఘన
- గాజా యుద్ధంలో భారత్ పాత్రపై ఆమ్నెస్టీ నివేదిక కలకలం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గాజా యుద్ధంలో ఇజ్రాయెల్‌కు భారత్ నుంచి ఆయుధాలు, ఆయుధ విడిభాగాల సరఫరా జరిగిందని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. ఈ మేరకు 'మేడ్ ఇన్ ఇండియా: ఇజ్రాయెల్‌కు ఆయుధాలు, మందుగుండు సామాగ్రి సరఫరా' పేరుతో ఆమ్నెస్టీ 40 పేజీల నివేదిక జూలై 30న విడుదల చేసింది. భారత కంపెనీల ద్వారా ఇజ్రాయెల్‌కు భారీ ఎత్తున ఆయుధ సంబంధిత సామాగ్రి సరఫరా జరిగినట్లు నివేదికలో పేర్కొంది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదిక ప్రకారం, 2023 అక్టోబర్ 7 నుంచి భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు 2,596 ఆయుధ సంబంధిత షిప్‌మెంట్లు వెళ్లినట్లు పేర్కొంది. గాజాలో స్వాధీనం చేసుకున్న మెషిన్ గన్ భాగాలు, 155 మిల్లీమీటర్ల ఫిరంగి గుండ్లు, స్కై స్ట్రైకర్ లోయిటరింగ్ మ్యునిషన్ వార్‌హెడ్లు భారత్‌లో తయారైనవేనని ఆమ్నెస్టీ నివేదికలో పేర్కొంది. నివేదిక ప్రకారం సరఫరా అయిన సామగ్రిలో 3,90,516 చిన్న ఆయుధాల విడిభాగాలు,5,64,970 పేలుడు పదార్థాల భాగాలు (డ్రోన్ వార్‌హెడ్లు, ఫిరంగి గుండ్ల కేసింగ్‌లు తదితరాలు),298 సైనిక వాహనాల విడిభాగాలు ఉన్నట్లు ఆరోపించింది.

నివేదికలో పలు భారత రక్షణ తయారీ సంస్థల పేర్లను ప్రస్తావించారు. గాజాకు భారత్ నుంచి ఆయుధాలు సరఫరా చేసిన కంపెనీలలో అదాని డిఫెన్స్ అండ ఏరోస్పేస్,పీఎల్ఆర్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇండోఏఐఎం ప్రైవేట్ లిమిటెడ్, కళ్యాణి సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రభుత్వ రంగ సంస్థ మునిషన్స్ ఇండియా లిమిటెడ్, అల్ఫా ఎల్సెట్ డిఫెన్స్ అండ ఏరోస్పేస్ సిస్టమ్స్, ఈ సంస్థల ద్వారా ఆయుధాలు లేదా ఆయుధ విడిభాగాలు సరఫరా అయినట్లు నివేదికలో ఆరోపించారు. ఆమ్నెస్టి ఇంటర్నేషనల్ చేసిన ఆరోపణలపై ఇప్పటి వరకు భారత ప్రభుత్వం గానీ, నివేదికలో పేర్లు ప్రస్తావించిన కంపెనీలు గానీ అధికారికంగా స్పందించలేదని గమనార్హం.

**గాజా యుద్ధంలో భారీ ప్రాణనష్టం**

2023 అక్టోబర్ 7న ప్రారంభమైన ఇజ్రాయెల్–గాజా యుద్ధంలో సుమారు 74 వేల మందికి పైగా మరణించినట్లు అంతర్జాతీయ సంస్థల అంచనాలను ప్రస్తావించారు. వీరిలో 21,289 మంది చిన్నారులు ఉన్నట్లు పేర్కొన్నారు. మహిళలు, వృద్ధులు కూడా పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని, గాజాలోని నివాస ప్రాంతాలు, భవనాలు విస్తృతంగా ధ్వంసమయ్యాయి.

**అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన ఆరోపణ**

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ ఆగ్నెస్ కల్లమార్డ్ భారత ప్రభుత్వానికి లేఖ రాసి, ఇజ్రాయెల్‌కు ఆయుధాల ఎగుమతులను తక్షణమే నిలిపివేయాలని కోరినట్లు వీడియోలో తెలిపారు. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుపై చర్యలు తీసుకున్న నేపథ్యంలో కూడా ఆయుధాల సరఫరా కొనసాగడం జెనీవా ఒప్పందాలు, అంతర్జాతీయ మానవతా చట్టాల ఉల్లంఘనగా పరిగణించవచ్చని ఆమ్నెస్టీ అభిప్రాయపడింది. అలాగే గాజా బాధితులకు సంబంధిత సంస్థలు నష్టపరిహారం చెల్లించాలని కూడా డిమాండ్ చేసింది.

**భారత్–పాలస్తీనా సంబంధాలపై విశ్లేషణ**

స్వాతంత్ర్యం అనంతరం తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ కాలం నుంచే భారత్ పాలస్తీనాకు మద్దతు తెలిపిందని, పాలస్తీనాను దేశంగా గుర్తించి దౌత్య సంబంధాలు నెలకొల్పిందని వీడియోలో గుర్తు చేశారు. అయితే 2014 తర్వాత భారత్–ఇజ్రాయెల్ వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయనే అనుమానాలు కలుగుతున్నాయి.

# కువైట్‌లో అమెరికా స్థావరంపై డ్రోన్ దాడి?

ట్రంప్ హెచ్చరికల తర్వాత ఉద్రిక్తత




**టెహ్రాన్:** అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయి. కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరాన్ని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) డ్రోన్లతో లక్ష్యంగా చేసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. కనీసం పలు డ్రోన్లతో ఈ దాడి జరిగినట్లు సమాచారం. అదే సమయంలో ఇరాన్‌లోని బస్రా ప్రాంతంలో పేలుళ్ల శబ్దాలు వినిపించగా, కువైత్‌లో అగ్నిప్రమాదం సంభవించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. అయితే ఈ ఘటనలపై అధికారిక ధ్రువీకరణ వెలువడలేదు. మరోవైపు ఒమన్ సమీపంలో ప్రయాణిస్తున్న ఓ వాణిజ్య నౌకను గుర్తుతెలియని వస్తువు ఢీకొట్టినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (కెఎంటిఒ) వెల్లడించింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, ఆ ప్రాంతంలో ప్రయాణించే నౌకలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

**ఇదే చివరి అవకాశం: ట్రంప్**

ఈ పరిణామాలకు ఒక రోజు ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ ఒప్పందం చేసుకోవడానికి ఇదే చివరి అవకాశం ఉంటూ హెచ్చరించారు. సౌదీ అరేబియా, ఏఈ, ఖతార్‌తో పాటు ఇరాన్ కూడా దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని కోరడంతో ప్రణాళికలో ఉన్న సైనిక చర్యను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆయన తెలిపారు. ఇరాన్ అభ్యర్థన మేరకే చర్చలు జరుగుతున్నాయని, తొలి దశలో హార్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవడంపై చర్చిస్తున్నామని ట్రంప్ పేర్కొన్నారు. అనంతరం అణు నిరాయుధీకరణ అంశంపై చర్చలు కొనసాగుతాయని, ఇరాన్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలు ఉండనివ్వబోమని స్పష్టం చేశారు.

(మొదటి పేజీ తరువాయి)

నిరాహార దీక్షలు, ధర్నాలు, ఆందోళనలు నిర్వహించామని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేయడంతో ప్రభుత్వం స్పందించి జెన్‌కోను టెండర్ ప్రక్రియ నుంచి తప్పించిందని, దీంతో మణుగూరు బ్లాక్ సింగరేణికే దక్కిందని వెల్లడించారు.

**ప్రైవేటుకు ఇచ్చిన బ్లాకులు తిరిగి సింగరేణికే ఇవ్వాలి**

ప్రస్తుతం సింగరేణిని నష్టాలలో ఉందనే పేరుతో ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని కూనంనేని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ద్వారా సింగరేణికి రూ. 56 వేల కోట్లు బకాయిలు రావాల్సి ఉండగా, సంస్థను లాభాల్లోకి తీసుకురావడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. సింగరేణిలో సుమారు 40 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, శాశ్వత ఉద్యోగుల కంటే ఎక్కువ శ్రమిస్తున్నప్పటికీ కనీస వేతనాలు కూడా అందడం లేదని విమర్శించారు. వీరిని దశలవారీగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త గనుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. సత్తుపల్లి ఒసి, శ్రావణపల్లి, చెన్నూరు, కోయిగూడెం, గుండాల, పెనుబల్లి తదితర ప్రాంతాల్లో కొత్త గనులను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రైవేటుకు ఇచ్చిన కొన్ని బ్లాకులను తిరిగి ప్రభుత్వ రంగంలోకి తీసుకురావాలని కోరారు. సింగరేణి కార్మికుల సమ్మెకు సంబంధించి ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని, కార్మికుల డిమాండ్లు ప్రభుత్వంపై పెద్ద భారం కాదని చెప్పారు. ప్రతిష్ఠకు పోకుండా చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని, లేకపోతే సమ్మె అనివార్యమవుతుందని హెచ్చరించారు.

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలి**

సింగరేణి సంస్థ తెలంగాణ రాష్ట్రానికి ప్రధాన ఆర్థిక వనరు అని, కోల్ ఇండియాతో సరిసమానమైన ఈ సంస్థను కాపాడేందుకు కేంద్ర

# మణుగూరు గని

గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కూనంనేని కోరారు. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తుంటాయి పోతుంటాయని, కాని సింగరేణి శాశ్వత సంస్థ అని దీనిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎంఎండిఆర్ (మైనింగ్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్) చట్టం కారణంగా బొగ్గు బ్లాకులు వేలానికి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని, ఇది సింగరేణికి మరణ శాసనంగా మారిందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకుని సింగరేణి బొగ్గు బ్లాకులు వేలం ప్రక్రియకు దూరంగా ఉండేలా కేంద్రాన్ని ఒప్పించి ప్రత్యేక ఒప్పందం సాధించాలని విజప్తి చేశారు.

**ఆర్‌టిసి విలీనం హామీ అమలు చేయాలి**

ప్రభుత్వం హామీ ప్రకారం టిజిఆర్‌టిసిలో గుర్తింపు ఎన్నికలను తక్షణమే నిర్వహించడంతో పాటు వెనువెంటనే విలీనం ప్రక్రియ పూర్తి చేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ నిలబెట్టకపోతే మళ్లీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితులపై చిన్నారెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫార్సులను ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలని కోరారు. తద్వారా డ్రిప్ ఇరిగేషన్, ప్రత్యామ్నాయ పంటలు, చిన్న రైతులకు ప్రత్యేక సహాయం అందించాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం ఇంకా తొలగలేదని, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై నిపుణుల కమిటీ నివేదిక తెచ్చి, వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కోరారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయడం వలన ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని వారన్నారు. ప్రభుత్వం కొత్త ప్రాజెక్టుల జోలికి వెళ్లకుండా ఇప్పటికే ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టు పూర్తి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి**

విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు, రిటైర్డ్ ఉద్యోగుల బాకాయిలను ప్రభుత్వ తక్షణమే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 2 కోట్లకు పైగా వ్యవసాయ కూలీలతో కలిసి అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులు ఉన్నారని, మినిమం వేజ్ కొంతమందికే వచ్చిందని, ఇంకా పంచాయతీలు, మున్సిపాలిటీలో పనిచేస్తున్న వారికి రావాల్సి ఉందని వారన్నారు. వీరందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈనెలలో నిర్వహించనున్న వర్ష కాలం అసెంబ్లీ సమావేశాలలో ప్రజా సమస్యలను చర్చించేందుకు తగిన సమయం కేటాయించాలని కోరారు. ఇందుకు అసెంబ్లీ సమావేశాలను కనీసం 10 రోజుల పాటు నిర్వహించి సమగ్ర చర్చలు జరిగేలా ప్రభుత్వం చూడాలన్నారు. హైడ్రా వ్యవస్థ మంచిదే కానీ అత్యుత్సాహానికి పోకుండా జాగ్రత్త పడాలని వారన్నారు.

**జెన్–జీ ఉద్యమం గొప్ప మార్పుకు సంకేతం**

బిహర్‌లోని బంకీపూర్ నియోజకవర్గంలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం పట్ల కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జెన్‌జీ విద్యార్థులు చేసిన పోరాటం దేశంలో గొప్ప మార్పుకు సంకేతంగా నిలిచిందని అన్నారు. ఈ నిరసనల తీవ్రతను గ్రహించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనక్కి తగ్గారని అన్నారు. పాలకులు సైతం విద్యార్థుల శక్తి ముందు తల దించాల్సిందేనని ఈ పోరాటం నిరూపించిందన్నారు. హిందుత్వ ఎజెండానే నమ్ముకుని ముందుకు వెళ్లుతున్న బిజెపి చివరికి దేవుళ్లనే మోసం చేసిందని చెప్పారు. చివరికి రామాలయం, బద్రీనాథ్ లాంటి పుణ్యక్షేత్రాల్లో అక్రమాలు, దొంగతనాలు పాల్పడ్డారన్నారు. ప్రజల భక్తికి, రాజకీయ నాయకుల స్వార్థానికి తేడా ప్రజలకు అర్థమైపోయిందని తెలిపారు.

## ఆర్టికల్ 370 రద్దుకు ఏడేళ్లు ...
# జమ్ముకశ్మీర్ వ్యాప్తంగా పిడిపి నిరసనలు



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు ఏడేండ్ల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 5న జమ్ముకశ్మీర్ వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తి మంగళవారం సీనియర్ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, మహిళా, యువజన విభాగాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలని, రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టే ఈ జిల్లా స్థాయి ఆందోళనల్లో పార్టీ శ్రేణులన్నీ క్రియాశీలకంగా పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ ప్రకటనలో స్పష్టం చేశారు. కాగా, జమ్ముకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని అందించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం 2019లో రద్దు చేసిన విషయం విదితమే.

# ప్రవేశాలకు నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. నీట్ యుజి2026లో క్వాలిఫై అయిన విద్యార్థులు ఆగస్టు 5 ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 12 సాయంత్రం 6 గంటల వరకు https://tsmedadm.tsche.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. సీట్ల మ్యాట్రిక్స్‌ను వెబ్ ఆప్షన్లకు ముందు ప్రత్యేకంగా ప్రకటిస్తామని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే ముందు ప్రాస్పెక్టస్‌ను పూర్తిగా చదివి, అర్హతలు, రిజర్వేషన్లు, అవసరమైన ధ్రువ పత్రాలను, నిబంధనలను పరిశీలించి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. పూర్తి వివరాలు, సమాచారం కోసం www.knruhs.telangana.gov.in వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపింది. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు అన్ని సర్టిఫికెట్లను తప్పకుండా అప్‌లోడ్ చేయాలని, నమోదు ప్రక్రియ ఒక్కసారి మాత్రమే ఉంటుందని, ప్రతి రౌండ్ కౌన్సెలింగ్‌కు మళ్లీ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని, ఆ సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితాను విడుదలచేస్తామని యూనివర్సిటీ వెల్లడించింది. వెబ్ ఆప్షన్లు, కౌన్సెలింగ్ షెడ్యూల్, సీట్ల మ్యాట్రిక్స్‌ను కెఎన్ఆర్‌యుహెచ్ఎస్ వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.

# అవసరం లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్ఎస్ఎస్ వెనుక ఒక ప్రమాదకరమైన ఆలోచన ఉందని, 'ఈ దేశం అనేక వర్గాల సమ్మేళనం లేదా వ్యక్తీకరణ కాదు' అనే భావన అని ఆరోపించారు. భారతదేశం (అంటే భారత్) అనేది రాష్ట్రాల సమాహారం అని, ఆ రాష్ట్రం అనేది భారత ప్రజల వ్యక్తీకరణ అని రాజ్యాంగంలో స్పష్టంగా రాసి ఉందని ఆయన గుర్తుచేశారు. 'తమిళనాడు అన్నప్పుడు, అందులో తమిళ ప్రజల చరిత్ర, వారి వేదన, బాధ, సంతోషం అన్నీ ఇమిడి ఉంటాయి. ప్రతి రాష్ట్రం ఒక చరిత్రకు, సంప్రదాయానికి, భాషకు ప్రాతినిధ్యం వహిస్తుందని రాజ్యాంగం చెబుతోంది. ప్రతి రాష్ట్రానికి ఆ హక్కు ఉంది, వాటిని సమానంగా చూడాలి. ప్రతి రాష్ట్రానికి తమను తాము, తమ సంస్కృతిని, భాషను వ్యక్తపరిచే హక్కు ఉంది. ఇక్కడ కొందరు అజ్ఞానులు ఉన్నారు; వారికి తమిళ, మరాఠీ, బెంగాలీ ప్రజల గురించి అవగాహన లేదు. ఈ చరిత్రలు లేదా భావనలేవీ ముఖ్యమైనవి కావని వారు అంటారు. ఆర్ఎస్ఎస్ నిర్దేశించిన చరిత్ర మాత్రమే ముఖ్యమని వారు భావిస్తారు. అందుకే ఈ పోరాటం చాలా ముఖ్యం. అందుకే విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు. భారత దేశ చరిత్రను ఎవరైనా కాలరాయడాన్ని సహించదు' అని పుస్తకావిష్కరణ కార్యక్రమంలో గాంధీ అన్నారు. దేశానికి వైకో చేసిన సేవకు కాంగ్రెస్ నాయకుడు ధన్యవాదాలు తెలిపారు. ఆయన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరవడం గౌరవంగా ఉందని అన్నారు. ఆయన మనందరికీ స్ఫూర్తి అని ఆయన అన్నారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరైన వారిలో తమిళనాడు విద్యాశాఖ మంత్రి ఎ. రాజ్‌మోహన్, టిఎంసి నాయకులు సాగరిక ఘోష్, కాంగ్రెస్ నాయకులు పి. చిదంబరం, మణికం ఠాగూర్, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, , శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్, ఆర్‌జెడి నాయకుడు మనోజ్ కుమార్ ఝా, ఆర్ఎస్‌పికి చెందిన ఎన్.కె. ప్రేమ్‌చంద్రన్, ఎన్‌సిపి(ఎస్‌పి) నాయకురాలు సుప్రియా సూలే తదితరులు ఉన్నారు.

# లెక్క చెప్పాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డి.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 'రైతు చెమటతో పండిన ప్రతి గింజను ప్రభుత్వం ప్రజల సొమ్ముతో కొనుగోలు చేస్తోందని, ప్రతి గింజకు ప్రభుత్వం కాపలాదారు అని ప్రజల ఆస్తిని కాపాడటంలో, ప్రభుత్వ బకాయిలను పూర్తిగా రాబట్టటంలో, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయటంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. అందుకే సిఎంఆర్ వ్యవస్థపై గత 10 నుంచి 12 ఏళ్ల కార్యకలాపాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సిఎంఆర్ అమలు వ్యవస్థలను క్షుణ్ణంగా సమీక్షించి భవిష్యత్తులో ఇలాంటి లోపాలకు తావు లేకుండా సమగ్ర సంస్కరణలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన లక్ష్యం శిక్షలు విధించడం మాత్రమే కాదని, ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ప్రభుత్వ ధాన్యాన్ని, ప్రభుత్వానికి రావలసిన ప్రతి రూపాయిని పూర్తిగా తిరిగి రాబట్టడమేనని స్పష్టం చేశారు. అదేవిధంగా భవిష్యత్తులో ఒక్క గింజ కూడా దారి మళ్లకుండా సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలను ప్రవేశపెట్టాలని నిర్ణయించామని తెలిపారు .ఇందులో భాగంగా క్యూఆర్ కోడ్‌తో గన్నీ సంచులు,జిపిఎస్ ఆధారిత వాహన ట్రాకింగ్, జియో ట్యాగ్ తనిఖీలు, రియల్ టైమ్ స్టాక్ రీకన్సిలియేషన్, ప్రొక్యూర్‌మెంట్–మిల్లింగ్–ఎఫ్‌సిఐ డేటాబేస్‌ల అనుసంధానం, ఎర్లీ వార్నింగ్ వ్యవస్థ, రిస్క్ ఆధారిత మిల్లుల ఆడిట్లు వంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఒప్పంద నిబంధనలను మరింత కఠినతరం చేయడం, బ్యాంకు గ్యారంటీలను బలోపేతం చేయడం, డిఫాల్ట్‌లపై కఠిన శిక్షలు, అమలు వ్యవస్థను మరింత సమర్థవంతంగా రూపొందించడం వంటి అంశాలను కొత్త విధానంలో చేర్చనున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# మసాలాలు సీజ్

(మొదటి పేజీ తరువాయి)

తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ సోదాల్లో 25 టన్నులకు పైగా కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని చెప్పారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో ఇప్పటివరకు మూడు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనిఖీల్లో వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు వంటి నిత్యం వాడే మసాలా దినుసుల్లో తీవ్రస్థాయిలో కల్తీ జరుగుతున్నట్లు గుర్తించామని సజ్జనార్ తెలిపారు. ఆకర్షణీయమైన మెరుపు, రంగు కోసం ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్‌ను వినియోగిస్తున్నారని వివరించారు. దాడుల సందర్భంగా సుమారు 89 టన్నుల ముడి పదార్థాలను సీజ్ చేసి, నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించామని తెలిపారు. కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి రసాయనాలతో కూడిన కల్తీ మసాలాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్, కాలేయం, మూత్రపిండాల వ్యాధులు, తీవ్రమైన అలర్జీలు, జీర్ణక్రియ సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు.హెచ్‌ఫాస్ట్ బృందం ఏర్పడిన 140 రోజుల్లోనే 659 ప్రాంతాల్లో సోదాలు చేసి, 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, మొత్తం 246 టన్నుల కల్తీ ఆహారాన్ని సీజ్ చేశామని వెల్లడించారు. నగరంలో కల్తీ ఆహారంపై ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# కెఎల్ రాహుల్‌ను అలా ఎన్నడూ చూడలేదు

వసీం జాఫర్



టీమిండియా క్రికెటర్ కెఎల్ రాహుల్ సాధారణంగా చాలా ప్రశాంతంగా, నిశ్శబ్దంగా ఉంటాడని.. కానీ ఐపిఎల్‌లో పంజాబ్ జట్టు ప్రదర్శన కారణంగా అతను తీవ్ర నిరాశకు గురయ్యాడని భారత మాజీ క్రికెటర్, పంజాబ్ కింగ్స్ మాజీ బ్యాటింగ్ కోచ్ వసీం జాఫర్ తెలిపారు. అలాగే తన కెరీర్లో ఒకే ఒక్కసారి కోపంగా ఉండటం చూశానని దూరదర్శన్లోని 'ది గ్రేట్ ఇండియన్ క్రికెట్ షో'లో మాట్లాడుతూ, ఆ ఫ్రాంచైజీతో తన కోచింగ్ అనుభవాలకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను జాఫర్ జాఫర్ వెల్లడించారు. కేఎల్ రాహుల్ 2018 నుండి 2021 వరకు పంజాబ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. బ్యాటింగ్‌లో రాణించినప్పటికి జట్టును విజయపథంలో నడిపించడంలో విఫలమయ్యాడు. అదే సమయంలో వసీం జాఫర్ ఆ జట్టుకు ప్రధాన కోచ్‌గా పనిచేశారు. ఈ క్రమంలో జాఫర్ నాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. పంజాబ్ చాలా సార్లు గెలిచే స్థితిలో ఉండి కూడా మ్యాచ్‌లు స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యామన్నారు, రాహుల్ సహజంగానే చాలా ప్రశాంతంగా ఉండే వ్యక్తి మితభాషి. ఎక్కువగా తన సన్నిహిత స్నేహితుల మధ్యే గుడుపుతారు. బయట ఎక్కువగా కనిపించరు. మైదానంలో లేదా బయట ఆయన సహనం కోల్పోవడం చాలా అరుదైన విషయమన్నారు. అయితే సులభంగా గెలవాల్సిన ఒక మ్యాచ్‌లో ఓడిపోయిన తర్వాత రాహుల్ నిజంగా కోపంగా ఉండటం నేను మొదటిసారి చూశాను. అతను అప్పుడు అభ్యంతరకరంగా ఏమీ మాట్లాడలేదు, కానీ మేము ఎంత పేలవంగా ఆడామన్న దానిపై అతను ఎంత తీవ్ర అసహనానికి గురయ్యాడో స్పష్టంగా కనిపించిందన్నాడు. కేఎల్ రాహుల్ కొంచెం కోపంగా ఉండటం నేను చూడటం అదే ఏకైక సందర్భం అదేనని జాఫర్ తెలిపారు.

# షమీ ఇంగ్లాండ్ టూర్‌కు దూరం కావడానికి అసలు కారణం ఇదే!

అజిత్ అగార్కర్ క్లారిటీ..



టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపిక కాకపోవడంపై నెలకొన్న సందిగ్ధతకు బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తెరదించారు. షమీని కావాలనే పక్కన పెట్టలేదని, పూర్తి ఫిట్నెస్ లేకపోవడమే అతడు జట్టులో చోటు దక్కించుకోలేకపోవడానికి ప్రధాన కారణమని స్పష్టం చేశారు. ఇంగ్లాండ్ పరిస్థితుల్లో అనుభవజ్ఞుడైన పేసర్గా షమీ సేవలు జట్టుకు ఎంతో కీలకమని అగార్కర్ పేర్కొన్నారు. అతడు పూర్తిస్థాయి ఫిట్నెస్తో అందుబాటులో ఉండి ఉంటే, ఎంపికలో మొదటి వరుసలో ఉండేవాడని వెల్లడించారు. అయితే ప్రస్తుతం టెస్టు క్రికెట్కు అవసరమైన శారీరక సామర్థ్యాన్ని ఇంకా పూర్తిగా అందుకోలేదని చెప్పారు. వన్డే ప్రపంచకప్ అనంతరం శస్త్రచికిత్స చేయించుకున్న షమీ బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్సీఏ)లో వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఫిట్నెస్ సాధించేందుకు కఠినంగా శ్రమిస్తున్నట్లు అగార్కర్ తెలిపారు. టెస్టు క్రికెట్లో ఐదు రోజుల పాటు నిరంతరాయంగా బౌలింగ్ చేయాల్సి ఉండటంతో, కేవలం సాధారణ ఫిట్నెస్ సరిపోదని, ఎక్కువ ఓవర్లు వేయగల సామర్థ్యాన్ని కూడా నిరూపించుకోవాల్సి ఉంటుందని ఆయన వివరించారు. ఇంగ్లాండ్ పిచ్లపై షమీ వంటి స్వింగ్ బౌలర్ ప్రత్యర్థులకు పెద్ద సవాల్గా మారుతాడు. అయినప్పటికి పూర్తిగా కోలుకోకముందే అతడిని మైదానంలోకి దించడం వల్ల గాయం మళ్లీ తిరగబడే ప్రమాదం ఉందని సెలెక్షన్ కమిటీ భావించినట్లు అగార్కర్ చెప్పారు. షమీ దీర్ఘకాల కెరీర్ను దృష్టిలో పెట్టుకుని వైద్య బృందం సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని, తొందరపడి రిస్క్ తీసుకోవాలని బీసీసీఐ భావించడం లేదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ క్రికెట్లోకి తిరిగి రావడానికి ముందు షమీ దేశవాళీ క్రికెట్లో ఆడాల్సి ఉంటుందని అగార్కర్ వెల్లడించారు. రంజీ ట్రోఫీ లేదా ఇతర దేశవాళీ టోర్నీల్లో బౌలింగ్ చేసి మ్యాచ్ ఫిట్నెస్ను నిరూపించుకోవాలని సూచించారు. మ్యాచ్ ప్రాక్టీస్తో పాటు పూర్తి స్థాయి శారీరక సామర్థ్యం సాధించిన తర్వాతే అతడిని మళ్లీ టీమిండియాలోకి ఎంపిక చేసే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. షమీ పూర్తిస్థాయిలో కోలుకుని మునుపటి లయను అందుకుంటే భారత జట్టుకు మళ్లీ కీలక బౌలర్గా మారే అవకాశాలు ఉన్నాయని అగార్కర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అతడి రీహాబిలిటేషన్ పురోగతిపై సెలెక్షన్ కమిటీ, బీసీసీఐ వైద్య బృందం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# నాలుగేళ్లకు జంటగా.. వైల్డ్ కార్డుతో ఎంట్రీ ఇవ్వనున్న విలియమ్స్ సిస్టర్స్

ఒకప్పుడు మహిళల టెన్నిస్ను ఏలిన 'విలియమ్స్ సిస్టర్స్' మళ్లీ జోడీ కడుతున్నారు. కోర్టులోకి దిగారంటే తిరుగులేని ఆధిపత్యంతో రికార్డులు బద్ధలుకొట్టే సెరీనా విలియమ్స్, వీనస్ విలియమ్స్లు నాలుగేళ్ల తర్వాత డబుల్స్లో జంటగా ఆడబోతున్నారు. త్వరలో జరుగనున్న సిన్సినాటి ఓపెన్లో ఈ అమెరికా నల్లకలువలు వైల్ కార్డ్ ఎంట్రీ ఇవ్వడం ఖాయమైంది. సింగిల్స్, డబుల్స్ ఏదైనా.. టైటిల్ మాదే అన్నట్టు చెలరేగి ఆడే విలియన్స్ సిస్టర్స్ మళ్లీ జంటగా అభిమానులను అలరించనున్నారు. నాలుగేళ్ల విరామం తర్వాత వీరిద్దరూ మహిళల డబుల్స్లో ప్రత్యర్థుల భరతం పట్టేందుకు వస్తున్నారు. వింబుల్డన్ గ్రాండ్స్లామ్లోనే ఇద్దరూ అక్కాచెల్లెల్లు కలిసి ఆడాలని భావించారు. కానీ, అవకాశం చేజారింది. ఇప్పుడు సిన్సినాటి ఓపెన్లో వీరికి వైల్ కార్డ్ ఎంట్రీ లభించింది. ఆగస్టు 8వ తేదీన ఈ మెగా ఈవెంట్ ప్రారంభం కానుంది. ఇదివరకూ 2022 యూఎస్ ఓపెన్లో చివరిసారిగా కలిసి ఆడారీ వెటరన్ సిస్టర్స్. గతంలో డబుల్స్ జోడీగా వీరు 14 టైటిళ్లు సాధించిన విషయం తెలిసిందే.



# మహిళ

## మహిళల స్వేచ్ఛకు సవాళ్లు

భారతదేశవ్యాప్తంగా నిర్వహించిన సమగ్ర జాతీయ సర్వేలో మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, సమ్మతి హక్కు, భద్రతకు సంబంధించిన అనేక కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. చట్టపరంగా 'సమ్మతి' అనే భావనకు గుర్తింపు ఉన్నప్పటికీ, దానిని ఆచరణలో గౌరవించే విషయంలో ఇంకా అనేక లోపాలు ఉన్నాయని ఈ సర్వే సూచించింది. ముఖ్యంగా వ్యక్తిగత సంబంధాలు, వివాహం, ఉద్యోగ ప్రదేశాలు, విద్యా సంస్థలు, ప్రజా ప్రదేశాల్లో మహిళల అభిప్రాయాలను, నిర్ణయాలను గౌరవించడంలో సమస్యలు కొనసాగుతున్నాయని గుర్తించారు. ఒక వ్యక్తి శరీరం, జీవితం, నిర్ణయాలపై అతనికి లేదా ఆమెకు పూర్తి హక్కు ఉంటుందనే అవగాహన సమాజంలోని అన్ని వర్గాల్లో ఇంకా బలపడాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రజా ప్రదేశాల్లో వేధింపులు, అసభ్య ప్రవర్తన,




అనుచిత వ్యాఖ్యలు వంటి సమస్యలు మహిళల రోజువారీ జీవితంలో పెద్ద సవాళ్లుగా కొనసాగుతున్నాయని సర్వే వెల్లడించింది. రోడ్లు, ప్రజా రవాణా, కార్యాలయాలు, ఆన్‌లైన్ వేదికలు వంటి అనేక ప్రాంతాల్లో మహిళలు భద్రతా ఆందోళనలను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులు వారి ప్రయాణ స్వేచ్ఛ, విద్య, ఉపాధి అవకాశాలు, సామాజిక భాగస్వామ్యంపై ప్రభావం చూపుతున్నాయి. మహిళల భద్రతకు సంబంధించి కేవలం చట్టాలు రూపొందించడం మాత్రమే సరిపోదని, వాటిని సమర్థంగా అమలు చేయడం, ఫిర్యాదు వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో లింగ సమానత్వంపై అవగాహన పెంచడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. మహిళల భద్రత అనేది కేవలం రక్షణ చట్టాలకు పరిమితమైతే లాభం లేదు. అది సమాజంలో గౌరవం, సమానత్వం, వ్యక్తిగత హక్కులను గుర్తించే సంస్కృతిని నిర్మించే ప్రక్రియగా మారినప్పుడే మహిళల జీవితాలు మెరుగుపడతాయి. సమ్మతిని గౌరవించడం, వేధింపులను అడ్డుకోవడం, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా మాత్రమే మహిళలు పూర్తిస్థాయిలో సామాజిక, ఆర్థిక రంగాల్లో పాల్గొనగలుగుతారు.

# చట్టపరమైన హక్కుల్లో అసమానతలు



ప్రపంచం ఆధునికత, సాంకేతిక అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతున్నప్పటికీ, మహిళలకు సమానమైన చట్టపరమైన హక్కులు కల్పించే విషయంలో ఇంకా అనేక దేశాలు వెనుకబడి ఉన్నాయని ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచంలోని ఏ దేశం కూడా మహిళలకు పురుషులతో సమానమైన సంపూర్ణ చట్టపరమైన హక్కులను పూర్తిగా అందించలేదని ఈ నివేదిక పేర్కొంది. మహిళలు సగటున పురుషులకు లభించే చట్టపరమైన హక్కుల్లో కేవలం 64 శాతం మేరకే ప్రయోజనం పొందుతున్నారని అంచనా వేసింది. ముఖ్యంగా ఆస్తి హక్కులు, ఉద్యోగ అవకాశాలు, సమాన వేతనం, వ్యాపారం ప్రారంభించే స్వేచ్ఛ, భద్రత, వివాహం విడాకులు, కుటుంబ నిర్ణయాల్లో భాగస్వామ్యం వంటి రంగాల్లో ఇంకా అనేక పరిమితులు కొనసాగుతున్నాయి. అనేక చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలులో లోపాలు ఉండటం కూడా మహిళల సమానత్వానికి పెద్ద అడ్డంకిగా మారింది. కొన్ని దేశాల్లో మహిళలు ఆస్తులను స్వతంత్రంగా కలిగి ఉండటం, ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడం, కొన్ని వృత్తుల్లో ప్రవేశించడం వంటి అంశాల్లో ఇప్పటికీ వివక్షను ఎదుర్కొంటున్నారు. కుటుంబ చట్టాల్లోని అసమాన నిబంధనలు కూడా మహిళల స్వేచ్ఛను ప్రభావితం చేస్తున్నాయి. మహిళలపై హింస, వేధింపులు, వివక్ష వంటి సమస్యలను ఎదుర్కోవడానికి బలమైన చట్టాలు అవసరమైనప్పటికీ, వాటిని సమర్థంగా అమలు చేయడం మరింత ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించడం లింగ న్యాయానికి, దేశాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కీలకం. నిజమైన లింగ సమానత్వం సాధించాలంటే చట్టాల్లో మార్పులతో పాటు, సామాజిక దృక్పథంలో కూడా మార్పు రావాల్సిన అవసరం ఉందని ఈ నివేదిక సూచిస్తోంది.

# కెటమైన్‌తో మెరుగైన చికిత్స!



శస్త్రచికిత్సల సమయంలో సాధారణ మత్తు మందుగా వైద్యులు చాలాకాలంగా ఉపయోగిస్తున్న 'కెటమైన్', ఇప్పుడు మెదడు పనితీరుపై దాని ప్రభావాల కారణంగా శాస్త్రవేత్తల దృష్టి ని ఆకర్షిస్తోంది. తక్కువ మోతాదుల్లో దీనిని మహిళలకు నొప్పి నియంత్రణ మందుగా ఉపయోగిస్తున్నారు. ఇటీవల, సాధారణ మందులతో తగ్గని చికిత్సకు, తీవ్ర నిరాశలో ఉన్న రోగులకు ప్రత్యామ్నాయ చికిత్సగా కెటమైన్‌ను ఉపయోగిస్తున్నారు. తాజా పరిశోధనలు కెటమైన్ మెదడులోని 'న్యూరోప్లాస్టిసిటీ' అనే ప్రక్రియను పెంచగలదని సూచిస్తున్నాయి. న్యూరోప్లాస్టిసిటీ అంటే మెదడులోని నర కణాలు కొత్త అనుసంధానాలను ఏర్పరచుకోవడం, మార్పులకు అనుగుణంగా తమ పనితీరును మార్చుకోవడం. నేర్చుకోవడం, జ్ఞాపకశక్తి, భావోద్వేగ నియంత్రణ వంటి కీలక ప్రక్రియలకు ఇది ఎంతో అవసరం. ఈ ప్రక్రియలో 'మైక్రోగ్లియా' అనే ప్రత్యేక రకం మెదడు కణాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని పరిశోధకులు గుర్తించారు. సాధారణంగా మైక్రోగ్లియాను మెదడులో రక్షణ వ్యవస్థలో భాగంగా భావిస్తారు. ఇవి దెబ్బతిన్న కణాలను తొలగించడం, మెదడులోని వాపును నియంత్రించడం వంటి పనులు చేస్తాయి. అయితే కెటమైన్ ప్రభావంతో ఇవి నర కణాల మధ్య కొత్త సంబంధాల ఏర్పాటును ప్రోత్సహించే విధంగా పనిచేస్తున్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రత్యేకంగా మహిళల మెదడులో కెటమైన్ ప్రభావం ఎలా పనిచేస్తుందనే అంశాన్ని ఈ పరిశోధన పరిశీలించింది. పురుషులు, మహిళల మెదళ్లలో జీవరసాయన ప్రక్రియల్లో కొన్ని తేడాలు ఉండవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే కెటమైన్‌ను వైద్య పర్యవేక్షణ లేకుండా ఉపయోగించడం ప్రమాదకరం. భవిష్యత్తులో కెటమైన్ వంటి మందులను మరింత సురక్షితంగా, లక్ష్యితంగా ఉపయోగించే చికిత్సా విధానాల అభివృద్ధికి ఇది సహాయపడే అవకాశం ఉంది.

# కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై పోరు

సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారధి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా ఈనెల 6 నుండి14 వరకు సిపిఐ ప్రచార జాతను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి పిలుపునిచ్చారు. మంగళవారం కురవి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తురక రమేష్ అధ్యక్షతన జరిగిన డోర్నకల్ నియోజకవర్గ సమావేశంలో విజయ సారథి మాట్లాడుతూ కేంద్రలోని బిజెపి పాలనలో నిరుద్యోగం పెరిగిందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని, సామాన్యుడికి పెను భారమైందన్నారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 6 నుండి 14 వరకు జరిగే దేశవ్యాప్త ప్రచార జాతాలను జిల్లాలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, మరిపెడ, డోర్నకల్ మండల కార్యదర్శులు మారగాని బాలకృష్ణ, తురక రమేష్, బుర్ర సమ్మయ్య బుడమ వెంకన్న దొంతు రామ్మూర్తి కన్నే వెంకన్న,బొల్లం ఉప్పలయ్య, నిలుగొండ నాగేశ్వరరావు రవి సూరి నర్సయ్య పాల్గొన్నారు

# ధరల నియంత్రణ, రైతు, కార్మిక హక్కుల కోసం పోరాటం

సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి.ఫయాజ్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రజాసమస్యల పరిష్కారానికి జిల్లాలో ఆగస్టు 6 నుంచి 14 వరకు సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ తెలిపారు. కొల్లాపూర్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విధానాలతో నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక అసమానతలు పెరిగాయని విమర్శించారు. నిత్యావసర వస్తువులు, వంటగ్యాస్, విద్యుత్, విద్య, వైద్య ఖర్చులు సామాన్య ప్రజలకు భారంగా మారాయన్నారు. పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర అమలు చేయాలని, సార్వత్రిక విద్య, ఆరోగ్య సేవలను అందుబాటులోకి తేవాలని, మహిళా రిజర్వేషన్‌లు తక్షణమే అమలు చేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని, దళితులు, ఆదివాసీలపై దాడులను అరికట్టాలని, రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించి అర్హులందరికి ఇళ్లు ఇవ్వాలని కోరారు. పోడు రైతులకు భూ పట్టాలు అందించాలని డిమాండు చేశారు. కొల్లాపూర్, అచ్చంపేట ప్రాంతాల్లో ఖనిజ వనరుల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. సమావేశంలో సిపిఐ నాయకులు తుమ్మల శివుడు, జంగం శివుడు, నిరంజన్ నాయుడు, రమణ, చంద్రయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలను పక్కదారి పట్టిస్తున్న కేంద్రం



సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి మతాన్ని వాడుకుంటూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ విమర్శించారు. బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఈ నెల 6 నుండి 14 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు, సెప్టెంబర్ 1న చలో ఢిల్లీకి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం మంచిర్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాల్లో పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో నరేంద్రమోదీ దశాబ్ద కాల పాలనలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, భరించలేని ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్రంగా అల్లాడుతున్నారన్నారు. వైఫల్యాలను దాచడానికి మతపరమైన ద్వేషాన్ని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. వరుస పేపర్ లీకేజీలు, నియామకాల్లో జాప్యంతో యువత భవిష్యత్తు నాశనమవుతోందని, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా నిరుద్యోగులు, విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కలిందర్ ఆలీ ఖాన్, లింగం రవి, నాయకులు మిట్టపల్లి పౌలు, వనం సత్యనారాయణ, దేవి పోచన్న, కాదండి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో ప్రజాసంఘాలు కీలకపాత్ర వహించాలి

సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రజాసంఘాలు కీలకపాత్ర వహించాలని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రజాసంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం జరగగా సుధాకర్ పాల్గొని మాట్లాడారు. ప్రజా, కార్మిక, విద్యార్థి, యువజన, మహిళ, రైతు. వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఐ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆగస్టు 6 నుంచి 14 వరకు జిల్లాలో జరిగే పాదయాత్రలో పార్టీ ప్రజాసంఘాల నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఓమయ్య, నాయకులు సుబోద్, రఘురాం, స్వరూపరాణి, ఫిరోజ్, ఇమ్రాన్, కర్క రమేష్, చక్రపాణి పాల్గొన్నారు.




# కార్మిక హక్కులు నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



ఎఐటియుసి వరంగల్ జిల్లా నాలుగవ మహాసభలో కార్మిక నేతలు

**ప్రజాపక్షం/నెక్కొండ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను నిర్వీర్యం చేస్తోందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సమరశీల ఉద్యమాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపునిచ్చారు. ఎఐటియుసి వరంగల్ జిల్లా నాలుగవ మహాసభ మంగళవారం నెక్కొండ వాసవి కళ్యాణ మండపంలో ఉత్సాహభరితంగా జరిగింది. అంతకుముందు పట్టణ వీధుల్లో భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించారు. మహాసభలో నరసింహ మాట్లాడుతూ దేశంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏర్పడిన తొలి కార్మిక సంఘం ఎఐటియుసియేనని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం నుండి నేటి వరకు కార్మిక వర్గాన్ని సంఘటిత చేస్తూ కనీస వేతనం, పారిశ్రామిక వివాదాల చట్టం, ఫ్యాక్టరీల చట్టం వంటి అనేక కార్మిక హక్కుల సాధనలో ఎఐటియుసి కీలకపాత్ర పోషించదన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను బలహీనపరిచేలా ఉన్నాయని విమర్శించారు. పనిగంటల పెంపు, శ్రమ దోపిడికి అవకాశమిచ్చే విధానాలు, పెట్రోల్, డిజిల్, వంటగ్యాస్ ధరల పెంపుతో సామాన్యులపై పెరుగుతున్న ఆర్థిక భారం ప్రజా వ్యతిరేక విధానాలకు నిదర్శనమని ఆరోపించారు. కార్మికుల ఐక్య పోరాటమే ప్రజా వ్యతిరేక విధానాలకు సమాధానమని నరసింహ స్పష్టం చేశారు. హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక లోకానికి ఆయన పిలుపునిచ్చారు. మహాసభలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.బాషామియా మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. తెలంగాణలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి ప్రాథమిక హక్కులు ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలను ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. మహాసభలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు మేకల రవి, పంజాల రమేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, గౌరవ అధ్యక్షుడు పనసా ప్రసాద్, డిప్యూటీ కార్యదర్శి మునీశ్వరుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్, ఎం.గోవర్ధన్, బద్రి, ఎండి యాకూబ్, జాన్‌పాల్, ఉప్పల రవి, దామర కృష్ణ, సైదాని, మేరీ, రమేష్, లావణ్య, శ్వేత, సంధ్యారాణి, ఒడ్డూరి సంపత్, శ్రీను, మంకాల కిషన్, వినయ్‌తో పాటు పలువురు కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతీ ఎకరాకూ సీతారామ జలాలు

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా డిమాండ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని ప్రతీ ఎకరానికి సాగు నీరు అందించి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని, ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా డిమాండ్ చేశారు. కొత్తగూడెం పట్టణ పరిధిలోని తాటిపెల్లి రెస్పిడెన్సీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 7 లక్షల 80వేల ఎకరాల ఆయకట్టు ఉండగా కేవలం 2 లక్షల 40వేల ఎకరాలకే నీరు అందే పరిస్థితి ఉందన్నారు. సుమారు 100 కి.మీ పైగా గ్రావిటీ కాల్వలు తవ్వి స్థానిక ప్రజలను నిర్వాసితులను చేసినప్పటికీ పూర్తి స్థాయిలో జిల్లా రైతాంగానికి సాగునీరు అందించకపోవడం దుర్మార్గమన్నారు. ఆయకట్టు పరిధిని పెంచి ఇల్లెందు పినపాక అశ్వారావుపేట కొత్తగూడెం, భద్రాచలం నియోజకవర్గాల్లోని చెరువులను నింపి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మిగిలిన 73వేల ఎకరాల పోడు భూములకు వెంటనే పట్టాలివ్వాలన్నారు. కెటిపిఎస్ సమీపంలో కొత్త ప్లాంట్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ఐదు గ్రామపంచాయితీలను తెలంగాణాలో కలపాలని, విద్యా వైద్య రంగాలను పేదలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాలతో పాటు పెట్రోల్ డీజిల్ ధరలను నియంత్రించాలని పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలన్నారు. కేంద్రం మార్చిన 44 కార్మిక చట్టాలను రద్దు చేయాలని విద్యా ఉపాధి హక్కులను రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులుగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల సాధనకు సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుండి 12 వరకు ప్రజాచైతన్య యాత్రలు అందులో భాగంగా జాతీయ జిల్లా స్థాయి సమస్యలపై భద్రాద్రి జిల్లాలోని పినపాక నియోజకవర్గ పరిధిలో గల ఏడూళ్ల బయ్యారం నుండి అశ్వారావుపేట వరకు అన్ని మండలాలలు గ్రామాలను కలుపుతూ యాత్రలు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో సిపిఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, మేయర్ మూడ్ గణేష్, చంద్రగిరి శ్రీనివాసరావు, వి పూర్ణ చంద్రరావు, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, భూక్యా ధస్రు, గనగళ్ల వీరస్వామి, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కే ఫహీమ్, తదితరులు పాల్గొన్నారు.



# ఆగని ఆకస్మిక తనిఖీలు..

# హడలెత్తుతున్న రైస్ మిల్లర్లు

- శ్రీ శ్రీనివాససాయి శివాయ రైస్ ఇండస్ట్రీలో రూ.53.66 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి
- సూర్యాపేట జిల్లాలో మొత్తం రూ.277.07 కోట్ల విలువైన ధాన్యం మాయం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆకస్మిక తనిఖీలతో రైస్ మిల్లర్లు హడలెత్తుతున్నారు. మంగళవారం జిల్లాలోని మేళ్ల చెర్వు మండలంలోని శ్రీ శ్రీనివాససాయి శివాయ రైస్ ఇండస్ట్రీస్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం, నల్లగొండ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో రూ.53.66 కోట్ల విలువైన ప్రభుత్వం మిల్లింగ్ కోసం అప్పగించిన ధాన్యాన్ని (సిఎంఆర్) మిల్లు యజమాని పక్క దారి పట్టించినట్లుగా గుర్తించారు. దీనితో గత 15 రోజులుగా జరుగుతున్న ఆకస్మిక తనిఖీల్లో 9 రైస్ మిల్లుల్లో రూ.277.07 కోట్ల విలువైన వరి ధాన్యం మాయమైనట్లు అధికారుల వెల్లడించిన లెక్కలతో స్పష్టమవుతుంది.

రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కస్టమ్ రైస్ మిల్లింగ్ కోసం జిల్లాలోని రైస్ మిల్లర్లకు ప్రభుత్వం అప్పగించగా గడువు లోపు తిరిగి అప్పగించకుండా వారు భారీగా దానిని పక్కదోవ పట్టించారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మిల్లర్లు ఆ ధాన్యాన్ని అమ్మి సొమ్ము చేసుకొని ప్రభుత్వానికి మొండిచెయ్యి చూపుతున్నారు. 2022–23 సంబంధించిన ధాన్యాన్ని ప్రభుత్వం టెండర్ వేయగా మిల్లర్లు రూ.500 కోట్లు బాకీ పడి ఉన్నారు. ఇందులో ఒక్క పైసా కూడా చెల్లించకపోవడంతో సిఎం రేవంత్ రెడ్డి ఆ సొమ్మును రాబట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను రంగంలోకి దింపారు. ఇదిలా ఉంటే 2023–24, 2024–25, 2025–26 సంవత్సరాలలో వందల కోట్ల విలువైన ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించగా దానికి సంబంధించిన బియ్యాన్ని కూడా ప్రభుత్వానికి మిల్లర్లు అప్పగించలేదు. జిల్లాలో 2023 నుండి 2026 సంవత్సరాల సిఎంఆర్ బకాయి మిల్లర్లు ఎంత బాకీ పడి ఉన్నారన్నది జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు బయటికి వెల్లడించడం లేదు. ఇదేమని ప్రశ్నించిన సమాధానాన్ని దాటవేస్తూ గోప్యంగా ఉంచుతున్నారు. గత 15 రోజుల నుండి అధికారులు చేస్తున్న ఆకస్మిక తనిఖీల్లో వజ్ర రైస్ కార్పొరేషన్, వికాస్ రైస్ మార్ట్‌ల్లో మొత్తం 29,187.88 టన్నుల ధాన్యం పక్కదారి పట్టించినట్లు అధికారులు గుర్తించి దీని విలువ రూ.73 కోట్లు ఉంటుందని తేల్చారు.

ఇదిలా ఉంటే తిరుమలగిరి మండలంలోని అన్నారం గ్రామంలో ఉన్న ఎవిఎస్‌ఆర్ రైస్ మిల్లులో 19,701 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్ పక్కదారి పట్టించగా దాని విలువ రూ.46కోట్లు ఉన్నట్లుగా అధికారులు నిర్ధారించారు. చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలోని శివసుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లులో 2050 టన్నుల ధాన్యం నిల్వలేదని అధికారులు గుర్తించారు. దీని విలువ రూ.49.89 కోట్లు, సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శివసాయి రైస్ మిల్లులో 2900 మెట్రిక్ టన్నుల ధాన్యం తరుగు ఉన్నట్లు అధికారులు తేల్చి దీని విలువ రూ.13 కోట్లుగా నిర్ధారించారు. రవిక్రిష్ణ రైస్ మిల్లులో తనిఖీ చేయగా 12వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్ మాయం చేయడంతో దాని విలువ రూ.47.62 కోట్లు ఉన్నట్లుగా లెక్కకట్టారు. కాసరబాద సమీపంలోని శ్రీవేంకటేశ్వర రైస్ మిల్లులో 11,400 మెట్రిక్ టన్నుల ధాన్యం లేనట్లుగా గుర్తించి రూ.27.23 కోట్లుగా తేల్చారు. పెన్‌పహాడ్ మండల పరిధి లోని జెపి రైస్ మిల్లులో 4886.50 మెట్రిక్ టన్నుల ధాన్యం లేకపోవడంతో దాని విలువ రూ.11.67 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆకస్మిక తనిఖీలకు రెండు రోజులు విరామం ఇచ్చిన అధికారులు తాజాగా మంగళవారం తిరిగి జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. హుజూర్‌నగర్ నియోజక వర్గం మేళ్ళచెర్వు మండలంలోని శ్రీ శ్రీనివాస సాయి శివాయ రైస్ ఇండస్ట్రీలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో 2022–23 రబీ, 2024–25 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన ధాన్యం నిలువలను అధికారులు పరిశీలించారు. ఆన్‌లైన్ రికార్డులు, స్టాక్ వివరాలు, మిల్లుల్లో భౌతికంగా ఉన్న నిల్వల మధ్య గణనీయమైన వ్యత్యాసాన్ని అధికారులు గుర్తించారు. ప్రాథమిక పరిశీలనలో టెండర్ ప్యాడి మినహాయించి దాదాపు 19,843,493 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం అందుబాటులో లేనట్లుగా అధికారులు గుర్తించారు. అలాగే 2022–23 రబీ సీజన్‌లో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.5.66 కోట్ల విలువైన బకాయి చెల్లించనట్లుగా తేల్చారు. 2023–24 రబీ, 2024–25 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన ధాన్యం పక్కదారి పట్టినట్లుగా గుర్తించారు. దీని విలువ రూ.48కోట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. ఈ మొత్తం రూ.53.66 కోట్లు ఉంటుందని రీజినల్ విజిలెన్స్ అధికారి ప్రతాప్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గోస్‌ల అధికారికంగా వెల్లడించారు.

**సిఎంఆర్ బకాయిల్లో జిల్లానే టాప్**

సూర్యాపేట జిల్లాలో గత 15 రోజుల నుండి జరిగిన తనిఖీల్లో రూ.277.07 కోట్ల విలువైన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు పక్కదారి పట్టించినట్లు అధికారుల ఆకస్మిక తనిఖీల్లో తేలింది. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా సూర్యాపేట జిల్లాలోనే తొవ్వినా కొద్ది మిల్లర్ల అక్రమాలు బయటపడుతున్నాయి. సిఎంఆర్ బకాయిల్లో రాష్ట్రంలో సూర్యాపేట జిల్లానే ప్రథమ స్థానంలో ఉన్నట్లు అధికారులు గతంలోనే ప్రకటించారు. కేవలం 9 మిల్లుల్లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వం ధాన్యం పక్కదారి పట్టిందంటే అధికారులు కేటాయించిన మొత్తం 70 మిల్లుల్లో తనిఖీలు చేస్తే ఇంకెంతో బయటపడుతుందోనన్న చర్చ ప్రజల్లో పెద్ద ఎత్తున సాగుతుంది.



## దివంగత సిబ్బంది కుటుంబాలకు బాసటగా పోలీసు భద్రత స్కీమ్

- ఎస్‌పి కె.నరసింహ


**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పోలీసు భద్రత స్కీమ్ దివంగత సిబ్బంది కుటుంబాలకు బాసటగా నిలుస్తుందని జిల్లా ఎస్‌పి కె.నరసింహ అన్నారు. పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల అకాలంగా మృతి చెందిన యాదగిరి కుటుంబానికి ఆయన మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు భద్రత స్కీం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో పనిచేస్తూ అకాలంగా ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలకు పోలీసు శాఖ అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. యాదగిరి కుటుంబ సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిఎస్‌పి రవి, జిల్లా పోలీస్ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజుభార్గవి, పోలీసు సంఘం అధ్యక్షులు ఎస్‌ఐ రామచందర్ గౌడ్ పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అక్షాంశ్ యాదవ్ (ఎస్పీ) సంస్థాన్ నారాయణపురం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, కేసుల నిర్వహణ, సీసీ కెమెరా పనితీరు, విజిటర్ రిజిస్టర్ సిబ్బంది హాజరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగంతో చేయాలని, ప్రజలనుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే స్వీకరించి చట్టబద్ధంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. ఈ తనిఖీలో రూరల్ సీఐ సతీశ్ రెడ్డి, ఎస్ఐ పాండు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా పనులు పూర్తి



- ఎన్‌హెచ్ఎఐ చీఫ్ జనరల్ మేనేజర్ (టెక్నికల్), రీజినల్ ఆఫీసర్‌ను కలిసిన ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి నియోజకవర్గ పరిధిలోని ఎన్‌హెచ్ 163 జాతీయ రహదారిపై రోడ్డు భద్రతా పనులను త్వరితగతిన చేపట్టాలని భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎన్‌హెచ్ఎఐ చీఫ్ జనరల్ మేనేజర్ (టెక్నికల్) & రీజినల్ ఆఫీసర్ శివశంకర్‌ని వారి కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సింగన్నగూడెం క్రాస్ రోడ్, రామకృష్ణాపురం గ్రామ క్రాస్ రోడ్, అనంతారం గ్రామ క్రాస్ రోడ్ వద్ద అండర్పాస్లు, సర్వీస్‌రోడ్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రాంతాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని, ప్రతిపాదిత పనులకు అవసరమైన అనుమతులు మంజూరు చేసి, ప్రాధాన్యత ప్రాతిపదికన త్వరితగతిన పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కోరారు.

## గుడి తాళాలు పగులగొట్టి చోరీకి యత్నం

**ప్రజాపక్షం/నందికొండ:** హిల్‌కాలనీలోని ముత్యాలమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.పోలీసుల వివరాల ప్రకారం ఈనెల 3,4 తేదీల మధ్య అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు ఆలయ ప్రధాన ద్వారం తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం ఆలయంలోని హుండీలో చోరీకి యత్నించినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై ఆలయ కమిటీ అధ్యక్షురాలు మంజుల జనార్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.సంఘటన స్థలాన్ని నల్గొండ క్లూస్ టీమ్ పరిశీలించి వేలిముద్రలు,ఇతర ఆధారాల కోసం గాలించినప్పటికీ ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## సోషల్ మీడియాలో పరిచయం

- మతపెద్దల సమక్షంలో పెళ్లి ... రెండునెలల కాపురం
- రూ.7.50 లక్షల నగదుతో పరారైన పెళ్లికొడుకు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** సోషల్ మీడియా ఆన్‌లైన్‌లో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన దివ్యాంగురాలైన అడ్వకేట్ షేక్ మౌలాబీకి గుంటూరుకు చెందిన కరీముల్లా కు పరిచయం ఏర్పడింది. మంగళవారం బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం సోషల్ మీడియాలో పరిచయమైన తర్వాత కరిముల్లా తనను పెళ్లి చేసుకోవడానికి ముందుకు రాగా తాను మత పెద్దలతో మాట్లాడి పెళ్లి చేసుకోవాల్సిందిగా కోరింది. తనకు పెళ్లి కాలేదని నమ్మించిన కరీముల్లా మత పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకుని రెండు నెలలు కాపురం చేసినట్లు బాధితురాలు తెలిపింది. ఒకరోజు తన ఇంట్లోని రూ.7.50లక్షల నగదు, ఫర్నిచర్‌తో పారిపోయాడని ఈ విషయమై హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేయించగా పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపింది. కరీముల్లాకు గతంలోనే పెళ్లి జరిగి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలుసుకున్న బాధితురాలు నిందితుడిని స్వయంగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వచ్చి పోలీసులకు అప్పగించింది. మరుసటి రోజు కరీముల్లా పోలీస్‌స్టేషన్‌లో కనిపించక పోవడంతో పోలీసులను బాధితురాలు ప్రశ్నించింది. తాను మోసపోయిన విధానాన్ని బార్ అసోసియేషన్ నాయకులకు తెలపగా బాధితురాలుతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ కస్టడీలో ఉన్న నిందితుడు కరీముల్లా ఎలా వెళ్లిపోయాడని న్యాయవాదులు హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు, ఎస్ఐ నరేష్‌లను ప్రశ్నించారు. పోలీసులకు అడ్వకేట్‌లకు కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. బాధితురాలుకి న్యాయం చేయాలని బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.

## మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం



- డ్రగ్స్‌కు బానిసలై యువత కెరీర్ నాశనం
- నల్గొండ కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం నల్గొండలోని ఎన్‌జి ప్రభుత్వ కళాశాలలో సంక్షేమ, పోలీస్, ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సిసి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 10 కోట్ల మాదక ద్రవ్య రహిత ప్రతిజ్ఞ మెగా ప్రచార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువత సోషల్ మీడియా, డిజిటల్, డ్రగ్స్, మద్యం, సిగరెట్ వంటి వ్యసనాలకు బానిసలు కావడం వల్ల వాటి వినియోగం పెరిగిందన్నారు. ఒకప్పుడు డబ్బున్న వారికి మాత్రమే అందుబాటులో ఉండే డ్రగ్స్ ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువతరం అనేక కారణాల వల్ల మాదక ద్రవ్యాల బారిన పడి కెరీర్ నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఒక్కసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే వ్యక్తిగతంగా, కుటుంబం, సమాజం ప్రభావితమవుతాయని, ఒక దశలో ఏకాకితనం ఆవహిస్తుందన్నారు. గత మేలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించామని గుర్తు చేశారు.అదనపు ఎస్‌పి రమేష్ విద్యార్థులచే మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫసర్ సముద్రాల ఉపేందర్, బ్రహ్మకుమారి రాజయోగి ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ నగేష్, జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ ఆర్.మదన్ మోహన్, శ్రీధర్, ప్రజాపిత బ్రహ్మకుమారీస్ కుమారి మోనిక, ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ సిహెచ్ సుధాకర్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్లు, వెంకట్ రెడ్డి, అనిల్ కుమార్, తదితరులు ఉన్నారు.

## నిరుద్యోగం, ధరల పెరుగుదల సమస్యలు తీవ్రతరం

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/మునుగోడు:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఐ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు ఈ నెల 6 నుంచి 14 వరకు నిర్వహించే జీపు జాతను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన పార్టీ మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల తీవ్ర సమస్యలుగా మారాయని, విద్యార్థులు పేపర్ లీకేజీల వంటి అంశాలపై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తే ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం వారిపై లాఠీచార్జీలు చేయడం, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఈదులకంటి కైలాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిర్పారి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, బొమ్మరబోయిన లాలయ్య, మహిళా సమాఖ్య కార్యదర్శి మాధగోని సత్యమ్మ, మండల కార్యవర్గ సభ్యులు ఉప్పునూతల రమేష్, చల్మెడ సర్పంచ్ బండమీది యాదయ్య, గోస్కొండ లింగయ్య, ఉదయ్ కుమార్, ఆనగంటి నరసింహ, భీమనపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత భవిష్యత్తు తాకట్టు పెట్టిన మోదీ విధానాలు




- ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** యువత భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం తాకట్టు పెడుతుందని, దేశం తిరోగమన దిశగా కేంద్ర ప్రభుత్వం నడుస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం యువత ఉద్యమించాలని జిల్లా ఎఐవైఎఫ్ నిర్మాణ మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, విద్య, వైద్య రంగాల నిర్లక్ష్యం, ప్రజాస్వామ్య హక్కులపై పెరుగుతున్న ఆంక్షలు యువత భవిష్యత్తును తీవ్ర అనిశ్చితిలోకి నెట్టాయని, దేశాన్ని తిరోగమన దిశగా నెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరకంగా దేశ యువత, విద్యార్థులు సంఘటితంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా నిర్మాణ మహాసభ ఆత్మకూర్ మండలం ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎఐవైఎఫ్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ అధ్యక్షతన జరిగింది. మహాసభల సూచికంగా యువజన సంఘ జెండాను ధర్మేంద్ర ఎగురవేసి మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలను తగ్గించడం, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్‌ను ప్రోత్సహించడం, విద్యను సామాన్యులకు దూరం చేయడం ద్వారా దేశాన్ని సామాజిక, ఆర్థికంగా తిరోగమన దిశగా నడిపిస్తోందని విమర్శించారు. తెలంగాణలోనూ ఖాళీ పోస్టుల భర్తీలో జాప్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ సమస్యలు, యువతకు ఉపాధి అవకాశాల కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఈ నిర్మాణ మహాసభలో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ఏఐవైఎఫ్ యాదాద్రి జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ ఎండీ.నయీమ్, సుద్దాల సాయి, మొగుళ్ళ శేఖర్ రెడ్డి, బెల్లి శ్రీకాంత్, బద్దుల శ్రీనివాస్, సిపిఐ యాదాద్రి జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, కళ్లెం కృష్ణ, సీపీఐ ఆత్మకూర్ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కా దయాకర్ రెడ్డి,మహిళా సమాఖ్య జిల్లా గౌరవధ్యక్షురాలు గుర్రం రాజమణి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నర్సింహాలతో పాటు వివిధ మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## హరిత వడాయిగూడెమే లక్ష్యం..


- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**ప్రజాపక్షం/భువనగిరి :** భావితరాల భవిష్యత్తుకే వనమహోత్సవం అని అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్ రావు అన్నారు. భువనగిరి మండలం వడాయిగూడెం గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, హరిత వాతావరణమే ధ్యేయంగా గ్రామ సర్పంచ్ నీల శిరీష ఓంప్రకాశ్ గౌడ్ ఆధ్వర్యంలో 'వనమహోత్సవం' కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అలాగే మహిళా సంఘాల భవనం శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్ రావు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్య నివారణకు, పర్యావరణ సమతుల్యతకు ప్రతీ ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. వడాయిగూడెం గ్రామాన్ని మోడల్ గ్రీన్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు పంచాయతీ పాలకవర్గం చేస్తున్న కృషిని అభినందించారు. సర్పంచ్ మాట్లాడుతూ నాటిన ప్రతి ఒక్క మొక్కనూ సంరక్షించే బాధ్యతను గ్రామ పంచాయతీతో పాటు ప్రజలందరూ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.నాగిరెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.తుక్యా నాయక్, జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీనివాస్ రెడ్డి, డిఎల్ పిఓ బి.శ్రీకాంత్ రెడ్డి, ఎంపీడీఓ జి.విజయలక్ష్మి, ఎక్సైజ్ సీఐ వేణు కుమార్, ఎస్ఐ నరేష్, ఎంపీవో యం.దినకర్, ఏపీఎం మల్లేష్, ఉపసర్పంచ్ సుక్కల శంకర్, పంచాయతీ కార్యదర్శి కె.ఆమని, వార్డు సభ్యులు బబ్బూరి సభిత శంకర్, పబ్బాల ఉమరమేష్ సుక్కల దుర్గయ్య కోట దీప జహంగీర్, కోట సుధాకర్కోట సుధావాణి మల్లికార్జున్, బబ్బూరి భరత్, జీవవైవిధ్య యాజమాన్యకమిటీ సభ్యులు, మహిళా సంఘం అధ్యక్షులు, నోముల యాదమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

## సామాజిక బాధ్యతను పెంపొందించాలి

- గవర్నర్ శివప్రతాప్ శుక్ల



**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** ఉన్నత విద్యాలయాలు సామాజిక బాధ్యతను పెంపొందించాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పిలుపునిచ్చారు. మంగళవారం ఎంజీలో నిర్వహించిన ఉప కులపతుల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని తెలంగాణ ఉన్నత విద్య స్థితిగతులు, రెడ్ రిబ్బన్ క్లబ్స్ వంటి యువజన సంఘాల ద్వారా సేవ సామాజిక కార్యక్రమాల పురోగతిని అడిగి తెలుసుకుని మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు సమ్మిళిత సమాజానికై బాధ్యతాయుతమైన పాత్రను పోషించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్ విశ్వవిద్యాలయ పురోగతిని వివరించారు.

## ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** ఆల్ ఇండియా కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయుటకు రైతులందరూ తమ వంతు సహకారాన్ని అందించాలని ఆల్ ఇండియా కిసాన్ సభ కేంద్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. నవంబర్ 18, 19, 20, 21 తేదీలలో నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగబోయే అఖిలభారత రైతు మహాసభల విజయవంతం కోసం రైతాంగంతో పాటుగా కార్మిక వర్గం, అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్ గ్రామంలో మంగళవారం మహాసభల ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి రైతులకు కరపత్రాలు అందజేస్తూ ప్రత్యేక చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మాట్లాడారు. అయినప్పటికీ గిట్టుబాటు ధర అనేది ఇప్పటికీ నెరవేరని డిమాండ్‌గానే మిగిలిపోయిందని, కేంద్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే చట్టబద్ధమైన గిట్టుబాటు ధర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్, కందుకూరి రమేష్, నాగరాజు, షరాపరెడ్డి, సైదాచారి, సైదులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర మొబైల్ దొంగల ముఠా అరెస్ట్

- రూ.3.50 లక్షల విలువైన 21 ఫోన్లు, కారు స్వాధీనం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పలు ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజల అశ్రద్ధను ఆసరాగా చేసుకుని సెల్‌ఫోన్లు కాజేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను నకిరేకల్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3.50 లక్షల విలువైన 21 ఫోన్లతో పాటు, నేరానికి ఉపయోగించిన మారుతి సుజుకి రిట్జ్ కారును స్వాధీనం చేసుకున్నారు. నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ హరిబాబు ఈ కేసు పూర్తి వివరాలను వెల్లడించారు. నకిరేకల్ మండలం మాదారం గ్రామానికి చెందిన గర్రె లక్ష్మయ్య సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు జూలై 17న స్థానిక పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తుతో ఈ ముఠా గుట్టురట్టయింది. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి శివరాం రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నకిరేకల్ పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహం సెంటర్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో హైదరాబాద్ నుంచి మారుతి సుజుకి రిట్జ్ కారు (ఎపి 28 బికె4798)లో వచ్చి, నకిరేకల్‌లోని బస్టాండ్లు, మార్కెట్లు, జాతరలు వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. అరెస్టయిన వారిలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం రాంపల్లికి చెందిన బేతంపల్లి ప్రభు అలియాస్ ప్రసాద్ (35), సిద్దిపేట జిల్లా రంగదంపల్లికి చెందిన ఆవుల విజయ్ అలియాస్ విజ్జు (31), ఏపీలోని నంద్యాల జిల్లా దోన్‌కు చెందిన ఎరుకల శివశంకర్ అలియాస్ శంకర్ (20) ఉన్నారని ఆయన తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్ విధించారని తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఫోన్ల అసలు యజమానులను గుర్తించి చట్టపరమైన ప్రక్రియ అనంతరం వారికి అప్పగిస్తామని పోలీసులు వెల్లడించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ హరిబాబు, ఎస్ఐలు పి.వీరబాబు, జి.కృష్ణచారి, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారని ఆయన తెలిపారు.



## బిఎస్‌సి ఎంఎల్‌టి విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాపక్షం/జనగామ: జనగామ పట్టణంలోని లక్ష్మి బాయికుంట, గిర్నిగడ్డకు చెందిన మేడే పూజ (19) అనే యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని జనగామ సిఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా సురభి కళాశాలలో బిఎస్‌సి ఎంఎల్‌టి చదువుతున్న మేడే పూజ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతుందన్నారు. వారం రోజుల క్రితం కళాశాల నుండి ఇంటికి రాగా సోమవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో బయటకు వెళ్లిందన్నారు. ఇంటి పక్కనే ఉన్న పాత ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా మంగళవారం గుర్తించడం జరిగిందన్నారు. తనకు చావుకు ఎవరు కారణం కాదని సుసైడ్ నోట్‌లో తెలిపిందన్నారు. ఎస్‌ఐ నర్సయ్య శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం హాస్పటల్‌కు తరలించారని, కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## రామప్పలో అభివృద్ధి పనులను పరిశీలించిన సీతక్క



ప్రజాపక్షం/వెంకటాపూర్: మండలం పాలంపేటలోని రామప్ప దేవాలయం వద్ద ప్రసాద్ పథకం రూ.61.99 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన గడువులోగా నాణ్యత ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, టూరిజం డి ఈ నటరాజ్, ఏఈ విజయ్, స్థానిక ప్రజాప్రతినిధులు మండల్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ కోటి పోషాలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/భూపాలపల్లి: భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గుత్తేదారులను ఆదేశించారు. మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలంలోని గాంధీనగర్ శివారులో గుట్టపై నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణ పనులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను,గుత్తేదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుత్తేదారులతో మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలకు ఎలాంటి భంగం కలగకుండా అత్యంత బాధ్యతతో చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ విద్యా సంస్థ భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్యను అందించే కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల నిర్మాణంలో నాణ్యత, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేటశించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని రైతుల ఆందోళన

వాగు ఉధృతితో పంట పొలాలకు వెళ్లలేక రైతుల తిప్పలు



ప్రజాపక్షం/తొర్రూరు: మండలంలోని అమ్మాపురం గ్రామం నుంచి కంఠాయపాలెం గ్రామానికి బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని మంగళవారం గ్రామాల రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద మంజూరైన నిధులతో సృజన కన్‌స్ట్రక్షన్ టెండర్ వేసి బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో వాగు ఉధృతి కారణంగా చుట్టుపక్కల ఉన్న రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు వాగు దాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, అమ్మాపురం మాజీ ఎంపీటీసీ డొనుక ఉప్పలయ్య, పాక వెంకన్న, పాక యాకయ్య, పేరబోయిన అశోక్, పేరబోయిన యాదగిరి, పాక అమరేందర్, పాక బ్రహ్మం, గుంటుక లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాధారణ స్థాయికి గోదావరి



ప్రజాపక్షం/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన కాళేశ్వరం వద్ద మంగళవారం గోదావరి సాధారణ స్థాయికి చేరి కొనసాగుతుంది.త్రివేణి సంగమ తీరం వద్ద గత శుక్రవారం ఉధృత రూపం దాల్చినఉగ్ర గోదావరి12.300 మీటర్ల నీటిమట్టం ఎత్తుకు చేరుకుని మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ఉరకలేసిన గోదావరిఉధృతి క్రమేపి తగ్గుముఖం పట్టి నేటి సాయంత్రం వరకు7.260 మీటర్ల నీటిమట్టం వద్ద వరద ప్రవాహం కొనసాగుతుంది.త్రివేణి సంగమం వద్ద గోదావరి,ప్రాణహిత ఉభయ నదుల నుండి1.74లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు తరలుతున్నాయి.

## వరంగల్‌ను అత్యాధునిక వైద్య కేంద్రంగా
# తీర్చిదిద్దడమే ప్రభుత్వం లక్ష్యం

మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ



ప్రజాపక్షం/హనుమకొండ : ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహా, కొండా సురేఖ తెలిపారు. ఈ నేపథ్యంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి సచివాలయంలోని ఆయన కార్యాలయంలో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి,యశశ్విని రెడ్డితో పాటు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ మీక్షలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల పురోగతి, మహాత్మాగాంధీ హాస్పిటల్ (ఎంజీఎం), ప్రభుత్వ కంటి ఆస్పత్రి, కాకతీయ మెడికల్ కాలేజ్ (కెఎంసీ), వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రి సహా ఇతర ప్రభుత్వ వైద్య సంస్థల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు వివరించారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, వైద్య సేవల విస్తరణ, ఆస్పత్రుల్లో బెడ్ల సంఖ్య పెంపు, ఆధునిక వైద్య పరికరాల అందుబాటు, నిర్మాణ పనులను వేగవంతం చేయడం వంటి అంశాలపై మంత్రులు అధికారులతో విస్తృతంగా చర్చించారు.వరంగల్‌ను రాష్ట్రంలోనే అత్యాధునిక వైద్య కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రులు సూచించారు.

## మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి సీతక్క



ప్రజాపక్షం/ములుగు: తాడ్వాయి మండలం మేడారం ఆలయ పరిసరాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖల మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) మంగళవారం పరిశీలించారు. అనంతరం వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమ్మక్క భవన్‌లో మదర్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణ శిభిరానికి ముఖ్య అతిధిగా హాజరైన మంత్రి మహిళలకు ఉచిత కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్‌రెడ్డి, డిఈఓ సిద్దార్థ రెడ్డి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ప్రత్యేక అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 5న ఎఐటియుసి మహాసభలు

ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి




ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హనుమకొండ జిల్లా ఏఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మీటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనము 32,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కుల కోసం సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అలుపెరగని ఉద్యమాలు ఏఐటీయూసీ నిర్వహిస్తామని అదేవిధంగా కార్మిక వ్యతిరేక విధానాలకు అలుపెరగని పోరాటం చేస్తామని అన్నారు. హనుమకొండ జిల్లా 2వ మహాసభలు ప్రెస్ క్లబ్ లో ఉదయం 10 గంటలకు ఈ నెల 5న నిర్వహించడం జరుగుతుందని వేల్పుల సారంగపాణి అధ్యక్షులు తెలియజేశారు. ఈ మహాసభలకు జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఎన్ హెచ్ ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లష్కర్ సింగారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు భాస్కర్, అనూష ట, సుమ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసమస్యలతో సిపిఐ పాదయాత్ర

ప్రజాపక్షం/ఎల్కతుర్తి : ఈ నెల 6 నుండి జరిగే సిపిఐ పాదయాత్రలను విజయవంతం చేయాలని బికేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్,అధ్యక్షులు మునిగాల బిక్షపతి కోరారు.ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ పాదయాత్రలను వ్యవసాయ కార్మికులు విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం బి కేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రే లక్ష్మణ్, అధ్యక్షులు మునిగాల బిక్షపతి విజ్ఞప్తి చేశారు. అలాగే ఈనెల 6 తేదీ నుండి 14 తేదీ వరకు అనుమకొండ జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల విధిగా పాదయాత్ర కొనసాగుతుందని, ఈ పాదయాత్రలో గ్రామ సమస్యలు తో పాటు ఎన్నికలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఈ పాదయాత్రలు కొనసాగుతాయి అన్నారు. ఈ పాదయాత్రను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కాజీపేట మండల కేంద్రంలో ప్రారంభిస్తారని వారన్నారు. చివరి రోజు వేయి స్తంభాల గుడి నుండి పబ్లిక్ గార్డెన్ వరకు ర్యాలీ కొనసాగి, అక్కడ బహిరంగ సభ ఉంటుందని వారు అన్నారు. కావున వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ పాదయాత్ర విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఎన్‌హెచ్-163పై అసంపూర్తి సర్వీస్ రోడ్లు వెంటనే పూర్తి

ఎన్ హెచ్‌ఏఐ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన ఎంపి కడియం కావ్య



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : యాదాద్రి–వరంగల్ మధ్య జాతీయ రహదారి163పై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించి సమస్యను వివరించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 163)లోని యాదాద్రి– వరంగల్ నాలుగు లేన్ల విస్తరణ పనుల సమయంలో నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు నిర్మించినప్పటికీ, వాటి మధ్య పలు ప్రాంతాల్లో అనుసంధాన లింకులు మిగిలిపోయాయని తెలిపారు. జనగాం సమీపంలోని. 87/200 కి.మీ నుంచి నిడిగొండ వరకు, నిడిగొండ నుంచి రఘునాథపల్లి వరకు, రఘునాథపల్లి నుంచి చాగల్ వరకు, చాగల్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్ వరకు, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి చిన్నపెండ్యాల వరకు, చిన్నపెండ్యాల నుంచి కరుణాపురం వరకు ఉన్న సర్వీస్ రోడ్లలో లింకులు లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వివరించారు.ఈ కారణంగా స్థానిక వాహనాలు ప్రధాన జాతీయ రహదారిపైకి రావాల్సి వస్తోందని, దీంతో ట్రాఫిక్ రద్దీ పెరగడంతో పాటు రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు. నాలుగు లేన్ల విస్తరణ సమయంలోనే సర్వీస్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణ పూర్తయినందున, మిగిలిన లింకులను నిర్మించడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.ప్రజల భద్రత, స్థానిక రవాణా సౌలభ్యం, గ్రామాల మధ్య మెరుగైన అనుసంధానం కోసం అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్ సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

## బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ప్రచార జాత

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి

సిపిఐ ప్రచార జాత వాల్ పోస్టర్ విడుదల




ప్రజాపక్షం/హనుమకొండ:కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగడుతూ సిపిఐ ప్రచార జాత ఆగస్టు 6 నుండి 11 వరకు జిల్లాలో నిర్వహిస్తుందని, ఈ జాతలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ మండలంలోని గుండ్ల సింగారం సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో సిపిఐ ప్రచార జాత ఛలో డిల్లీ వాల్ పోస్టర్లను సిపిఐ నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బిక్షపతి మాట్లాడుతూ ఈ దేశంలో బిజెపి ప్రభుత్వం రోజురోజుకు ప్రజలను అణచివేత ధోరణిని అవలంభిస్తుందని, దేశంలో ఏ సమస్యలు లేనట్టు దేవుడు, మతం పేరు మీద ప్రజలను 12 సంవత్సరాలుగా మోసం చేస్తూ వస్తుందన్నారు. ఈ దేశంలో పెరుగుతున్న నిత్యావసర, చమురు ధరలను పెంచుతూ ఈ ధరలు సామాన్య ప్రజలకు అందని ద్రాక్షగా చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లాలో ఆగస్టు 6 నుండి 11 వరకు ప్రచార జాత సిపిఐ నిర్వహిస్తుందని, ఆగస్టు 6వ తేదీన కాజీపేటలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జాతను ప్రారంభిస్తారని, ఈ జాత జిల్లాలో గ్రామ గ్రామాన యాత్ర చేసి ఆగస్టు 11వ తేదీన హనుమకొండ లోని వేయి స్థంబాల గుడి నుండి పబ్లిక్ గార్డెన్ వరకు ర్యాలీతో ముగిస్తుందని తెలిపారు. ఆగస్టు 7, 8 తేదీల్లో జరిగే ప్రచార జాతలో సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ జాత ద్వారా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు వివరిస్తూ ప్రతి గ్రామంలో ఉన్న ప్రజా సమస్యల పైన పోరాటాలు కొనసాగిస్తూ సెప్టెంబర్ 1వ తేదీన ఛలో ఢిల్లీతో ముగుస్తుందని అన్నారు.జిల్లాలో జరిగే ప్రచార జాతను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటీ రాజేందర్, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, నలువల సంధ్య, తాటికంటి మమత, తోట రామారావు, తిప్పనపల్లి మోహన్, పెనుకుల మధు, పెనుకుల మధు, లక్కం రాజు, రాయబారపు శ్రీనివాస్, రెసోజు రాజు, సిలిమోజు హేమలత, సపవట్ దేవి తదితరులు పాల్గొన్నారు.

## ఓసి క్లబ్ మున్సిపాలిటీ స్వాధీనం చేసుకునే వరకూ పోరాటం ఆగదు

మున్సిపల్ సమావేశంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి రెడ్డి



ప్రజాపక్షం/మహబూబాబాద్: ఓసి క్లబ్‌ను స్వాధీనం చేసుకొని బహుళ ప్రయోజనాలకు ఉపయోగించేలా స్వాధీనం చేసుకునే వరకూ పోరాటం ఆగదని, నాన్ వెజ్ మటన్ మార్కెట్ ను కూడా వినియోగంలో తెచ్చే విధంగా కృషి చేయాలని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ 33 వ వార్డు కౌన్సిలర్ బి అజయ్ సారధి రెడ్డి అధికారులను కోరారు. మంగళవారం జరిగిన మున్సిపల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి పథంలోకి తీసుకుపోవాలని వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎల్ఆర్ఎస్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఓసిక్లబ్‌ను స్వా ధీనం చేసుకొని బహుళ ప్రయోజనాలకు ఉపయోగించాలని లేకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని, నాన్ వెజ్ మటన్ మార్కెట్ ను కూడా వినియోగంలో తెచ్చే విధంగా కృషి చేయాలని అధికారులను కోరారు. మహబూబాబాద్ ము న్సి టపాలిటీ పరిధిలో 36 వార్డులకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి పథంలోకి తీసుకుపోవాలని వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యలు పరిష్కరించాలని, గాంధీ పార్క్ ను తక్షణమే అభివృద్ధి చేయాలి మరియు సిగ్నల్ కాలనీ పేదల ఇండ్లు పోకుండా సర్వే పూర్తి చేయాలని, సాయిబాబా టెంపుల్ రోడ్డు తక్షణమే నిర్మించాలని అజయ్ సారథిరెడ్డి కోరా రు. బోనాల సందర్భంగా పండుగకు నిధు లు కేటాయించాలని వార్డుల్లో ప్రజలకు ఇబ్బం ది కాకుండా మున్సిపల్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఐదవ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్యా శ్రావణ్ మాట్లాడుతూ 25 వార్డు లో సీసీ డ్రైనేజీలు, సిసి రోడ్లు లేక వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయం అయ్యాయని వెంటనే సిసి రోడ్డు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున మున్సిపాలిటీని ముట్టడిస్తామని తెలిపారు.

## వైద్యం, విద్యపై ప్రత్యేక దృష్టి

1258 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాం

టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు



ప్రజాపక్షం/మహాదేవపూర్: విద్య, వైద్యంపై మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టి సారించి లక్షలాది మంది యువత,ప్రజలకు వివిధ రకాల సహాయ సహకారాలు అందిస్తున్నారని రాష్ట్ర పై సి సి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ వైద్య శిబిరానికి ఆయన హాజరయ్యారు ఈ సందర్భంగా శిబిరంలో అందుతున్న సేవలను పరిశీలించారు.అనంతరం ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ విద్యతో పేదరికాన్ని జయించి ఉన్నతంగా ఎదగవచ్చని అన్నారు. ఈ క్రమంలో మంథని నియోజకవర్గాన్ని విద్యావంతుల నియోజక వర్గ ఏర్పాటుతో పాటు వైద్య పరంగా క్యాన్సర్ ఫ్రీ గా మార్చడానికి తన అత్తగారైన సువర్ణ వనమాల జ్ఞాపకార్థం క్యాన్సర్ శిబిరం నిర్వహిస్తున్నామని అన్నారు. మంథని ప్రజలకు రుణపడి ఉంటామని మంథని నియోజక వర్గ ప్రజలకు ఎంత చేసినా తక్కువే అని అన్నారు. ఇప్పటి వరకు 1258 వైద్య శిబిరాలు నిర్వహించామని 25750 క్యాటరాక్ట్ ఆపరేషను,40వేల మందికి ఇంటర్నేషనల్ స్టాండ్ కళ్లద్దాలు అందించామని, 8వేల అమ్మాయిలకు అవసరమైన టెస్టులు, 40 క్యాన్సర్ క్యాంపులు, 25 డెంటల్ క్యాంపులు 2 వేల మంది పిల్లలకు గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేయించామని ఇలాంటి కార్యక్రమాలు ఏ నియోజకవర్గంలో జరగలేదని ఇది రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. రాబోవు రోజుల్లో ప్రతీ మండల కేంద్రంలో మరెన్నో వైద్య శిబిరాలు నిర్వహించి మంథని నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా అన్నీ తానై వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న మహేంద్ర యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ దుద్దిళ్ళ కుటుంబ వ్యక్తిగా తమ ఐదవ తమ్మునిగా అభివర్ణిస్తూ ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, సర్పంచ్ హసీనా బాను అక్బర్ ఖాన్, పై ఎసిఎస్ చైర్మెన్ చాలా తిరుపతి రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ విద్యావతి, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## భూముల రీ-సర్వే ప్రక్రియ వేగవంతం

రీ-సర్వే షెడ్యూల్‌ను ముందస్తుగా రైతులకు తెలియజేయాలి

ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి



ప్రజాపక్షం/హనుమకొండ : భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, సర్వేకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే రైతులకు తెలియజేసి వారి సహకారంతో పనులు చేపట్టాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి సర్వేయర్లను ఆదేశించారు.మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలో భూములు కొలతల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను ఇన్‌చార్జి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎన్ని ఎకరాల భూమికి రీసర్వే పూర్తయిందని, రోజువారీగా ఎంత విస్తీర్ణంలో సర్వే నిర్వహిస్తున్నారని, ఎన్ని రోవర్ పరికరాలతో సర్వే చేపడుతున్నారని సర్వేయర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి రీసర్వే ప్రక్రియ, పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రస్తుతం గ్రామంలో రెండు సర్వే బృందాలు రీసర్వే పనులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, ప్రతి సర్వే బృందం రోజుకు కనీసం 75 ఎకరాల భూమిని రీసర్వే చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. సర్వే ప్రారంభానికి ముందే కార్యాచరణ రూపొందించి, ఆయా ప్రాంతాల రైతులకు తేదీలు, సమయాలపై ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు.రైతుల సమన్వయంతో, నిర్దేశిత లక్ష్యాల ప్రకారం ప్రతిరోజూ రీసర్వే చేపడితే ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సర్వే పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీసర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో భూములు కొలతల శాఖ సహాయ సంచాలకులు నూర్ సింగ్, ఐనవోలు తహసీల్దార్ విక్రమ్ కుమార్, సర్వేయర్ సూరజ్ కుమార్, జీపీవో శ్రీకాంత్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
బుధవారం
05-08-2026
www.prajapaksham.in

"విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కాండ్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మిస్తున్నరా అండ్ రస్టిక్ చిత్రం 'అనకాపల్లి'. ఈసినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నారు."

# రీల్



## 'నీ వెనకే' సాంగ్ రిలీజ్

మెమరీ మేకర్స్ బ్యానర్ మీద హరికృష్ణ సోమిశెట్టి నిర్మిస్తున్న చిత్రం 'ది రెడ్ బ్యాగ్'. ఈ మూవీకి రవి కుమార్ సీరపు దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి, రాశీ ముఖ్య పాత్రలను పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. రీసెంట్‌గా రిలీజ్ చేసిన 'డిస్కో లైట్' సాంగ్ యూట్యూబ్‌లో చార్ట్ బస్టర్‌గా నిలిచింది. ఇక తాజాగా 'నీ వెనకే' అంటూ సాగే ఓ బ్యూటీఫుల్ మెలోడీ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ పాటను సిధ్ శ్రీరామ్ ఆలపించారు. ఈ పాటకు ఆయన గాత్రం ప్రధాన ఆకర్షణ. ఈ పాటకు తిరుపతి జావన సాహిత్యం అందించారు.. శేఖర్ మోపురి బాణీ ఎంతో ఫీల్ గుడ్‌గా అనిపిస్తోంది. ఇక ఈ పాట శ్రోతలను ఇట్టే ఆకట్టుకునేలా ఉంది.మ్యూజికల్ ప్రమోషన్స్‌తో చిత్రయూనిట్ అందరిలోనూ అంచనాలను పెంచేస్తోంది. ఈ సినిమా 21న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి మ్యూజిక్ : శేఖర్ మోపురి, డిఒపి : ప్రియేష్ గురుస్వామి, ఎడిటింగ్ : శివ శర్వాణి.

## సోనూ సూద్ చేతుల మీదుగా
# 'డర్టీ గ్యాంగ్‌స్టర్స్' పాట ఆవిష్కరణ



విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కాండ్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మిస్తున్నరా అండ్ రస్టిక్ చిత్రం 'అనకాపల్లి'. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నారు. కాండ్రేగుల కుమార్ రాజాకో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీకి కథ, స్క్రీన్ ప్లేని అందించడమే కాకుండా త్రినాథరావు నక్కిన ఓ ముఖ్య పాత్రను కూడా పోషించారు. 7న చిత్రాన్ని రిలీజ్ చేయబోతోన్నారు. ఈ పాటను నటుడు సోనూ సూద్ విడుదల చేశారు. 'డర్టీ గ్యాంగ్ స్టర్స్' అంటూ సాగే ఈ లిరికల్ వీడియోని చూస్తుంటే సినిమా ఎంత రా అండ్ రస్టిక్‌గా ఉంటుందో అర్థం అవుతోంది. ఇక ఈ పాటను విడుదల చేసిన అనంతరం చిత్రయూనిట్‌కు సోనూ సూద్ ఆల్‌ది బెస్ట్ తెలిపారు. ఈ చిత్రం తప్పక విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.'డర్టీ గ్యాంగ్ స్టర్స్' అంటూ సాగే ఈ పాటను కేకే రచించగా. పృథ్వీ చంద్ర, ఈకే ఆలపించారు. దేవ్‌జండ్ బాణీ ఎంతో ఇంటెన్స్‌తో ఉంది. ఈ పాట వింటుంటే ఓ అడ్రినల్ రష్‌లా అనిపిస్తోంది. మాస్ ఆడియెన్స్‌కి ఈ పాట ఇన్ స్టంట్‌గా ఎక్కేసేలా ఉంది. ఈ లిరికల్ వీడియోలోని విజువల్స్, లొకేషన్స్, యాక్షన్ సీక్వెన్స్ అన్నీ కూడా ఎంతో నేచురల్‌గా కనిపిస్తున్నాయి. ఈ చిత్రానికి మాయా.వి కెమెరామెన్‌గా, శ్రీకృష్ణ అట్టలూరి ఎడిటర్‌గా పని చేశారు. త్రినాథరావు నక్కిన కథ, స్క్రీన్ ప్లే అందించిన ఈ చిత్రానికి ఉదయ్ భాగవతులు డైలాగ్ రైటర్‌గా వర్క్ చేశారు. ఈ చిత్రానికి డిఒపి : మాయా. వి, సంగీతం: దేవ్‌జండ్ ఎడిటర్: శ్రీకృష్ణ అట్టలూరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సెత్రామరాజు మల్లెల, సంభాషణలు: ఉదయ్ భాగవతుల, కొరియోగ్రఫీ: శేఖర్ వీజీ, యష్ మాస్టర్, జిత్తు మాస్టర్, సాహిత్యం: అనంత శ్రీరామ్, కెకె, గణేష్ సలాది, రాంబాబు గోశాల, తేజ గొర్లె.



## రష్మిక కాలికి గాయంతో ఆగిపోయిన భారీ సినిమాలు

పాన్ ఇండియా స్టార్ రష్మిక మందాన కాలికి గాయమవడంతో రెండు భారీ సినిమాల షూటింగ్ ఆగిపోయింది. ఆరు వారల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించడంతో ఈ భారీ పాన్ ఇండియా సినిమాల షూటింగ్ ను ఆపుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ రెండు సినిమాల నిర్మాతల నెత్తిన బడ్జెట్ బాంబు పడుతోందని ఫిలిం నగర్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల మైసా సినిమాలో డ్యాన్స్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా తీవ్రంగా గాయపడింది. ఆమెఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. వైద్యుల సూచన మేరకు రశ్మిక బెడ్ రెస్ట్ తీసుకుంటున్నారు. ఆమె తాజాగా తన కాలి గాయంపై స్పందించారు. ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు.ఈ పోస్ట్‌లో రశ్మిక మందన్న స్పందిస్తూ గాయాలు అవ్వడం నాకు చాలా చిరాకు తెప్పిస్తుంది. ఈ గాయం గురించి ఎవరికి తెలియకూడదు అనుకున్నా కానీ తెలిసిపోయింది. నాకు ఇలాంటి గాయం కావడం ఇది మూడవసారి. తుంటికి కాలుని కలిపే టెండన్స్ ఒక్కో వైపు నాలుగు ఉంటాయి. నాకుడి తుంటిలోని ఒక టెండెన్ ఊడిపోయింది. నేను కాలు పైకి ఎత్తాలి అంటే అది మళ్లీ అతుక్కోవాలి. మైసా సినిమా కోసం డాన్స్ షూట్ చేస్తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగింది. నేను చేస్తున్న సినిమాల్లో మైసా అత్యంత కష్టమైన సినిమా. నేను విశ్రాంతి తీసుకోవడానికే దేవుడు ఈ గాయం బారిన పడేలా చేశాడని భావిస్తున్నాను. అని అన్నారు. ప్రస్తుతం రశ్మిక రణబాలి, మైసా సినిమా షూటింగ్స్ లో పాల్గొంటున్నారు. వీటితో పాటు మరో రెండు భారీ చిత్రాల్లో నటిస్తున్నారు. అలాగే 30 ప్రాడకట్స్ కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. రశ్మికకు అయిన తీవ్ర గాయంతో ఆయా సినిమాల, వ్యాపార ప్రకటనల షూటింగ్స్ నిలిచిపోయాయి.

# మైండ్ బ్లోయింగ్ 'దందా'

## డైరెక్టర్ ఆదిత్య దేవులపల్లి



వర్టికల్ స్టోరీస్‌లో చాయ్ షాట్స్ నుంచి వచ్చిన 'దందా' సిరీస్ సెన్సేషనల్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. 'దందా'తో దర్శకుడు ఆదిత్య దేవులపల్లి అందరినీ ఆకట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో దర్శకుడు ఆదిత్య దేవులపల్లి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నేను చదువులో టాపర్‌నే, కానీ చిన్నప్పటి నుంచీ నాకు సినిమాలంటే పిచ్చి ఇష్టం. ఆ ప్యాషన్‌తోనే ఇంజనీరింగ్ మధ్యలోనే వదిలేసిన. ఇంట్లో కెమెరా మీద ఉన్న ఆసక్తిని చెప్పడంతో ఓ చిన్న కెమెరా కొనిచ్చారు. ఇండస్ట్రీలో నాకంటూ ఎవరూ లేరు, ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా ఫోటోగ్రఫీ నేర్చుకుని ఇక్కడికి వచ్చా. ఆ తర్వాత సెయింట్ మేరీస్ కాలేజీలో మాస్ కమ్యూనికేషన్‌లో చేరా. ఆ క్రమంలోనే చాయ్ బిస్కెట్ అనురాగ్ అన్నకి ఓ వైలెంట్ కథ నరేట్ చేశా. నేను ఎప్పుడు అనుకునే వాడిని నేను 28 ఏళ్ళ వయసులో కల్లా డైరెక్టర్ అవ్వాలి అని, అయ్యాను. నేను చెప్పిన కథ అనురాగ్ అన్నకి బాగా నచ్చింది. 'తెలుగులో సాధారణంగా ఇలాంటి కథను తీసే ధైర్యం ఎవరూ చేయరు' అని చెప్పారు. ఆ తర్వాత మళ్లీ నన్ను పిలిచి మాట్లాడారు. ఆయన కొత్తగా చాయ్ షాట్స్ ప్రారంభించి నన్ను క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా జాయిన్ అవ్వమన్నారు. అక్కడ కొన్ని షోస్ చేసిన తర్వాత, నాకు అదంతా రొటీన్‌గా, ఏమాత్రం ఎగ్జైటింగ్ లేదనిపించింది. దాంతో నేరుగా అనురాగ్ అన్న దగ్గరకే వెళ్లి, 'నేను నీకో క్రేజీ షో డైరెక్ట్ చేసి చూపిసా' అని పట్టుబట్టి చెప్పా. అలా 'దందా' ప్రయాణం మొదలైంది.'దందా' ఒరిజినల్ కథను విజయ్ కుమార్ రాశాడు, కానీ అందులో కొన్ని లోపాలు ఉన్నాయి. నేను మొత్తం రీరైట్ చేసి కథకు ఒక కంప్లీట్‌నెస్ తీసుకొచ్చా. అతనికి 'దందా' విజన్ చెప్పగానే, కరెన్సీ నోట్ల ఆధారంగా డిజైన్ చేసిన ప్రత్యేకమైన కలర్ ప్యాలెట్‌ను క్రియేట్ చేసి, బెస్ట్ లెన్సెస్‌తో క్రేజీ విజువల్స్ ఇచ్చాడు.ఇక మ్యూజిక్ డైరెక్టర్ రిషి ఎమ్ నా మంచి ఫ్రెండ్ షూటింగ్ ప్రారంభం కాకముందే మెజారిటీ మ్యూజిక్ కంపోజ్ చేసేశాడు. అందుకే సైబర్ క్రైమ్‌పై ఆయన చేసిన ఓ అవేర్‌నెస్ వీడియోను ఆయనకిచ్చే ట్రిబ్యూట్‌గా ఈ సిరీస్‌లో వాడుకున్నాం. తేజ చాలా డౌన్ టు ఎర్త్ పర్సన్. తనని చూడటానికి జనాలు రూ. 200 లేదా రూ. 250 టికెట్ కొని థియేటర్‌కి వచ్చే స్థాయికి ఎదగాలనే కసి అతనిలో ఉంది. 'దందా'ని గుడ్డిగా నమ్మి నాకోసం ఇచ్చాడు. ఎంత బెండ్ ట్రస్ట్ అంటే. తను చేసిన సీన్ కరెక్ట్‌గా వచ్చిందో లేదో చూడటానికి మానిటర్ వైపు కూడా చూడడు. తేజ నటనలోని అసలు పవర్ ఇంకా చాలామంది చూడలేదు. 28వ ఎపిసోడ్‌లో తను చెప్పిన మోనోలాగ్ డైలాగ్ ఒకే ఒక్క సింగిల్ చేశాడు.



## నితిన్ హీరోగా 'అలియాస్ రుక్మిణి'

హీరో నాని సమర్పణలో తెరకెక్కిన 'కోర్ట్ – స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' ఘన విజయానంతరం ఆయన యూనానిమస్ ప్రొడక్షన్స్ రెండో చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. నితిన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'అలియాస్ రుక్మిణి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. దీనికి సంబంధించి ఒక వీడియోను కూడా రిలీజ్ చేశారు. 'కృష్ణ కథ చెబుతాను' అని దర్శకుడు చెప్పగానే, రుక్మిణి అనే రచయిత్రి రాసిన పలు రొమాంటిక్ నవలల కవర్లు కనిపిస్తాయి. వాటిని చూసి 'నువ్వు కృష్ణ కథ అన్నావు... మరి ఈ రుక్మిణి ఎవరు?' అని నాని అడుగుతాడు. చివర్లో మ్యాథ్స్ టీచర్‌గా కనిపించిన నితిన్, 'మై వైఫ్' అని చెప్పడంతో వీడియో ఆసక్తికరంగా ఎండ్ అవుతుంది. కథలోని అసలు మిస్టరీని బయటపెట్టకుండా, ఆసక్తిని మాత్రం రెట్టింపు చేసేలా ఈ వీడియోను రూపొందించారు. వినూత్న కథనం, ఆకట్టుకునే విజువల్స్, ఆసక్తికరమైన నేపథ్యం, హాయిగా సాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాపై మంచి అంచనాలు పెంచుతున్నాయి. ఈ చిత్రాన్ని తాజాగా సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి నాని క్లాప్ కొట్టగా, నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. నాని తండ్రి గంటా రాంబాబు, నిర్మాత వెంకట్ బోయనపల్లి స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందజేశారు. 'కోర్ట్' దర్శకుడు రామ్ జగదీష్, శైలేష్ కొలను కలిసి తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. అనంతరం నాని మాట్లాడుతూ త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం. ఈ సినిమా చాలా ప్రత్యేకంగా నిలుస్తుందనే నమ్మకం ఉంది అని అన్నారు. హీరో నితిన్ మాట్లాడుతూ ఈ సినిమా నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుంది. ఇంత మంచి కథను నాకు తీసుకొచ్చిన నానికి, ఇంత మంచి దర్శకుడిని పరిచయం చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ సినిమా నాని, మురళీ, దీప్తి, మొత్తం టీమ్‌తో పాటు నన్ను కూడా గర్వపడేలా చేస్తుందని నమ్ముతున్నాను అని చెప్పారు. ఈ చిత్రానికి జోమన్ టి. జాన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విజయ్ బుల్గానిన్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా, సృజన అడుసుమిల్లి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

# 'బద్లావ్ జరూరీ హై: రైటింగ్స్ ఆఫ్ డి.రాజా' సంకలనం ఆవిష్కరణ



**న్యూఢిల్లీ:** దేశం ఎదుర్కొంటున్న ప్రస్తుత రాజకీయ, సామాజిక, ఆర్థిక సవాళ్లపై సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా రాసిన వ్యాసాల సంకలనంగా రూపొందిన 'బద్లావ్ జరూరీ హై: రైటింగ్స్ ఆఫ్ డి. రాజా' పుస్తకాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు పి.సంతోశ్‌కుమార్, అనీ రాజా ఆవిష్కరించారు. సిపిఐ ప్రధాన కార్యాలయం అజయ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తక తొలి ప్రతిని ప్రముఖ సామాజిక కార్యకర్త షబ్నమ్ హష్మీకి అందజేశారు. దేశంలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, ప్రజల హక్కులు వంటి అంశాలపై డి.రాజా వ్యక్తం చేసిన అభిప్రాయాలు, విశ్లేషణలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి వామపక్ష నాయకులు, కార్యకర్తలు, మేధావులు హాజరయ్యారు. ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధూ, వివిధ రంగాలకు చెందిన సామాజిక కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... దేశంలో పెరుగుతున్న అసమానతలు, ప్రజాస్వామ్య సంస్థలకు సవాళ్లు, సామాన్య ప్రజల జీవన సమస్యలు వంటి అంశాలపై చర్చ, ప్రజా ఉద్యమాల అవసరాన్ని ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.

**సిపిఐ రాజకీయ ప్రచారంలో భాగంగా....**

సిపిఐ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న రాజకీయ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈ పుస్తకాన్ని విడుదల చేసింది. ఢిల్లీలో జరగనున్న 'బద్లావ్ జరూరీ హై ర్యాలీ' సన్నాహాల్లో భాగంగా పార్టీ వివిధ పుస్తకాలు, ప్రచార సామగ్రిని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ప్రజల్లో చైతన్యం కల్పించడం, ప్రత్యామ్నాయ విధానాలపై చర్చను ప్రోత్సహించడం ఈ ప్రచార కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పార్టీ వర్గాలు తెలిపాయి. డి. రాజా రచనల సంకలనం ఈ ప్రచారంలో భాగంగా ప్రజలకు చేరువ చేసే ఒక ముఖ్యమైన పత్రంగా నిలుస్తుందని పేర్కొన్నారు.





## జోన్-O బస్తీల కూల్చివేతకు వ్యతిరేకంగా
# జంతర్‌మంతర్ వద్ద వామపక్షాల ఆందోళన

**న్యూఢిల్లీ:** యమునా పరివాహక ప్రాంతంలోని జోన్–O బస్తీల కూల్చివేత ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన చేపట్టాయి. సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్), ఆర్ఎస్పీ, ఫార్వర్డ్ బ్లాక్, సిజిపిఐ ఢిల్లీ రాష్ట్ర కమిటీలు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆందోళనలో నాయకులు పేదలపై బిజెపి ప్రభుత్వ బుల్డోజర్ రాజకీయాలను తీవ్రంగా ఖండించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు పి.సంతోశ్ కుమార్, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ దినేశ్ వర్షే ్న మాట్లాడుతూ... బస్తీల తొలగింపు చర్యలకు బదులుగా అక్కడి ప్రజలకు పునరావాసం, గౌరవప్రదమైన జీవనం, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జోన్–O బస్తీల్లో నివసిస్తున్న సుమారు 20 లక్షల మంది ప్రజలకు సిపిఐ, వామపక్షాలు అండగా ఉంటాయన్నారు. పేదలను వారి నివాసాల నుంచి తరలించే ప్రతి ప్రయత్నాన్ని ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

## అప్రమత్తం (మొదటి పేజీ తరువాయి)

అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశముందని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో సంచరించే వారు, రైతులు, వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆగస్టు బుధవారం నుంచి శుక్రవారం వరకు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మూడు రోజుల పాటు కూడా అన్ని జిల్లాల్లో 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఈ రోజుల్లోనూ రాష్ట్రవ్యాప్తంగా బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందన్నారు. శనివారం నుంచి సోమవారం వరకు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## తప్పనిసరి (మొదటి పేజీ తరువాయి)

డేటాకు పూర్తి భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. గత ఆరు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 4,487 ప్రభుత్వ కార్యాలయాలకు టిఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించే ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రి వెల్లడించారు. దీంతో ఇప్పటికే ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.13 కోట్ల మేర ఆదా జరిగిందన్నారు. మిగిలిన ప్రభుత్వ కార్యాలయాలకు కూడా యుద్ధ ప్రాతిపదికన టిఫైబర్ సేవలను విస్తరిస్తున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ, భవిష్యత్తులో ఎలాంటి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. తెలంగాణ వైడ్ ఏరియా నెట్‌వర్క్ (టిస్వాన్)ను నెల రోజుల్లోపు పూర్తిగా టిఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీకి అధునాతన ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు అందించే కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని, ఇందుకోసం ప్రిన్సిపల్ మానిటైజేషన్ పార్ట్‌నర్ ఎంపికకు వెంటనే టెండర్లు పిలవాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐటి శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టిఫైబర్ ఎండి వేణు ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వెల్లువెత్తిన నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)


ముడిపడి ఉన్నాయని ఆరోపిస్తూ, వారు ఇంతకు ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)తో పాటు సిబిఐతో కూడా దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. సిఐడి దర్యాప్తుపై పూర్తిగా నమ్మకం పోయిందని, గతంలో, జెఎస్ఎస్సిజిఎల్ పేపర్ లీక్‌పై ప్రభుత్వం సిఐడితో దర్యాప్తు చేయించిందని, 150 ప్రశ్నలలో 135 ప్రశ్నలకు సమాధానాలు లీక్ అయ్యాయని, వాటిలో 120 ప్రశ్నలు పరీక్షా పత్రంతో సరిగ్గా సరిపోయాయని ఆ ఏజెన్సీయే స్వయంగా కనుగొందని అని హజారీబాగ్ జిల్లాకు చెందిన ఒక అభ్యర్థి వినయ్ మెహతా పిటిఐకి తెలిపారు. అభ్యర్థులు ఈమెయిల్స్, వాట్సాప్ ద్వారా డాక్యుమెంటరీ ఆధారాలు పంపినప్పటికీ, అధికారులు ఆ ఫిర్యాదులను గుర్తించలేదని, వాటిపై చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. 'అందువల్ల, ఈ దర్యాప్తును సిబిఐకి గానీ, లేదా జార్ఖండ్‌కు చెందిన ఏ న్యాయమూర్తినీ మినహాయించి, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తులతో కూడిన ఒక స్వతంత్ర సంస్థకు గానీ అప్పగించాలని మేము డిమాండ్ చేస్తున్నాము' అని మెహతా అన్నారు. మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ మొదటి వర్ధంతి సందర్భంగా ఆయనకు కూడా నివాళులర్పిస్తామని నిరసనకారులు తెలిపారు. ప్రస్తుతానికి ఆందోళన శాంతియుతంగానే కొనసాగినప్పటికీ, ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోవడం మానేస్తే విద్యార్థులు దానిని తీవ్రతరం చేస్తారని ఆయన హెచ్చరించారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే 10న అసెంబ్లీని ముట్టడిస్తామని అని గోస్వామి అన్నారు.

**బిహార్‌లో మళ్లీ విద్యార్థుల ఆందోళనలు**

నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశాన్ని వ్యతిరేకిస్తూ బిహార్‌లో విద్యార్థులు మరోసారి నిరసన బాటపట్టారు. గత నెలలో జరిగిన నిరసనల్లో అరెస్టైన విద్యార్థులను విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి.. దానిని నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ వందలాది మంది విద్యార్థులు, యువజన సంఘాల కార్యకర్తలు మంగళవారం పట్నాలో ఆందోళనకు దిగారు. కాగా.. గాంధీ మైదాన్ వద్ద నుంచి సిఎం సమ్రాట్ చౌదరి నివాసం వైపు ర్యాలీగా బయల్దేరిన నిరసనకారులను.. ఇన్‌కమ్ ట్యాక్స్ చౌరస్తా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ముఖ్యమంత్రి ఇంటికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలోనే వారిని నిలువరించారు. ఈ నేపథ్యంలో ఆందోళనకారులు ముందుకు దూసుకెళ్లేందుకు యత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించారు. అయితే.. నిషేధిత ప్రాంతంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించడంతోనే పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు వాటర్ కేనన్లు ఉపయోగించామని పోలీసులు తెలిపారు. గత నెలలో నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటనపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ నిర్వహించిన బంద్ సందర్భంగా సుమారు 600 మందిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. వారిలో సగం మందిని మైనర్లుగా గుర్తించి విడుదల చేయగా, మిగిలిన వారిని జైలుకు తరలించారు. ఆ తర్వాత కేసులను ఉపసంహరించుకుంటామని రాష్ట్ర హోంశాఖ ప్రకటించినప్పటికీ.. ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఎంతమంది విద్యార్థులు విడుదలయ్యారు?, ఎంతమంది జైలులో ఉన్నారనే విషయంపై అధికారిక జాబితాను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అయితే.. ఈ నిరసనలకు స్వతంత్ర ఎంపి పప్పూ యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ రామ్ మద్దతు తెలిపారు.

# టికెట్ లేని ప్రయాణికులపై ఉక్కుపాదం

## ఒక్కరోజు ప్రత్యేక తనిఖీల్లో 4,121 మంది పట్టివేత.. రూ.30.53 లక్షల జరిమానా వసూలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టికెట్ లేకుండా, అక్రమంగా ప్రయాణించే వారిపై దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ఉక్కుపాదం మోపింది. జోన్ వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన భారీ టికెట్ తనిఖీ ప్రత్యేక డ్రైవ్‌లో టికెట్ లేని ప్రయాణికులతో పాటు బుక్ చేయని సామాను తీసుకెళ్లిన వారిపై విస్తృతంగా చర్యలు చేపట్టింది. ఈ ఒక్కరోజు తనిఖీల్లోనే 4,121 మంది నిబంధనలు ఉల్లంఘించిన ప్రయాణికులను గుర్తించి రూ.30.53 లక్షల జరిమానా వసూలు చేసింది. సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల పరిధిలో ఆగస్టు 3న ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 169 రైళ్లలో 186 మంది టికెట్ తనిఖీ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. టికెట్ లేని ప్రయాణికులు, అక్రమంగా ప్రయాణించే వారు, బుక్ చేయని సామాను తీసుకెళ్తున్న వారిని గుర్తించడంపై ప్రత్యేక దృష్టి సారించారు.అదేవిధంగా రైల్వే ప్రాంగణాల్లో చెత్త వేయడం, ధూమపానం చేయడం, అనధికారికంగా వ్యాపారం (హాకింగ్) నిర్వహిస్తున్న వారిపైనా చర్యలు తీసుకున్నారు. చెత్త వేయడంతో 35 మందికి రూ.7,300 జరిమానా విధించగా, 19 మంది అనధికారిక హాకర్ల నుంచి రూ.38 వేల జరిమానా వసూలు చేశారు. రైల్వే ప్రాంగణాల్లో ధూమపానం చేసిన ఇద్దరికి రూ.4 వేల జరిమానా విధించారు.ప్రత్యేక తనిఖీల సందర్భంగా టికెట్ తనిఖీ సిబ్బంది ప్రయాణికులకు రైల్వే నిబంధనలపై అవగాహన కల్పించారు. టికెట్ లేకుండా ప్రయాణించడం, రైళ్లు, స్టేషన్లలో ధూమపానం చేయడం వల్ల కలిగే ప్రమాదాలు, చెత్త వేయకుండా పరిశుభ్రత పాటించాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వాణిజ్య విభాగం చేపట్టిన ప్రత్యేక తనిఖీలను అభినందించారు. టికెట్ తనిఖీలు టికెట్ లేని ప్రయాణాలను అరికట్టడంతో పాటు నిజాయితీగా టికెట్ కొనుగోలు చేసిన ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president Palla Venkat Reddy, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, Editor : Makkena Subbarao, E-mail : editorprajapaksham@gmail.com